సర్వస్వామ్యములు : రచయితవి
ద్వితీయ ముద్రణ : 2000

| | | |
|---|---|---|
| ప్రతులు | . | 1000 |
| ప్రాప్తి స్థానము | : | శ్రీస్వామి కృప పబ్లికేషన్స్ |
| ప్రచురణ | : | గొలగమూడి |
| వయా | : | వయా సర్వేపల్లి, నెల్లూరు జిల్లా - 524 321. (ఆం.ప్ర) |
| వెల | : | రూ. 15.00 |
| ముద్రణ | : | |


## ఆశీస్సులు

ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టర్‌గారి శిష్యులు, శ్రీ సాయినాథుని భక్తులు, శ్రీస్వామివారి ఆశీస్సులు కోరుతూ దర్శనార్థంగొలగమూడికి వచ్చే ఒక భక్తుని సహకారంతో ఈ గ్రంథం ముద్రించడమైనది. శ్రీస్వామివారి ఆశీస్సులు వారి కుటుంబానికి అనుగ్రహించమని శ్రీస్వామివారిని ప్రార్థిస్తున్నాను.

**పెసల సుబ్బరామయ్య**


## ప్రార్థన

గురు మధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితోగురుః
గురు ర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవేనమః

## అంకితము

నను గన్న తల్లిదండ్రుల కంటే నన్నధికముగా ప్రేమించి ఆదరించి, నాలో ఆధ్యాత్మిక చింతన అనే విత్తనాలు మొలకెత్తించి, మహనీయుల దర్శన ఆశీస్సులిప్పించి, వారి దివ్యలీలలు సేకరించి పుస్తకరూపంలో ప్రచురించుటకు ఎంతో శ్రమ కోర్చి సహకరించిన మహనీయ మూర్తిగా నా హృదయములో శాశ్వతంగా నిలచి, వారనుగ్రహించిన ఆలోచనాసరళి ద్వారా ఈ గ్రంథము ముద్రించబడిన శుభసమయములో ఈ గ్రంథాన్ని ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు గారి దివ్య పాదార విందములకు సమర్పిస్తున్నాను.

ఆచార్య శ్రీ భరద్వాజ దేవోభవ



**ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు గారు**
భగవాన్ శ్రీ వెంకయ్యస్వామియే నమః

# శ్రీ స్వామి సన్నిధి
# వినయాంజలి

ఈ చిన్న గ్రంథము వ్రాయుటలోని నా అవసరాన్ని ప్రేమైక మూర్తిమైన శ్రీస్వామివారికి విన్నవించుకొనుచున్నాను.

పరమకారుణ్య మూర్తివైన ఓగురుదేవా! నామనస్సు నిరంతరము నీస్మరణలో రమించునట్లు అనుగ్రహించు తండ్రీ! తమరు నాపై వర్షింపజేసిన కృప నాలోనిదొంగల పాలు గాకుండా నిరంతరము కాపాడమని పరమపావనము ఆద్యంతరహితములైన తమ పాదపద్మముల కడనిలచి సవినయముగా విన్నవించుకొనుచున్నాను, ప్రభూ!

మీ పరమ భక్తుల జీవితాలను స్మరించి, వారాచరించి చూపిన సద్గుణాలను నాకు ఆచరణ యోగ్యము చేయవే, వరదా! "చూచి నేర్చుకోమని" తమరు సెలవిచ్చిన వాక్యము ఆచరణ యోగ్యము చేయనట్లు ఈ చిన్న గ్రంథమందు తమ దివ్యవాక్కు పలికించి నన్ను అనుగ్రహించమని తమదివ్య పాదారవిందముల చెంత సవినయముగా ప్రార్థించుచున్నాను తండ్రీ!

తమ కృప పొందుటకు దైవీసంపద ఆచరణ యోగ్యము కావలెనుగదా. ఈ దైవీ సంపద నిన్నాశ్రయించిన నీ సేవకులకు ఎంత చక్కగా తమరు ఆచరణ యోగ్యము చేశారో తలచుకొనుటకు వీలుగా ఈ చిన్నగ్రంథమందు తమరే పలుకవలెనని ప్రార్థించుచున్నాను ప్రభూ! ఈ గ్రంథ రచనద్వారా అయా సద్గుణాలు నాకునూ ఆచరణ యోగ్యముకావలెననెడి తీవ్ర పరితాపము నాలోకలిగి, తమ కృపవలన ఆసద్గుణాలు నాకునూ సహజ సిద్ధమగునట్లు అనుగ్రహించి కావవే వరదా!

తమ సేవకులు చూచేందుకు, అందరు మానవుల వలె సర్వసాధారణంగా కనిపించినా ఆచరణలో వారిలోని సహజసిద్ధమైన సద్గుణాలే వారు తమకు సమర్పించే సుగంధపుష్పాలు. ఆ సద్గుణాలే వారిని తమపవిత్ర సన్నిధికి చేర్చాయి. తమరు మానుండి ఆసించే నిజమైన గురుదక్షిణ అదే గదా గురుదేవా!



ఈ మహనీయ మూర్తులందరూ తమ భౌతిక జీవితచివరి రోజులలో ఎవ్వరిసేవనూ తీసుకునే అవసరంలేకుండా, వీరిని తమరు తమలో ఐక్యము చేసుకున్నారు. ఆక్షణం వరకు ఎదుటివారితో మాట్లాడుతూ వారు అలా వెళ్ళీ వెళ్ళకముందే ఈ సేవకులందరూ తమను మనసారా స్మరిస్తూ తమలో ఐక్యమయ్యారు. ఆచివరి శ్వాసలలో వారు తమ దివ్యమంగళ రూపాన్ని స్మరిస్తూ తమతో ఐక్యమయ్యే మహద్భాగ్యమునకు నోచుకొన్న వారి భాగ్యమే నిజమైన భాగ్యము గదా! ప్రభూ, అట్టి మహద్భాగ్యమునకు నేనర్హుడనగునట్లుగా నన్ను తీర్చిదిద్దవే వరదా!

# శ్రీ మల్లిక వెంకయ్య గారు

ఆధ్యాత్మిక సాధనలో సాధకుడు సర్వమూ గురుచరణాల కడ సమర్పించి ప్రతిచిన్న విషయానికీ గురువునే పరమగతిగా నమ్మి, వారిపై ఆధారపడి జీవించాలని శాస్త్రవాక్యం. సర్వబంధాల నుండి విడివడి భిక్షువుగా జీవించాలని, దైవీసంపద వారికి సహజసిద్ధమైన ఆచరణకావలెనని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అట్టి దైవీ సంపదలో మొదటి లక్షణం అభయం

'అభయం సత్వ సంశుద్ధి: జ్ఞానయోగ వ్యవస్థితిః............. 'అని భగవద్గీత దైవీ సంపద అంటే ఏమిటో ఏఏ గుణాలు సాధకుడు తనకు సహజసిద్ధమైన ఆచరణయోగ్యం చేసుకోవాలో చెప్పింది. ఈ గుణాలు తాను ఆచరణయోగ్యం చేసుకునేందుకు వివేక విచారాలు, సత్‌సంగాలు, సాధుసాంగత్యములోపడే పాట్లన్నీ, సాధన అనబడుతాయి.

వీటన్నింటినీ శ్రీమల్లిక వెంకయ్యగారు ఎన్ని జన్మల నుండి సాధించి తన సొంత ఖజానా చేసికొనియున్నారో వారినిత్య నిజజీవిత ఆచరణలో చూడవచ్చు.

అట్టి మహనీయుల ఆచరణ చూచి మనలను కూడా అలా జీవించడం నేర్చుకోమని శ్రీస్వామివారు "చూచి నేర్చుకోండయ్యా'అని శెలవిచ్చారు. అలాంటి సహజ సిద్ధమైన ఆచరణ లేకుండా శ్రీస్వామివారి వలె మంటలెయ్యాలి, తాటాకుపై కూర్చోవాలి అని కొన్నింటినే ఆచరింపబూనడం హాస్యాస్పదమవుతుంది. ప్రయత్న పూర్వకంగా ఆంతరంగిక, మానసిక శుద్ధి సాధించి సహజసిద్ధం చేసుకోవడమే శ్రీ స్వామివారి "చూచి నేర్చుకోండయ్యా" అనే హితబోధలోని రహస్యమని మనం గుర్తించాలి.

అలా మనం ఆచరించలేనపుడు కరుణామయుడైన శ్రీ స్వామివారి నుండి మనం పొందిన రక్షణ, తీర్చుకున్న కోరికలు అన్ని వ్యర్థమే. కారణం, వారు తమ తపోశక్తి దారబోసి మనలను రక్షించినదెందుకు? వారు ఆచరించిచూపిన ధర్మమార్గంలో ధైర్యంగా నడువవలెనని మాత్రమే. ఏఏ జీవి ఏమేమి అనుభవించాలో ఆ జీవికి ఏమేమి లభ్యం కావాలో ఆ జీవి పుట్టకముందే ఆయా జీవుల పూర్వజన్మల పుణ్య పాపాల ననుసరించి నిర్ణయించబడుతాయి. భయంచేత అధర్మానికి పాల్పడడంవలన ప్రస్తుత జన్మలో ఈ శరీరం పొందేదేమీలేదు. రాబోవు జన్మలకు కష్టాలు కొనితెచ్చుకొనడం తప్ప. భగవంతుడు (శ్రీవెంకయ్యస్వామివారు) ధర్మస్వరూపుడు. వారిని వెంబడించినందున వారు తమ కృపాదృష్టితో, అవసరమైతే, మన కష్టాలను దగ్ధమొనర్చి మనకు శాంతి సౌఖ్యములివ్వగల సమర్థులు. "సత్యం ధర్మం తప్పవద్దు, సద్గురుని సేవించు. సంపన్నత్వం సాధారణత్వం సాధించు" అన్నదే వారి హితబోధ యొక్క సారాంశము సర్వులమూ గుర్తింతుము గాక!

**ప్రధమ దర్శనం:** శ్రీస్వామివారి పేరు సొంపల్లి వెంకయ్య శ్రీ స్వామివారి సేవకుని పేరు మల్లిక వెంకయ్య. ఇరువురి పేర్లు ఒకటే కావడం దైవలీలే. ఇది మొదలు, వెంకయ్య అనే పేరు వచ్చినచోటంతా మల్లిక వెంకయ్యగా భావించ మనవి. శ్రీ స్వామివారిని గూర్చి ఎవరో చెప్పగా విని శ్రీవారిని చూడాలని వచ్చాడు వెంకయ్య. ఈయనను చూస్తూనే శ్రీస్వామివారు "అయ్యా మనిద్దరం చాలా జన్మ



లుగా కలిసే వస్తున్నాము. రామేశ్వరంలో నేను మేనేజరుగాను నీవు పెద్దగుమస్తాగాను ఉండేవాళ్ళము. చాలా జన్మల నుండి మనిద్దరం కలిసే వస్తున్నాము.

ఈ ప్రాంతంలో నీ బాకీలన్నీ తీరిపోయాయి. నీవు నాదగ్గర ఉండయ్యా" అన్నారు. అందుకు కీయన "స్వామీ! నేను మీ దగ్గరకొస్తే భిక్షకు దబరెత్తుకొని కూటికి (అన్నానికి) పోవాలి. అది నావల్ల గాదు, నేను రానుస్వామీ" అన్నాడు.

శ్రీస్వామి: అట్లా పోబళ్ళేదయ్యా, మా ముఠాకు నాయకుడుగా ఉండి వీళ్ళందరి చేత కట్టెలు కొట్టిస్తుండు సరిపోద్ది!

వెంకయ్య: నాకు తేలు మంత్రము, పాము, కాటేరు, దయ్యాలు, పోలేరమ్మ మంత్రాలు నేర్పిస్తే వస్తాను.

శ్రీస్వామి: అట్లాగే నేర్పుతాలేరాయ్యా

శ్రీస్వామివారు ఈయనకు ఆ మంత్రాలు నేర్పడమేగాక వాటి ఉచ్చారణా దోషాలు సరిచేసి ఆయా మంత్రాలకు పాటించవలసిన నియమనిష్టలు కూడా చెప్పారు. ఇక్కడే శ్రీ మల్లిక వెంకయ్య గారి గొప్పదనం మన కర్థమవుతుంది. (1) ఎంతో పూర్వపుణ్యము ధర్మనిరతి, గత జన్మలలో సద్గురుడైన శ్రీస్వామివారిని సేవించిన అనుబంధము లేకుంటే, శ్రీస్వామివారే స్వయంగా వీరిని తన సేవకురమ్మని పిలువరు. నాకు (రచయిత) తెలిసనంతవరకు శ్రీస్వామివారు తన నోటి వెంట తన దగ్గరకు రమ్మని వీరినిదప్ప ఇతరులను పిలచియుండలేదు. మిగిలిన వారందరూ వార్కికై వారే గాని, లేక వారి కోరికపై శ్రీస్వామివారి అంగీకారము పొందిగాని, శ్రీస్వామివారి సేవకు వచ్చిన వారే అయియున్నారు.

(2) అంతేగాక వీరిపరోపకార బుద్ధి ఎంతగొప్పదో చూడండి. తన స్వార్థమునకు తన తరింపునకుగాను తనకు మంత్రోపదేశం చేయమని అడుగలేదు. ఇతరుల

మస్సు కోరకు ఇతరుల బాధలు తీర్చేందుకు తనకు తేలు, పాము, దయ్యం మొ॥ మంత్రాలు నేర్పమని అడిగారు. ఆవిధంగా ఆ మంత్రాల ద్వారా తాను సకల జీవులకు నిష్కామంగా సేవచేయాలనే తపన వీరికుండేది. ఆవిధంగా సేవచేయాలంటే ఆయా మంత్రాలను సిద్ధిచేసికొనుటకు తాను కఠిన నియమాలు పాటించాలి. అమావాస్య, పౌర్ణమినాడు తానెక్కడున్నా సముద్రమునకు వెళ్ళి కంఠంలోతు నీటిలో జపం చేయాలి. వీరి చివరిదశ వరకు ఈ రహస్యం అందరికీ తెలిసిన విషయమే. ఇలాంటి కఠిన నియమాలన్నీ తన తరింపునకు కాదు. ఇతరుల సుఖం కోసం మాత్రమే. ఇలాంటి నిష్కామ సేవాభావం నరనరాల్లో జీర్ణించుకొనియున్న ధన్యజీవి. కనుకనే శ్రీస్వామివారు వీరిని తనతోగూడ ఈలోక కళ్యాణ కార్యములో సహకరించి తరించమని తనసేవకు స్వయంగా ఆహ్వానించారు.

**జీవిత విధానము:** శ్రీ మల్లిక వెంకయ్యగారు గురువుకు తగ్గ శిష్యుడుగా జీవించారు. శ్రీస్వామివారు ఎవరికెంత మొండి వ్యాధి నయంజేసినా వారు ఎంత ప్రాధేయపడినా వారినుండి పైసా స్వీకరించేవారు కాదు. వారి సత్కారాలందుకునేవారు కాదు. ఇదేవిధంగా శ్రీ వెంకయ్యగారు కూడా ఎవ్వరినుండి ఏమీ ఆశించిఎరుగరు. ఈయన చేసిన మేలు గుర్తుపెట్టుకొని వీరిని భోజనానికి పిలచి క్రొత్తబట్టలు పెట్టాలని ఇతర సత్కారాలు చేయాలని ప్రయత్నించిన వారూ ఉన్నారు. కానీ వారలాంటి మర్యాదలు తనకు చేయబూనినట్లు పసిగట్టారంటే వారి ఇంటికివచ్చిన వాడల్లా "అమ్మా నేను అర్జంటుగా దొడ్డికి వెళ్ళి రావాలి. ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ వెళ్ళి, ఇక పదిరోజుల వరకు ఆ గ్రామఛాయలకే వెళ్ళేవారు కాదు. ఆ తర్వాత కనిపిస్తే 'ఏమి వెంకయ్యా' మొసం చేసి వెళ్ళావు' అని అడిగితే 'అక్కడొకాయన ఆపదగా ఉందని లాక్కుపోయాడమ్మా ఇక అట్లా అట్లా తీసుకపోయారు. రాలేక పోయానమ్మా, పాపం! నాకోసం మీరు చాలాసేపు ఎదురు చూచి ఉంటారుగదా. చెపితే వినరు ఏమిచేసేదమ్మా ఇంకొక రోజు వస్తాలే" అంటూ వెళ్ళిపోయేవాడు. నిజానికి అయన ఆసత్కారాన్ని పొందకూడదని తప్పించుకొనుటకు అలావెళ్ళిపోయాడేగాని ఎవ్వరూ పిలవనూ లేదు, తీసుకపోనూ లేదు.



శ్రీ స్వామివారికి వలె, వీరికి కూడా 'పిచ్చెంకయ్య' అనే బిరుదు ఉండేది. ఇద్దరు ముగ్గురు వెంకయ్యలు శ్రీస్వామివారి సేవలో ఉండుటవలన వీరిని పిచ్చెంకయ్య అనే పేరుతోనే వ్యవహరించి గుర్తిస్తుండే వారు. ఈయన మార్గాన నడుస్తూ ఒంటరిగా చేతులు త్రిప్పుతూ, గొణుక్కోవడం, 'ఎట్లా బ్రతుకుతారబ్బా' అని ప్రతిచిన్న విషయానికి ఎదుటివారిననడం లాంటి అనేక కారణాల వలన ఈయనకు పిచ్చెంకయ్య అని పేరొచ్చింది. చివరి శ్వాస వరకు మరుపూటకు ఆహార మెట్లా అనే యోచనలేకుండా బ్రతికిన ధన్యజీవి. అన్ని జీవులనూ పోషించే తన స్వామి తనకు తప్పక వేళకు ఆహారం అందిస్తారనే నమ్మకముగల ధన్యజీవి. చివరి శ్వాసవరకు చాకలింట ఒక జత, తన ఒంటిమీద ఒక జత బట్టలు మాత్రమే ఉన్న సాధు జీవి. ఏనాడు మాసిన గుడ్డ తన శరీరంపై ఉండనివ్వరు. ప్రతినిత్యం సబ్బుతో ఉతికి గుడ్డలు ఆరినంతవరకు కౌపీనం ధరించిఉండేవాడు.

ప్రతినిత్యం శ్రీస్వామివారి అగ్నిగుండమునకు అడవిలో కట్టెలుకొట్టి ఒంటి గంటకు ఆశ్రమంచేరి అప్పుడు కోనేటిలో స్నానము చేసి తనవంటి నున్న గుడ్డలు సబ్బుపెట్టి శుభ్రంగా ఉతికి ఆరబెట్టి ధరించి ఆ సబ్బును కర్రతుమ్మ పొదలో ఎవరూ చూడకుండా దాచిపెట్టేవాడు. తాను అడవినుండి తెచ్చిన ఎండు కట్టెలు కడిగి ఆరబెట్టి వాటిని ఎంతో వినయ విధేయతలతో నిత్యం అగ్నిగుండమునకు ప్రదక్షిణ చేసి సమర్పించాకనే భోజనానికి వచ్చేవాడు.

**అన్నంతినే విధానము:** అడవిలో కట్టెలు కొట్టి కోనేటిలో గుడ్డలుతికి స్నానం చేసి అగ్నిహోత్రానికి కట్టెలు సమర్పించి వచ్చేసరికి మధ్యాహ్నం మూడుగంటలయ్యేది. అప్పటికి ఆశ్రమంలోని అమ్మగారలందరూ భోంచేసి మంచినిద్రలో ఉండేవారు. శ్రీ వెంకయ్యగారు వెళ్ళి తన మట్టి మూకుడు (అన్నం తినే పాత్ర) తీసుకొని వాకిలి దగ్గర నిలబడి ఎవరైనా అటు వస్తారేమో కొంతసేపు చూచిగాని పిలిచేవారు కాదు. రెండు మూడు పిలుపులకు కాని నిద్రిస్తున్న ఆస్త్రీలు పలికేవారు కాదు. వాళ్ళు నిద్రమబ్బున లేచి "నీకెప్పుడూ తిండికి వేళా పాళా లేదు. ఇప్పుడా కూటి కొచ్చేది" అంటూ అంత అన్నం తెచ్చి బిక్షగానికి

వేసినట్లు ఆమట్టి పాత్రలో వేసేవారు. "కూరా కేమీ లేదు వెంకయ్యా అందరూ తినేశారు. పచ్చడైనా ఉందోలేదో' అంటూ ఏది ఉంటే అది అంత వేసేవారు. ఏమీ లేకుంటే చారు పోసేవారు. అదీ లేకుంటే అంత ఉప్పువేసి యర్రగడ్డ చేతికిచ్చేవారు. మారుమాట్లాడకుండా ఆ అన్నం భగవత్ ప్రసాదము, గురుప్రసాదంగా తీసుకువెళ్ళి గన్నేరు చెట్ల క్రిందకూర్చొని అక్కడికొచ్చిన కుక్క కంత ముందుపెట్టి కొంచెం కాకులకువేసి తరువాతనే తాను సేవించేవారు. అందరూ తినేచోట కూర్చొని తినడం అరుదు. అంతేగాని ఏమమ్మ ఎర్రని ఎండలో గుండానికి కట్టెలు కొట్టివస్తే అంత కూర కూడ ఉంచరే. మజ్జిగన్నీ మీరే తాగేశారే అని ఏనాడూ తగవులాడి ఎరుగరు. అందరిలాగా అది తీసుకరా, ఇది తీసుకరా అని రుచులు కోరి మారుపెట్టిం చుకొని ఎరుగరు. "పెట్టిన చోట తినడు, తినినచోట పడుకోడు, పడుకున్న చోట భిక్ష స్వీకరించడు, అని భిక్షువునకు శాస్త్రంలో చెప్పిన లక్షణాలన్ని శ్రీ వెంకయ్యగారికి సరిగా సరిపోయాయి. సాధకుని లక్షణాలు సహజసిద్ధం కావడమంటే నిజంగా ఇదేగదా!

నేను (రచయిత) వీరితో కలసి మూడు నాలుగు సంవత్సరాలు ఆశ్రమంలో నివసించాను. నాతో వీరెప్పుడు మాట్లాడినా శ్రీస్వామివారు తనకు మంత్రాలు చెప్పిన విషయాలు తనను శ్రీస్వామివారు ఎప్పుడెప్పుడు ఎలా రక్షించినది, తాను శ్రీస్వామివారిని ప్రార్థిస్తే, ఎవరెవరికి ఎలాంటి జబ్బులు శ్రీస్వామివారు తగ్గించినది ఇలాంటి అనేక స్వామివారి లీలలు చెప్పేవాడేగాని పామరులవలె 'అతడిలాంటివాడు, ఈమె ఇలాంటిది' అని పరదూషణ, పరస్తుతి ఏనాడూ చేసి ఎరుగడు. "నాభినందతి నద్వేష్టి" అనేది వీరికి ఎంతగా స్వతసిద్ధమైనదో! (ఎవరినీ అభినందించడు, ద్వేషించడు)

**నిర్వైరి:** ఎవ్వరితోను వైరమే లేనివాడు. ఎవరైనా తనను అపార్థంచేసుకొని తగవులాడినా ఒకటి రెండు మాటలతో తన వాదన చెప్పి అటు తర్వాత అక్కడ ఉండకుండా "ఎట్లా బ్రతకుతారబ్బా వీళ్ళు, ఎట్లా బ్రతుకుతారు" అని తనలో తాను పెద్దగా అనుకుంటూ వెళ్ళిపోయేవాడు. ఎదురు మాట్లాడి తగవులాడి



ఎరుగరు. అందుకే అందరూ "పిచ్చెంకయ్య" అని వీరిని పిలిచేవారు. చిన్నప్పుడు శ్రీస్వామివారిని కూడా ఇదేవిధంగా పిలిచేవారు గదా!

ఎప్పుడైనా అరుదుగా, ఆశ్రమము ప్రక్కన దగ్గరలో నున్న మా ఇంటికివచ్చి "అమ్మా! నాలిక్కురాసుకునేందు కేమైనా అంతుంటే పెడతారా" అంటూ తలగీరుకుంటూ బయటనిలబడేవాడు. నిమ్మకాయ ఊరగాయో, చింతకాయ పచ్చడో చేతిలో వేస్తే ఎంతో సంబరంగా వెళ్ళేవాడు. ఒక్కొక్కప్పుడు వచ్చి ఇంటి బయట నిలబడి కోమిటింట మూడు రోజులు తినమని శ్రీస్వామివారాజ్ఞాపించారు. రెండు పూటలు ఒకచోట భోంచేశాను. రేపు ఒక్కపూట మీ ఇంట్లో తింటా నమ్మా' ' అంటూ వినయంగా అర్థించేవారు. అన్నం తయారుచేసి ఎదురు చూస్తుంటే ఒక్కొక్కసారి వస్తారు. ఒక్కొక్కసారి రారు. "ఏం వెంకయ్యా నిన్నరాలేదే?" అంటే "ఏందోలేమ్మా పిచ్చిపాడు అట్లాబడి పోయానులే. ఇంకొకసారి తింటాలేమ్మా" అంటూ వెళ్ళిపోయేవాడు.

**మంత్రసిద్ధి:** "చెట్టు యొక్క ప్రాస్త్యం ఆ చెట్టుకు కాచే పండ్ల వలన మాత్రమే తెలుస్తుంది. అలాగే మహనీయుల గొప్పదనం వారు తయారుచేసే శిష్యుల ద్వారా తెలుస్తుందని" పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజ గారి పలుకులు నిత్య సత్యాలు చుట్టుప్రక్కల అనేక గ్రామాలలో శ్రీ వెంకయ్యగారు మకుటంలేని రాజుగా ఖ్యాతిగాంచారు. శ్రీస్వామివారి దారం, విభూతి ఇచ్చి పై పంచెలోని గుడ్డచించి, సన్న పేలికకట్టి మంత్రంవేసే వాడు. కలరా, నెరిణి, మసూచి, గాలికుంటు వంటి జబ్బులు తిరుగులేకుండా పోయేవి. 'ఇది శ్రీస్వామివారి మహిమ, వారిని దర్శించి నమస్కరించి మీ కృతజ్ఞతాభావం తెలుపండి' అనే వాడేగాని తన మంత్ర ప్రభావమని గర్వించి ఎన్నడూ ఎరుగడు. శ్రీ స్వామివారి గుండానికి కట్టెలు తోలేందుకు సేద్యపు పనుల కాలంలో కూడా రైతులు శ్రీవెంకయ్యగారిని చూచి బండికట్టి తోలేవారు. ఆశ్రమం తరపున ఇతరులు వెళితే బండి లేదనవచ్చు, కాని శ్రీవెంకయ్య వెళ్ళితే అలా చెప్పేవారు కాదు.

ఇక్కడ ఆచార్య భరద్వాజ మాష్టరుగారు చెప్పినట్లు కర్మ నిష్కామ కర్మ నిర్వచనం స్మరించడం మంచిది. స్వార్థములేని కర్మ, నిష్కామ కర్మ. కాని, ఇలాంటి కార్యక్రమాలలో మనకు తెలియకుండానే, అంతరాత్మలో కామం తొంగిచూస్తుంది. పని సఫలమైతే సంతోషిస్తాము. విఫలమైతే బాధపడుతాము. కార్యములో వున్న కామమే అందుకు కారణం. కార్యమేమైన మన మనస్సు లబలబ లాడకుండా నిశ్చలంగా వుండగలగడమే నిష్కామకర్మ. అదే Acid Test అంటారు. మాష్టారుగారు.

**కైవల్యము:** చివరి శ్వాసవరకు గురుసేవ చేసిన ధన్యజీవి చిట్టచివరి రోజుకూడ అడవికి వెళ్ళి అగ్ని హోత్రానికి కట్టెలు కొట్టి తెచ్చాడు. ఆ రోజు సాయంకాలము తనకు కడుపులో నలతగా వుందని విరోచనమైతే బాగుండునని తన సహచరుడు, శ్రీస్వామివారి సేవకుడైన, శ్రీ కొమరగిరి రమణయ్య దగ్గర ఏదో ఆకుపాడి పెట్టించికొని తిన్నాడు. నాలుగుసార్లు విరోచనాలయినాయి. మనిషి చాలా డీలా అయిపోయినాడు. లేవలేకున్నాడు. వెంటనే నెల్లూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. సెలయిన్ యిచ్చి మందులు వాడాక బాగా నెమ్మదించింది. అర్ధరాత్రికి నిశ్చలంగా ధ్యానస్థుడై శ్రీస్వామివారి చైతన్యంలో ఐక్యమైపోయాడు.

**సద్గతి:** దేహత్యాగము చేశాక 36 గం॥ లు తరువాత కూడ వారిముఖములోని దివ్యకళ భక్తులను ఆశ్చర్యపరిచింది. ప్రతి అవయవము సజీవుల అవయవాలవలె చక్కగా వంగుతున్నాయి. చొక్కా విప్పడం సునాయాసమయింది. స్నానము చేయించారు. ఏ అవయవము బిగిసి పోలేదు. యోగశాస్త్రము ప్రకారము కాళీపొట్టతో ధ్యానం చక్కగా కుదురుతుందని ప్రతీతి. విరోచనాలద్వారా శరీరంలోని మలినాలను తొలగించారు, శ్రీస్వామివారు. పూర్తి స్పృహప్రజ్ఞలతో ధ్యానం చేస్తూ దేహత్యాగం చేయడం ఎందరు సాధకులకు వీలవుతుంది! అకుంఠిత విశ్వాసానికి, సేవాతత్పరతకు ధీరోదాత్తమైన జీవన విధానానికి సిసలైన సాధుజీవనానికి



మచ్చుతునకగా, ఆదర్శప్రాయుడిగా ఈ లోకంలో శాశ్వతంగా నిలిచేటట్లు శ్రీవెంకయ్యగారిని చేశారు శ్రీస్వామివారు. తన కృపతప్ప ఇతర నేమీ కోరక తనను సేవించాడు, గనుకనే, వెలలేని తన సాన్నిధ్యమే చివరి శ్వాసలో శ్రీ వెంకయ్యగారికి ప్రసాదించి తనలో ఐక్యము చేసుకున్నారు. ఇదే, మనందరిని, చూచి నేర్చుకోమని శ్రీస్వామివారు మనకిచ్చే దివ్యసందేశము.

ముని కన్నెకల బారినుండి రక్షించడం, కంటేపల్లెలోని గాలికుంటు నివారించడం, నాగుపాము కాటు వేయకుండా రక్షించడం, శ్రీస్వామివారు ప్రసాదించిన ఉప్మా గుండంలో వేయమంటే వెంకయ్యగారు తినడం మొదలగు విషయాలు 'అవధూత లీల'లో చూడగలము.

పరమకారుణ్యమూర్తికి జై!!

## శ్రీపోలిరెడ్డిగారు

వీరు కడపజిల్లా లెక్కల వారిపల్లె అనే గ్రామస్తులు. వీరు శ్రీస్వామివారి సేవకొచ్చే నాటికే వీరి భార్యగారు స్వర్గస్తురాలైయున్నారు. వీరికి ముగ్గురు మా పిల్లలు. పొడగరి, సన్నంగా అరవై సంవత్సరములకు పైన వయసుంటుందని అంచనా. అడ్డపంచకట్టుకొని ఎప్పుడూ హుసారుగా ఉండేవారు. అరవై సంవత్సరాల వృద్ధులని పించేవారు కాదు.

వీరు సాధనలో ఎంతో ఉన్నతమైన దశలో నున్నా రనడం నిర్వివాదాంశము. మిగిలిన విషయాలన్నీ అలా ఉంచి ఎవరి ఆహ్వానముతో పనిలేకుండా శ్రీస్వామివారే షుమారు నలభైకిలో మీటర్ల దూరం నుండి వచ్చి వీరి దేహన్ని స్వహస్తాలతో సమాధి చేయడమే ఇందుకు నిదర్శనము. వీరు శ్రీస్వామివారి సేవకు రాకపూర్వం శ్రీ ఎరుకల కొండయ్య, కడపజిల్లా అనే సిద్ధ పురుషుని సేవలో ఉండేవారట. శ్రీ కొండయ్యగారు సిద్ధి చెందుతూ వీరిని శ్రీస్వామి వారి సేవకంపినట్లుగా తెలుస్తున్నది.

గొలగమూడి ఆశ్రమంలోని సమాదుల వరుసలో వీరిది రెండవ సమాదియైయున్నది. కానీ ఆశ్రమంలో సమాదిచెందిన వారిలో వీరిదే మొదటి సమాది. అంటే సిద్ధిపొందిన శ్రీ స్వామి వారి సేవకులలో వీరే మొట్టమొదట సిద్ధిపొందినవారు. వీరు శ్రీస్వామివారి నుండి ఏమీ ఆశించక నిస్వార్థంగా శ్రీస్వామివారిని చివరి శ్వాసవరకు వదలకుండా కొన్ని సంవత్సరములు మాత్రమే సేవించిన ధన్య జీవి. కాకి, కలకాలం జీవించినా సాధించేదేమీలేదు. శ్రీస్వామివారి స్వహస్తాలతో సమాది చేయించుకున్న వీరి జీవితమే, చిలుక జీవితం. అదే మనందరికీ ఆదర్శప్రాయమైనది.

శ్రీస్వామివారెప్పుడు, ఎక్కడ విడిది చేస్తారనేది ఎవ్వరికీ తెలియదు. ఒక్కొక్కప్పుడు చుట్టు ప్రక్కల సమీపంలో ఏగ్రామంలేని ప్రదేశంగాను, నరసంచారంలేనిప్రదేశంగాను చూచి, విడిది చేసేవారు. శ్రీపొలిరెడ్డిగారెప్పుడూ తన అరల సంచిలో కొన్ని వంకాయలు, మిరపకాయలు, చింతపండు, ఉప్పు, యర్రగడ్డలు, తెల్లగడ్డలు సిద్ధంగా ఉంచుకునేవారు. శ్రీస్వామివారికి రాగిజావ తయారుచేసి అందులో నంజుకొనేందుకు తన సంచిలో దాచిన పదార్థాలతో, ఎడారిలోనైనా సరే సాదకం తయారుచేసి శ్రీస్వామివారికి సమర్పించేవారు. ఎక్కడైనాసరే శ్రీస్వామివారు, విడిది చేసిన వెంటనే, ఆ చుట్టుప్రక్కల ప్రాంతములోని ఆకుకూర , నామస్మరణచేస్తూ సేకరించి, వండి శ్రీస్వామివారికి నివేదించేవారు. శ్రీస్వామివారా కూరనెంతో ప్రీతితో, తినేవారు. శ్రీస్వామివారి ఆజ్ఞలను వీరు తు॥చ॥ తప్పక పాటించడమే ఇందుకు కారణమని నేను తలుస్తాను.

కౌపీనం ధరించి దానిపైన ఒకటవల్ మొలకు చుట్టుకొని యుండేవారు. ఎప్పుడూ ఏకాంతప్రియులు ఎవరెన్ని చెప్పినా (లోక వ్యవహారాలు, పితూరీలు) వింటారే కానీ తిరుగు చెప్పేది లేదు. వారు 'ఊ' కొట్టేదానికి మనం చెప్పేదానికి సంబంధమే లేదని వీరు, మనం చెప్పేది వినడంలేదని తన ధ్యాసలో తానున్నారని ఆచెప్పేవారికి కొంతసేపటికి తెలిసి వారే విరమించుకొని వెళ్ళేవారు. ఎల్లప్పుడూ ఎండలో కూర్చొవడమంటే చాలా ఇష్టపడేవారు. మండుటెండలో



కూడా దూరంగా వెళ్ళి ఎండలో కూర్చొని భోంచేసేవారు. ఒక గ్లాసుడు కాఫీలో రెండు గ్లాసులు నీళ్ళుపోసి అందులో చారెడు మిరప్పొడి పోసి, ఉంటే, కొంచెం కూరగూడా అందులో వేసి మొత్తం బాగా త్రెళ్ళబెట్టి దాన్నంతా, బాగా, వేడిగా త్రాగేసి, ఆ మండుటెండలో ఉన్న, ఆవేడి పొయ్యి దగ్గర బూడిదలో పడుకొని హాయిగా నిద్రపోయేవాడు. "ఏమిటయ్యా! అలాచేస్తే నీ శరీరం బ్రతుకుతుందా? కనీసం నీడనన్నా పడుకోవయ్యా" అంటే "మీ దుంపతెగ, నా కాఫీ కాసిని త్రాగి ఎండలో పడుకో, అప్పుడు నీకు ఎండ చల్లదనం తెలుస్తుందని నవ్వేవాడు. వారి కాఫీ త్రాగేందుకెవ్వరూ సాహసించలేదు.!

తలుపూరు గ్రామ సమీపమందలి శ్రీరాజేశ్వరిగని దగ్గర, దోసెడు పచ్చి మిరపకాయలు కడిగి ముందు పెట్టుకొని తీరిగ్గా దోసకాయ తినినట్లుగా కమ్మగా నమలి తినేశారు. సేద్యపు పనులు చాలా చక్కగా చేసేవారు. వీరు త్రాడు వేసి నిలబెడితే నిలచోవాలట! మిషన్‌లో తయారైన త్రాడు కంటే ఎంతో చక్కగా వేసేవారు.

**కైవల్యము:** ఒకరోజు శ్రీస్వామివారన్నారు "అయ్యాః నలబయ్యవరోజున దేవుడు విచారణ కొస్తాడు. ఆరోజు నేనేగాదు ఆశ్రమంలో ఎవ్వరూ గంగ ముట్టకూడదు' అన్నారు. అప్పుడా మాటల కర్థం ఎవ్వరికీ తెలియలేదు. సరిగ్గా నలబయ్యవ రోజున శ్రీపొలిరెడ్డిగారు గొలగమూడి ఆశ్రమంలో సిద్ధిపొందారు. అదొక చిత్రమైన విషయము. అప్పటివరకు ఆరోగ్యంగానే అందరితో ఉన్నారు. ఎప్పుడూ ఏకాంత ప్రియులు గనుక ఒంటరిగా ఉన్న పొలిరెడ్డిగారు బిగ్గరగా మూడుమార్లు ఓంకారంజేసి తనువు చాలించారు. ఎప్పుడూ లేనిది ఈ రోజు వీరిలా బిగ్గరగా ఓంకారం చేస్తున్నారు ఏమిటా అని దగ్గరకు వెళ్ళిచూస్తే, వారు దేహత్యాగం చేసినట్లు తెలిసికొన్నారు.

ఆసమయంలో శ్రీస్వామివారు పర్యటనలో ఉండినందున, వారెచ్చట ఉండేది

## మాతాజీ తులసమ్మ గారు



మాతాజీ తులసమ్మగారు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పెనుబర్తి గ్రామంలో ఒక ఉన్నత కుటుంబమునకు చెందినవారు. వీరికి ఒకప్పుడు 1968 ప్రాంతములో కారు, ట్రాక్టరు కూడా ఉండేవి. వీరిని ఒక పిశాచమావహించి చాలబాధ పెట్టుతుండేది. దాని నివారణ కొరకు, ఈమె కసుమూరు - మస్తాన్‌వలీ, అనాసంద్రంపేట జౌలియాల సమాదులు దర్శించి చాలా డబ్బు ఖర్చు చేసింది. అయినా గుణం కనిపించలేదు. ఈమె శ్రీస్వామివారి చెంతకు రాకముందే శ్రీస్వామివారు "తూర్పు రాజ్యంలో మనకు అమ్మ ఉంది. ఆమె మనకు నాలుగు జన్మల నుండి అన్నం పెడుతుందయ్యా" అని తన సేవకులతో అప్పుడప్పుడూ అంటుండేవారట. వీరి మహిమను గూర్చి అమ్మ విని, వీరినొకసారి తన ఇంటికి తీసుకవస్తే బాగుంటుందని ఉభలాటపడింది. అదే గ్రామంలో, మోపూరు దశయ్య గారని, భజనల్లు చేస్తూ, చేయిస్తూ ఉండే ఒకరితో, తన కోరికను పంచుకుంది. వారు వెంటనే శ్రీస్వామివారి అడ్రసు కనుక్కొని వెళ్ళాడు. వీరి పిలుపుకే ఎదురు చూస్తున్న శ్రీస్వామివారు మొట్టమొదటిసారిగా పెనుబర్తి గ్రామం దర్శించారు. శ్రీస్వామివారి దర్శనంతోనే ఈమె నావహించిన పిశాచం యొక్క ప్రతాపం తగ్గింది. దానితో, మాతాజీ తులసమ్మ గారు శ్రీస్వామివారికి కూర్పు భక్తురాలై అనేక సార్లు శ్రీస్వామివారిని తన గ్రామం ఆహ్వానించి తన ఇల్లే, వారి విడిది చేసింది. అయితే ఈమెగారి ఏకైక కొమారునకు శ్రీస్వామివారి యందు శ్రద్ధాభక్తులు అప్పట్లో ఉండేవుకావు. తులసమ్మగారికి పిశాచం బాధ చాలా వరకు తగ్గినప్పటికి శ్రీస్వామివారి మాట తు॥ చ॥ తప్పక ఆచరించే గుణం మాత్రం అప్పటికి కలుగలేదు. శ్రీస్వామివారితో మాతాజీ తులసమ్మ గారి ప్రథమ పరిచయం గూర్చి తులసమ్మగారి మేనకోడలు, శ్రీమతి కె. సౌభాగ్యమ్మ గారు ఇలా వివరిస్తున్నారు.



"మాతాజీ తులసమ్మగారికి పూర్వజన్మసంస్కారాలు ఎంత గొప్పగా ఉండేవో వ్రాయశక్యముకాదు. వారు ఎక్కడ ఏమిచేస్తున్నా చక్కని ధ్యానస్థితి ఉండేది. ఈ స్థితిలో అప్పుడప్పుడూ ఆవళించేవారు. వీరికి సాధువులన్నా, ఫకీర్లన్నా, ముజావర్లన్నా చాలా ప్రీతి. అప్పుడప్పుడూ కసుమూరు మస్తాన్‌వలీ మహరాజ్ వీరి స్వప్నంలో కన్పించి దోశలు అడిగాడని చెప్పి దోశపిండి పెద్దగిన్నెలకు పెట్టుకొని తన సేద్యగానిచేత కావడికెత్తించుకొని మూడుమైళ్ళు నడచివచ్చి బస్సు ఎక్కి కసుమూరు కెళ్ళి దోశలు చేసి అక్కడుండే ముజావర్లకు పేదవారికి తనివితీరా తినపెట్టేవారు. నానాటికీ వీరిపరిచయాలు అధికమైనాయి. తులసమ్మగారి భర్త ధర్మ ప్రభువు కనుక ఈమెచర్యలను ఎక్కువగా పట్టించుకునేవారు కాదు. ఈ పకీర్లలో ఒకరు ఈమెగారి రెట్టకు ఒకతాయెత్తుకట్టి ఈమెను ఒకరోజు తీసుకపోతున్నాడు.

'తూర్పు రాజ్యంలోని మన అమ్మ మనకు నాలుగు జన్మల నుండి అన్నం పెడుతుందయ్యా"అని చెపుతున్న శ్రీ వెంకయ్య స్వామివారు ఈ ఆపద సమయములో ఈమెకు ఎదురై తన సేవకుల చేత ఈమెరెట్టకున్న తాయెత్తు విప్పిపారవేయించారు. ఆ దుండగుడైన ఫకీరు పలాయన మంత్రం పఠించాడు. అదిమొదలుకొని శ్రీమతి తులసమ్మగారికి శ్రీస్వామివారితో పరిచయమేర్పడి దినదినాభివృద్ధియై నిరంతరం శ్రీస్వామివారి సేవకంకితమై జీవితాంతము ఆ, మహనీయమూర్తి సేవలో తన శేషజీవితాన్ని మూడుపూవులు ఆరుకాయలుగా పండించుకున్న భాగ్యశీలి. తన టాక్సీకారులు, మిద్దెలు, మేడలు, పట్టుపాన్పులు, పంచభక్ష్యపరమాన్నాలు, సేవకజనాన్ని వదలిపాదరక్షలు లేని పాదచారియై, అనికేతయై (తనదంటూ ఒక నివాసంలేని) తాటియాకు, గోనెసంచుల పాన్పుపై శయనిస్తూ, పచ్చడిమెతుకులతో, తానే శ్రీస్వామివారి సేవకురాలై జీవితాంతం శ్రీస్వామివారి దివ్య సన్నిధిలో గడిపేందుకు గల బలవత్తర కారణం, ఈ అజ్ఞానలోకానికి గొప్ప రహస్యమే అయింది. ఆదివ్య రహస్యాన్ని తనజీవిత చివరిరోజులలో తనమేనకోడలునైన నాకీవిధంగా వివరించారు.

శ్రీస్వామివారు మహాసమాదిచెందిన తర్వాత నలుబది రోజులు ఆరాధనా

కార్యక్రమానికి వచ్చిన భక్తులందరూ కన్నీటితో తిరిగి గృహోన్ముఖులవుతున్న సమయము. మాతాశ్రీ తులసమ్మగారి దగ్గర , నేనొక్క దాన్నే ఏకాంతముగానున్నాను. తులసమ్మగారన్నారు.: అమ్మా! వీళ్ళంతా శ్రీస్వామివారు పోయారని ఎంతవెర్రిగా ఏడుస్తున్నారో చూచావుగదా! ఇదంతా వీరి అజ్ఞానం. శ్రీస్వామివారు ఎక్కడకు పోయారు. నారెట్టకు పకీరు కట్టిన తాయెత్తు విప్పిపారవేయించి రోజున ఎలా ఉన్నారో అదేవిధంగా శ్రీకృష్ణపరమాత్మరూపంలో వేణువు ఊదుచూ, నా ప్రుంచంచుట్టూ తిరుగుతున్నారు. ఈరోజు కూడ. నీకు కనిపించడం లేదా" అన్నారు. అంటే శ్రీస్వామివారు వీరికి ఆరోజు ఈరోజు కూడా శ్రీకృష్ణ సాక్షాత్కారం ప్రసాదించారన్నమాట'.

ఒకప్పుడు తులసమ్మగారు తన కొమారునకు వివాహము చేయగోరి శ్రీస్వామివారితో సంప్రదించింది. శ్రీస్వామివారు ఆవివాహము కంచిలోచేయమన్నారు. అందులకామె సమ్మతించనందున ఆ కరుణామయుడు తనమాటను మార్చుకొని ఎచ్చటైన ఒక దేవాలయంలో చేయమన్నారు. అందుకు కూడా ఆమె సమ్మతించనందున శ్రీస్వామివారా వివాహమును పెనుబర్తిలోగాని లేక అమ్మాయి గ్రామంలోగాని ఒకదేవాలయంలో చేయండి. ఇంటిలో సుతరాము వివాహము చేయవద్దని ఆజ్ఞాపించారు. కానీ మూర్ఖత్వమునకు హద్దులులేవు. ఆవివాహము ఇంటిలోనే జరిపించారు. ఆదపంతులకు బిడ్డలు కలుగకుండానే ఆమె చనిపోయింది. ఆయన రెండవ వివాహముచేసుకున్నాడు. ఆయన గారి పేరే ఆదినారాయణరెడ్డిగారు. తులసమ్మగారి ఏకైక పుత్రుడు. వీరికి శ్రీస్వామివారి ఎడల శ్రద్ధాభక్తులు లేనందున తులసమ్మగారిని కూడా చాలా తీవ్రంగా మనోవేదనకు గురిచేసేవాడు.

ఉదాహరణకు ఒకసారి శ్రీస్వామివారు వీరి మిద్దెపైన గుండం వేసుకొని ఏకాంతంగా ఉన్నారు. నారాయణరెడ్డిగారి కేమైందో తెలియదు. అంతుబట్టని ంతో శ్రీస్వామివారి బృందానంతా తన ఇల్లువదలి వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపిస్తూ మేశారు. చివరికొక కర్ర తీసుకొని శ్రీస్వామివారిని కూడా అనరాని మాటలంటూ



మిద్దెదిగి వెళ్ళిపొమ్మని దబాయించారు. శ్రీస్వామివారు అమాయకంగా మిద్దెమెట్లు దిగి క్రిందనిలబడి "వెళ్ళిపొమ్మంటాయ్యా" అని మిద్దిమెట్లపైన నిలుచొనియున్న ఆదినారాయణరెడ్డి గారిని నుద్దేసించి పలికారు. శ్రీ ఆదినారాయణరెడ్డిగారు కోపాద్రిక్తుడై శ్రీస్వామివారిని అనరాని మాటలంటూ వెళ్ళిపొమ్మని గదమాయించారు. శ్రీస్వామివారు ఏమీ జరుగనట్లే ఆ ఇల్లు వదలి వెళ్ళిపోయారు.

ఆ సమయములో తులసమ్మగారు ఇంట్లోనే యున్నా, తనకుమారుని ఆగ్రహం చూచి ఏమీచేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. మరుసటి రోజు పుట్టెడు కడుపు మంటతో శ్రీస్వామి వారియొద్దకు వెళ్ళి శ్రీస్వామివారికి తన ఇంట్లో జరిగిన అమర్యాదకు వలవల ఏడ్చింది. "పిల్లవాడింత దుర్మార్గంగా తయారవుతున్నాడేమీ స్వామీ" అనిమాత్రం అనగల్గింది. శ్రీస్వామివారు ఆమెను ఓదారుస్తూ "అదేందమ్మో! ఆయన భక్తిలో నిన్ను మించిన వాడవుతుండ్లా" అన్నారు. శ్రీస్వామివారి మాట కాలాంతరంలో అక్షరాలా నిజమైంది.

శ్రీనారాయణరెడ్డి గారికి వయసు పెరిగే కొద్దీ మానసికంగా మార్పు రాసాగింది. శ్రీస్వామివారితో వీరికిగల కొన్ని అనుభవాల వలన వీరు తులసమ్మ గారి కంటే గొప్పగా శ్రీస్వామివారి భక్తులయ్యారు. కొన్ని సంవత్సరాల పాటు శ్రీస్వామివారెక్కడికి వెళ్ళాలన్నా తన కారులో తీసుకవెళ్ళేవారు. శ్రీస్వామివారి సమాది మందిర నిర్మాణ ఖర్చంతా షుమారు ఒక లక్షరూపాయలు, తానొక్కరే భరించి నిర్మించారు. అంతేగాక కమ్యూనిటీహాలు నిర్మాణమప్పుడు, ఆభవనానికి అవసరమైన కిటికీలు, ద్వార బంద్రాలు అన్నీ షుమారు లక్షరూపాయలు విలువచేసే కొయ్యసామానంతా శ్రీస్వామివారికి కైంకర్యం చేశారు. ఈ సామానంతా తాను తనమిద్దెపైన నిర్మించనున్న మిద్దె కొరకు తయారు చేయించిపెట్టిన స్వచ్ఛమైన టేకు సామానన్నమాట. నాకు తెలిసినంత వరకు ఇలాంటి ఉన్నతమైన భావాలు, ఆదర్శాలుగల వ్యక్తిని చూడలేదంటే అతిశయోక్తిలేదు. వీరు శ్రీస్వామివారి హ్యూమానిటేయన్ మిషన్ గొలగమూడికి ట్రెజరర్‌గా ఉన్నారు. ఏనాడూ ఒక్క వ్యక్తినైనా క్యూకు అడ్డంగా దర్శనార్థం తీసుకవచ్చి ఎరుగరు. ధర్మాచరణ అంటే

ఏమిటో, శ్రీస్వామివారి ఎడల సంపూర్ణ విశ్వాసమంటే ఏమిటో వీరిదగ్గరే మనం చూడగలము.

తులసమ్మగారిచే స్వప్నంలో, కాశీయాత్ర చేయించటం, తులసమ్మగారి కుమారుడు ఆదినారాయణరెడ్డి గారికిగల క్షయవ్యాదిని మాన్పి ప్రాణబిక్ష పెట్టడం, మొదలగు విషయాలు అవధూత లీలలో చదువగలము.

మాతాజీ తులసమ్మగారికి శ్రీస్వామివారు మరొక గొప్ప సర్టిఫికేట్ ఇచ్చారట. శ్రీస్వామివారి సేవకులు బరిగల నాగయ్య గారిలా చెపుతున్నారు.

డబ్బు దాచిపెట్టమని మాతాజీ తులసమ్మ గారి దగ్గరుంచామని శ్రీస్వామివారి సేవకులు చెప్పినట్లయితే శ్రీస్వామివారు అనేవారట "అమ్మ దగ్గర ఇచ్చారా, అయ్యా! ఆమె దగ్గరిస్తే ఏట్లో మాన్యం పెట్టినట్లేగదాయ్యా. ఇంకొకరిదగ్గర ఇవ్వకూడదాయ్యా" అనేవారట. దేవస్థానం పొలాలను మాన్యాలు అనే అలవాటు. ఏటిలో సేద్యం చేస్తే ఏమొస్తుంది? ఏమీరాదు. ఏరుపారినప్పుడు అంతా వెల్లువకు పోతుంది. అమ్మచేతికి డబ్బు పోయినా అంతే. ఏదేవళానికి పోయినా ర్పూరహారతిలో తన దగ్గరున్న పైకమంతా వేసేస్తారట తులసమ్మగారు. తన ర పదిరూపాయలకు తక్కువ ఉంటే, మరొకరి దగ్గర అప్పు తీసుకొనైనా స్తారట. 'ఏందమ్మ, అలా ఖర్చుచేస్తే ఎట్లా' అని అడిగితే' పోనీలేయ్య ంతా ఇట్లా వచ్చి అట్లాపోతాము. దేవుణ్ణి ఎల్లకాలం కనిపెట్టుకొని రేకదా ఉండేది. అమాత్రమైనా ఆయన కివ్వకుంటే ఎట్లాగయ్యా' అనే

## శరణాగతి

తాజీ తులసమ్మగారికి కిడ్నీ కేన్సరు వచ్చి నెల్లూరు అమెరికన్ ఆస్పత్రిలో రు. మిస్‌బేర్ అనే అమెరికన్ డాక్టరమ్మ గారు "ఈమె ఇక కొద్ది గంటలలో తుంది. వెంటనే తీసుకవెళ్ళిపొమ్మని డిస్‌చార్చి చేసిపంపేశారు. ఈమెను



అట్టి విషమపరిస్థితిలో శ్రీస్వామివారి దగ్గరకు తీసుకవచ్చారు. స్వామివారు "అయ్యా ఆమెను ఒకవారం ఇంటి దగ్గర ఉంచండి బాగుంటుందని శెలవిచ్చారు. వారంరోజుల్లో ఆమె మృత్యు ముఖం నుండి బయటపడి ఆరోగ్యవంతురాలైంది. అదిమొదలు ఆమహాసాధ్వి ఇరవైసంవత్సరాల తన శేష జీవితాన్ని శ్రీస్వామివారి సేవకు అంకితం చేసింది నీడవలె వెంటనంటె శ్రీస్వామివారిని సేవించింది. శ్రీస్వామివారిని సేవించాలంటే ఎంత దుర్భరమైన జీవిత విధానానికి అలవాటు పడాలో చూచిన వారికే తెలుస్తుందిగాని వ్రాయాలంటే సాధ్యంగాదు. శ్రీస్వామివారు తాటాకుమీద పవళించేవారు గనుక ఈ మహాతల్లికూడా తాటాకే తన పరుపుగా వాడింది. పట్టుపరుపులు త్యజించేందుకు మనసు అంగీకరించవచ్చు, కానీ శరీరం అంగీకరించడం ఎంత కష్టమో చెప్పలేము. అట్లాగే, కాలు క్రిందపెట్టకుండా కారులో తిరిగిన సాధ్వి పాదాలకు చెప్పులుకూడా లేకుండా అతిసున్నితమైన తన పాదాలను గులకరాళ్ళపై మోపి పాదచారియై శ్రీస్వామివారి వెంట నడవడమెంతటి ఆశ్చర్యకరమైన విషయమో యోచించండి. అట్లాగే నవకాయపిండి వంటలు పంచభక్ష్యపరమాన్నాలు తిన్న నాలుక, కఠిక మిరప్పొడి, పచ్చడి మెతుకులతో సరిపెట్టుకొవడమెంత చిత్రమో చూడండి. ఒక్కొక్కప్పుడు కొన్ని వారాలపాటు మజ్జిగ, పాలు లేకుండా జీవించాలంటే మాటలుకాదు. వీటన్నింటిలో ఈతల్లికి సంపూర్ణ గురుకృప ఉండబట్టే ఆమెకు బాధలే తెలిసేవికాదు. మే నెల మిట్టమధ్యాహ్నం ఎండలో ఆమె పాదరక్షలు లేకుండా శ్రీస్వామివారి బండి వెంబడి మూడు కి॥ మీ॥ నడిచివెళ్లింది. సంపూర్ణ ఆత్మసమర్పణ చేసిన ఆ తల్లికి సంపూర్ణ గురకృప లభించి, జన్మరాహిత్యం చేసుకొన్న పుణ్యాత్మురాలు. ఈమెను గూర్చి ఒకప్పుడు శ్రీస్వామివారు "అయ్యో!, అమ్మ బొమ్మపాటున గదా ఉండేది?' ' అని అన్నారు. తులసమ్మను స్వామి ఎప్పుడూ 'అమ్మా' అని పిలిచేవారు. బొమ్మపాటు అంటే బ్రహ్మం యొక్క సమీపమని శ్రీస్వామివారు భావం. అమ్మ అంటే ప్రకృతిమాతకు సంకేతం. భగవంతునిచేత ప్రసాదించబడిన నూత్న జీవితాన్ని ఆమె భగవంతుని సన్నిధిలోనే, సేవలోనే గడపాలని వారి ధర్మ నిర్ణయం.

తులసమ్మ గారికి అంతకాలం శ్రీస్వామివారి సేవాసాన్నిధ్యాలు ఎందుకు

లభించాయో ఒకసారి శ్రీస్వామివారే శెలవిచ్చారు. "అయ్యా, అమ్మ మనకు నాలుగు జన్మల నుండి అన్నం పెడుతూన్నదయ్యా!" అన్నారు. తులసమ్మగారిని గూర్చి బరిగెల నాగయ్య ఇలా చెపుతున్నారు.

శ్రీస్వామివారి సేవకులలో కొంతమంది తులసమ్మగారి శాంత స్వభావాన్ని ఆసరాగా తీసుకొని ఒక్కొక్కప్పుడు ఆమెను అనరానిమాటలనేవారు. కానీ ఆమహాతల్లివారి అజ్ఞానానికి నవ్వుకుంటుండేది. మేము ఆ మాటలు సహించలేక "ఏమిటమ్మా, ఆవెధవలు కారుకూతలు కూస్తుంటే గట్టిగా మందలించకుండా నవ్వుకుంటుండావే. వాళ్ళ నోటికి హద్దుపద్దూ లేదా" అని అడిగే వాళ్ళము.

"పోనీలే నాగయ్యా" అందరూ పెడితే తినేవాళ్ళేగాని అనే వాళ్ళే లేరనుకుంటున్నాను. అనుకోనీలే, మనలనంటే మంచిదేగదా మనకు" అంటూ నవ్వుకుంటుండేది. సహజసిద్ధమైన ఓర్పు అంటే ఏమిటో ఈలాంటి సన్నివేశాలలోనే తెలుస్తుంది. 'తల్లి అంటే భూదేవికంటే ఎక్కువ ఓర్పుగలది' అని పెద్దలు చెప్పేమాట ఎంతచక్కగా అమ్మకు సరిపోయిందో చూడండి. ఈవిధంగా తనను దూషించినవారు వస్తే, వారన్నమాటలు మనసులో నుంచుకోకుండా వారికెంతో తృప్తిగా భోజనం పెట్టెది.

చుండు నాగయ్య అనేవాడు "నువ్వు అమ్మవుకాదు. మాయఅమ్మవు. నీవు పెడితే తినవచ్చుగాని నీవు చెప్పిన మాటలు వినకూడదు. నీవుచెప్పినట్లు నడుచుకుంటే సముద్రంలో దోసేస్తావు. నీవు మాయముండవు" అనేవాడు.

నిష్కారణంగా మనలను ఇతరులు దూషించినప్పుడు మనం సంతోషంగా ఓర్చుకుంటే మన చెడ్డకర్మ నశించడమేగాక నిందించిన వారి పుణ్యం మనకొస్తుందని, మన పాపం వారికి సంక్రమిస్తుందనేది పెద్దల వాక్యం. ఈ సత్యం తులసమ్మగారి ప్రవర్తనలో చూడవచ్చు. ఇలాంటి సద్గుణాల రాశి గనుకనే ఆమెకు శ్రీస్వామివారిని ప్రత్యక్షంగా సేవించే భాగ్యం గల్గింది.



ఈమె కూరగాయలు కొనడం, షిర్డిసాయి జామపండ్లుకొన్న తీరును అచ్చం పోలియున్నది. ఒకామెదగ్గర బాగా బేరమాడి పదణాలకు ఆరుపండ్లు, మరొకామె దగ్గర అరణాలకు పదిపండ్లు కొన్నారు. కానీ డబ్బు ఇచ్చేటప్పుడు చెరొక రూపాయి ఇచ్చిపంపారు. అట్లాగే తులసమ్మగారు కూరగాయలు కొసరి కొసరి బేరమాడి చెప్పిన ధరకంటే కొన్నిపైసలు తగ్గింపుచేసి కొనేది. కానీ డబ్బులు ఇచ్చేటప్పుడు రూపాయిగాని అర్ధరూపాయిగాని వారికిచ్చి తిరిగి తనకు రావలసిన చిల్లర డబ్బులు ఉంచుకోమని చెప్పేది. అంతేగాక "పాపం పొట్ట ఎక్కడో ఉంది. అన్ని మెతుకులు తినిపో" అని కడుపునిండా అన్నంపెట్టి పంపేది.

## భవిష్యత్‌వాణి

వీరికి అందరి భవిష్యత్తు చక్కగా తెలిసిఉండేది. కానీ ఈవిషయం ఎవ్వరికీ తెలియనిచ్చేదికాదు. ఎవరో తనకు దగ్గరగా ఉండేవారితో తగిలీ తగలనట్లు ఒకమాట చెప్పేది. వారామాటను పట్టించుకోకుండా అదంతా తులసమ్మగారి పిచ్చి మాటలనుకొనేవారు. ఉదాహరణకు , అనికేపల్లిలో శ్యామసుందరమనే ఒక బ్రాహ్మణ యువకుడు పిచ్చివానివలె తిరుగుతుండేవాడు. ఆయువకుని గురించి తులసమ్మగారు, ఒకరోజు, తిరుమలశెట్టి వెంకయ్యతో "ఒరేయ్ ఈయన అట్లాఉన్నాడుగాని చాలా గట్టివాడు ఒకనాటికి, వంటిమీద గుడ్డకూడా ఉందా లేదా తెలియకుండా తిరుగుతాడు" అని చెప్పింది. కాలాంతరంలో ఆమాట అక్షరాల నిజమైంది. మరొకప్పుడు ఇదే వెంకయ్యతో "ఒరేయ్ ఒకనాటికి మీ అక్క తనచేను కూడా నీకే అమ్ముతుందిరో" అని చెప్పింది. ఆమాట కూడా కాలాంతరంలో అక్షరాల నిజమైంది. ఇంకా ముఖ్యమైన విషయమేమిటంటే, తమ శరీరత్యాగం ఎప్పుడూ చేసేది ముందుగానే చెప్పగలిగింది. "శ్రీస్వామివారు చాటుకుపోయిన ఆరునెలలకు నేను కూడా పోతాను" అని చెప్పింది. ఆమాట కూడా అక్షరాల జరిగింది.

**కైవల్యము:** శ్రీరమణమహర్షి శ్రీరామకృష్ణ పరమహంసలవలె శేషించిన ఈమె ప్రారబ్దాన్ని ఆరునెలల కాలంలో సంపూర్ణంగా అనుభవంద్వారా పూజ్యం చేశారు,

శ్రీస్వామివారు. అన్నీ మంచములోనే జరిగాయి. కానీ కన్నబిడ్డలకంటే ఎక్కువ ప్రేమతో, శ్రద్ధతో సేవచేసేవారిని శ్రీస్వామివారు, వీరి సేవకు నియమించారు. ఈమెకు సేవచేస్తే శ్రీస్వామివారికి చేసినట్లేననే భావన ఈ సేవలకులకు కలిగించారు; శ్రీ స్వామివారు. అంత్యదశలోఈమెకునిరంతరం ధ్యానస్థితి ప్రసాదించారు శ్రీ స్వామివారు. తన కొడుకు, కోడలు ఈ దశలో వచ్చినట్లయితే తన ధ్యానానికి మౌనానికి భంగం వాటిల్లుతుందని, తన మనసు, వారి మమకారాల వలయంలో తగుల్కొంటుందని ఎరిగిన ఈమె తాను తనువుచాలించినంతవరకు తనను గూర్చి తన వారికెవ్వరికీ వెళ్ళి చెప్పవద్దని గట్టిగా కట్టడి చేసింది. పూర్తి ప్రజ్ఞతో ధ్యానస్థమై శ్రీస్వామివారిలో ఐక్యమయ్యె భాగ్యం ప్రసాదించారు శ్రీ స్వామివారు. అంతేగాక స్వామివారు ఒక్కొక్కప్పుడు 'అమ్మకు తనలో సగభాగముంది' అనిచెప్పేవారు అంతేగాక 'అమ్మ ఇక వచ్చేదిలేదు'. అని కూడా వారికి అభయం ప్రసాదించారు, ఆ విధంగా శ్రీ స్వామివారి నుండి లౌకికమైన విషయాలు ఏమీ ఆశించకుండా తన సర్వస్వం స్వామివారే అనే దృఢ విశ్వాసంతో సేవించింది గనుకనే వారి ఆత్మకు జన్మరాహిత్యం ప్రసాదించారు, ఆచల్లని స్వామి. నేటికి శ్రీస్వామివారు నిత్య సత్యులు గనుక, అన్ని జీవులలో శ్రీ స్వామివారున్నారన్న ఎరుకతో, నిస్వార్థసేవ చేసి తరించమని శ్రీస్వామివారు మనకు హామీ ఇచ్చారు. 'సూర్యచంద్రులున్నాంతవరకు ఉండేదేగదయ్యా అన్న శ్రీస్వామివారి మాట నిత్యసత్యం గదా!

## సాధన

సాధన అంటే ఏమిటో మాతాజీ తులసమ్మ వంటి గురుకృపకు పాత్రులైన వారిజీవితాలను బాగా తరచి చూచినట్లయితే తెలుస్తుంది. ముముక్షువులు చేసేజపము, ధ్యానము, భజన, పూజవగైరా సఫలము కావాలంటే మొదటి సాధనయైన నిష్కామకర్మ ఫలిస్తేనే ఇవన్నీ సఫలమౌతాయని శాస్త్రాలు చెపుతున్నాయి. ఈ విషయం తులసమ్మగారి ఎడల సార్ధకమైంది. ఈ మహాతల్లి శ్రీస్వామివారి సేవ కంకితమయ్యాక పైన చెప్పబడ్డ సాధనలు, జపము వగైరా ఏనాడు చేసినట్లు తెలియదు. కానీ శ్రీ స్వామివారు 'అమ్మఇక వచ్చేది లేదు' అని



తులసమ్మగారికి చీటి వ్రాసి ప్రసాదించారు. అంతేగాక ఆమెకు ఎరుకగలదు అనేందుకు నిరూపణగా, మాతాజీ తులసమ్మగారు నిర్యాణమైన మూడు నెలలకు కోడలికిస్వప్న దర్శనమిచ్చి 'నేను మరలా జన్మకు వచ్చేదిలేదు. శ్రీ స్వామివారు మరలా జన్మకు వస్తారు' ఈ విషయాన్నే ఆమె మన మధ్య ఉండగా ఆమెకుమారుడు 'శ్రీ స్వామివారు మరలా జన్మకు వస్తాడా?' అని అడుగగా 'ఎనభై సంవత్సరములకు మరలా వచ్చి, హెచ్చుతగ్గులు చూచుకొని పోతాడట' అని శ్రీ స్వామివారు చెప్పాడని అనుకొంటున్నారు' అని తనకు తెలిసికూడా తెలియనట్లే చెప్పింది.

మాతాజీ తలసమ్మగారు ఈ విధంగా జన్మరాహిత్యం చేసుకునేందుకు చేసిన సాధనలేవి?

ఒకేఒక సాధన, సద్గురుడైన శ్రీ స్వామివారిని త్రికరణ శుద్ధిగా అచంచల విశ్వాసంతో, దీక్షతో సేవించడమే.

'శరీరం ఇంద్రియం, ప్రాణం, అర్ధస్వజన బాంధవాన్
ఆత్మధారాధికం నేస్తం సద్గురుభ్యోన్ని వేదయేత్.'

అన్నగురుగీతా వాక్యాన్ని ఈమె సంపూర్ణంగా ఆచరించింది. శ్రీ స్వామివారికి, వారి బృందానికి, దర్శనార్ధం వచ్చిన భక్తులకునిరంతరం వంటచేసి పెట్టడమే ఈమెసేవ. తన ఏకైకపుత్రుడు మరణావస్థలో ఉన్నాడని తెలిసికూడ ఆ బిడ్డను చూచేందుకు వెళ్ళమంటారా? వద్దంటారా? అని శ్రీస్వామివారి ఆజ్ఞకొరకు ఎదురుచూచిన త్యాగశీలి. 'నీవు నీబిడ్డను చూచేందుకు పోనక్కరలేదు. ఆయన బాగుంటాడులే' అని శ్రీస్వామివారు చెప్పినప్పుడు, సంతోషంగా శ్రీ స్వామివారి సన్నిధిని వీడనిభాగ్యశాలి. ఈ విధంగా మమకారం నసించేందుకు ఆమె ఏగ్రంధాలుచదువలేదు. మననం చేయలేదు. అనన్య ప్రీతితో శ్రీస్వామివారి సేవకొరకు సర్వకోరికలను విడనాడింది. శ్రీ స్వామివారిసేవ ఒక్క క్షణం ఎడబాటైనా తనకు ప్రాణహాని జరిగినంత నష్టంగా భావించింది. కనుకనే శ్రీ స్వామివారి

కృపవలన మమకార బంధం తెగిపోయింది.

జన్మజన్మలుగా తానార్జించిన త్యాగమయ సంస్కారమే ఆమెను శ్రీ స్వామివారి చెంతకు చేర్చింది. తాను లక్షాధికారియై యుండికూడా అందరిలాగా వందల కొలదిచీరలు పెట్టెలలో మ్రగ్గిపోనీక, భర్తకుకూడా తెలియకుండా, అన్నీ పేదలకు దానం చేసి రెండు చీరలతోనే సంసారిక జీవితం వెళ్ళబుచ్చిన 'దానకర్ణ' ఈమె.

శ్రీస్వామివారి సేవకంకితమయ్యాక ఒకప్పుడు మానహీనంగా ఉన్న ఒక అనాథను చూచినపుడు తన చీరలో సగం చీర చించి దానం చేసి మిగిలిన సగం చీరతోనే తన శరీరాన్ని కప్పియుంచుకున్న 'వైరాగ్యమూర్తి' ఈమె.

ఇంటినుంచి బస్తా మిరపకాయలు తెప్పించి రెండవరోజుకు బస్తా ఖాళీచేసిన మహాతల్లి ఈమె. కొన్ని చాకలివాళ్ళకు కొన్ని మంగలి వాళ్ళకు, మరికొన్ని పనివాళ్ళకు, కొన్ని నిరుపేదలైన యాచకులకు, మిగిలినవిఆశ్రమంలో పచ్చళ్ళకు ఖర్చుచేసినందున మూడవనాటికి మరలా మిరపకాయలకు కరువే అయ్యేది. 'అదేమిటమ్మా అన్నీ అట్లా ఖర్చుచేస్తే ఎట్లా' 'అంటే మనల్ని కనిపెట్టుకొని ఉండేవాళ్ళకు గబ్బెడు మిరపకాయలు కూడా పెట్టకుండా ఎట్లాగయ్యా?' నేది.

కూరగాయలు దొరకనిమంచి వేసవిలో, తనతోట లో, పండాయని ఎవరో లుగు సొరకాయలు తెచ్చి ఇచ్చారు. నాలుగూ ఒకేరోజు కూర చేసింది. దేమిటవ్వా రేపటికి ఒకటైనా ఉంచకూడదా' అంటే 'ఉండాయిగదా. నీలేయ్యా. పాపం.ఆశతీరాతింటారు. ఇవి ఇక్కడ ఉంటే ఇక ఎవ్వరూ మరలా సుకరారు. ఏమీ లేకుండా ఉంటే శ్రీ స్వామివారు ఎవరో ఒకరిచేత రలాతెప్పిస్తారు'. అనేది. ఆమెచెప్పింది అక్షరాల నిజమయ్యేది. సాటి జీవులు ప్తి చెందడమే ఆమె ధ్యేయం 'అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడనివ్రాసుకోయ్యా' ని శ్రీ స్వామివారు చెప్పారుగదా!



మాతాజీ తులసమ్మగారికి గల మరొక ముఖ్యమైన దైవీ సంపద, నిష్కాపట్యము. క్రొత్తగా శ్రీ స్వామివారి దర్శనార్థం వచ్చిన వారికి శ్రీ స్వామివారికి అతి సమీపంలో కూర్చోవాలని, వారిని తాకి నమస్కరించుకోవాలని ఉంటుంది. దాన్ని శ్రీ స్వామివారు అంగీకరించరు. కనుక ఈమె వారిని శ్రీ స్వామివారికి దగ్గరగాపోవద్దని అరచి తగవులాడేది. 'ఏం మనుషులు మీరు? తలకాయలేదా? ఆయనేమి మనలాంటి మనిషనుకున్నారా? రాండి,రాండి దూరంగా" అనిగదమాయించి అరిచేది.పది నిముషాల తర్వాత ఆ భక్తులు వంటశాలలో ఆమెకంట పడ్డారంటే, ఇందాక ఆమె అరచి కసరికొట్టిన విషయం జరగనట్లుగానే వారితో మట్లాడేది. వారికి ఏంకూర ఇష్టమో అడిగి తెలుసుకొని వారికి తృప్తిగా భోజనం పెట్టేది. శ్రీస్వామివారు తిరిగే కుగ్రామాలలో కాఫీ, టీలు దొరకవు గనుక ఎవరైన పట్టణ వాస్తవ్యులు శ్రీస్వామివారి దర్శనార్థం వస్తారని కాఫీ పొడి చక్కెర దాచిపెట్టి ఉంచేది.

సోమరి తనాన్ని చూచినప్పుడు పిచ్చికోపం తెచ్చుకునేది. శ్రీస్వామివారి సేవకుల్లో కొందరు వంతులు పెట్టుకొని పనిఎగగొట్టేవారుకూడా ఉండేవారు. వారిని నిర్మొహమాటంగా చీవాట్లు పెట్టి "దండగతిండి తింటే శ్రీస్వామివారికి బాకీపడుతారు". అని నిక్కచ్చిగా చెప్పేది. ఆసోమరిపోతే మధ్యాహ్నం అన్నానికి వస్తే ఆయనకోరింది ప్రేమతో తృప్తిగా పెట్టేది. ఆభక్తుడు "పెట్టినా తిట్టినా అమ్మకు అమ్మే సరి" అని చేతులెత్తి నమస్కరించేవాడు. తులసమ్మగారిని గురించి ఒకచిత్రమైన విషయం చెపుతున్నారు. మొదటి పంక్తిలో కూర్చున్నవారికి గట్టి పెరుగు. ఆ తర్వాత వచ్చేవారికి క్రమంగా మజ్జిగలో నీరు కలుపుతూ వస్తుందట. చివరివారికి నీరు మజ్జిగ, లేకుంటే అదీ లేదట. 'ఇదేమి టమ్మా ఇట్లా చేశారే' అంటే "ఏమిటో పిచ్చిపాడు" అని నవ్విసరిపెట్టేవారు. నిజానికి ఆమె చేసినదే సరైన పద్ధతనిపిస్తుంది. శ్రీస్వామవారి సన్నిధిలో ఎందరు భక్తులు భోజనానికి వస్తారనేది ఎప్పుడూ తెలియదు. అంతా వారివారి ప్రాప్తమనుకోవలసిందే!

బీదవారైన వారు పెండ్లిచేసుకుంటూ తాళిబొట్టు కొనుక్కునేందుకు వీరిని

శ్రీ నాగయ్యగారు గృహస్తుగా ఉన్నా పూర్వజన్మవాసన వలన సద్గురువును అన్వేషిస్తూనే యున్నారు.జ్ఞానతృష్ణగల వీరి ప్రవర్తన భార్యాబిడ్డలకు నచ్చేదికాదు. చివరకు వారితో సర్దుకు రాలేక సద్గురుని అన్వేషిస్తూ దేశాలవెంట పడ్డాడు. ఎందరో పేరు మోసిన స్వాములను, సాధువులను దర్శించాడు. కానీ వారెవ్వరూ వీరికి నచ్చలేదు. చివరకు ఎవరో ఒక సాధువు ద్వారా శ్రీస్వామివారిని గూర్చివిని వెతుక్కుంటూ వచ్చాడు. నిరాడంబరత, సాటి జీవులపై నిస్వార్ధమైన ప్రేమ, ఆదర్శనీయమైన సాధుజీవనము, నిరంతరము ఆత్మానందములో మైమరచియుండే, వారి పాంచభౌతిక రూపము, వీరిని ముగ్ధులను చేసింది. ఇట్టి దివ్యలక్షణాలతో విరాజిల్లే శ్రీస్వామివారే తానాశ్రయించ తగ్గ సద్గురుడని ప్రథమదర్శనంలోనే వీరిహృదయం ప్రభోదించింది. ఏ మహిమా, చవిచూడకుండానే, శ్రీస్వామివారు, సాటిలేని సద్గురుడని గుర్తించగల్లడమే వీరిగొప్పదనము. ఇదే వీరి జన్మసంస్కారము యొక్క గొప్పదనము.

శ్రీ శివానందస్వామివారి శిష్యులు - ఋషీకేష్ నుండి వచ్చిన చిదానంద స్వామివారు, అవధూత శ్రీసుబ్బన్నగారు, అవధూత శ్రీ ఎరుకలయ్యగారు, పూజ్యపాదులు ఆచార్య శ్రీభరద్వాజగారు లాంటి ఏ కొద్దిమందో తప్ప మిగిలిన వారంతా వేలాదిగా శ్రీ స్వామివారిని దర్శించినాశ్రీస్వామివారి నుండి ప్రకటమైన మహాద్భుతమైన దివ్యలీలలు కన్నులారాగాంచి కూడా, వారంతా శ్రీస్వామివారి నిజస్థితిని గుర్తించలేక తగువిధంగా సేవించలేకపోయారు. వారి నిజస్థితిని గుర్తించే దివ్య సంస్కారాన్ని పొందేందుకు మహనీయుల దివ్యచరిత్రపారాయణ, సత్‌సంగము, మహనీయుల సహచర్యము, దివ్యమైన మార్గాలని నారద మహర్షులవంటి మహనీయుల అనుభవంచాటుతుంది. గనుకనే 'దేవుడెలా కనిపిస్తాడు స్వామీ' అని అడిగిన భక్తునితో శ్రీస్వామివారు శ్రీ బ్రహ్మంగారిచరిత్ర పారాయణచేయమని చెప్పడం జరిగింది. ప్రజల కట్టి దివ్యసంస్కారాన్ని ప్రసాదించాలనే ఉద్దేశ్యముతోనే అంతవరకు తన విషయం గుప్తంగా ఉంచమని ఆదేశించిన శ్రీస్వామివారు తన చరిత్ర వెల్లడిచేసుకొని నాచేత వారి దివ్యచరిత్ర వ్రాయించుకొని అందరికీ వెల్లడిచేసుకున్నారు. కనుక మహనీయుల చరిత్ర



పారాయణ దైవకృప పొందేందుకు ఇవ్యమైన సాధన అని అందరూ గుర్తింతురుగాక.

మహనీయులను గుర్తించేందుకు శ్రీరమణమహర్షులవాక్యం ఆచార్య శ్రీ ఇ. భరద్వాజగారు ఇలా చెప్పేవారు. 'ఎవరిసన్నిధిలో మన మనస్సు శాంతించి చిత్తశాంతి అనుభవమవుతుందో వారే మహనీయులు'.సాటిజీవులపై వారికి గల అపారప్రేమ, కరుణ, నిరాడంబరత, నిరహంకారాలే వారి ఆభరణాలు. మనం నోరువిప్పి అడుగకనే మన మనస్సులోని పవిత్రమైన కోరికలు తీర్చడంకూడా మహనీయుల లక్షణంగా చెప్పేవారు.

శ్రీ స్వామివారి నిజస్థితిని కొంతవరకు గుర్తించినవారు అనేకులున్నా, వారు తమ ప్రకృతి గుణాలకు కట్టువడి తగుస్థాయిలో హృదయపూర్వకంగా పెద్దలు నిర్దేసించనట్లు సేవచేయలేకపోయారు. 'శరీరం, ఇంద్రియం, ప్రాణం అర్ధ, స్వజన బాంధవాన్, ఆత్మధారాధికం నేస్తం సద్గురుభ్యోనివేద ఏత్' - అన్నది శాస్త్రవాక్యం. అలాచేసినవారి సర్వ లౌకిక ఆధ్యాత్మిక భాధ్యతలను శ్రీగురుడే స్వీకరించి ఆభాద్యతలను మనకంటే ఎంతో చక్కగా వారే నిర్వహిస్తారు.

ఆ విధంగా ఆదర్శ ప్రాయంగా శ్రీచుండు నాగయ్యగారు శ్రీస్వామివారిని సేవించారు గనుకనే, వారి బిడ్డల బాద్యత శ్రీస్వామివారే వహించారు. నిండు మామిడికాయల బండి కొండచరియలోపడిపోయినపుడు శ్రీ నాగయ్యగారి కొమారుణ్ణి అకాలమృత్యువు బారినుండి శ్రీస్వామివారే రక్షించారు. శ్రీనాగయ్యగారిచేత నిమ్మతోటనాటించి ప్రస్తుతం సంవత్సరమునకు మూడులక్షల రూపాయలు ఆదాయంవచ్చేటట్లు శ్రీస్వామివారు వారి కుటుంబమునకు ఆర్థిక సహాయమొనర్చారు.

శ్రీ చుండునాగయ్యగారి తండ్రిగారు మహాభక్తుడు నిత్యం పూజచేసుకొని ముఖాన పెద్దనామాలతో దర్శనమిచ్చే వారు. ఎప్పుడూ తనచెంత దండిగా సున్నం ఉంచుకొని అడిగిన వారికల్లా లేదనకుండా దానం చేసేవాడు. వృద్ధాప్యంలో

నామజపం చేసుకుంటూ పదిమంది నడిచే దోవల్లో ముండ్లు లేకుండా ఏరి పారేస్తుండేవాడు. అలాంటి పుణ్యాత్ముని అంత్యదశలో శ్రీ నాగయ్యగారు చాలాగొప్పగా సేవచేశారు. కొన్నాళ్ళు అన్నీ మంచంలో జరుపవలసివస్తే నిరంతరం మంచం దగ్గర కనిపెట్టుకొని ఉండి సేవచేసిన భాగ్యశాలి. కనుకనే వీరికి శ్రీస్వామి వారిని సేవించే భాగ్యంకలిగింది.

## నిజమైన శ్రీస్వామి వారిసేవ

శ్రీస్వామివారు 'అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని' వ్రాసుకోయ్యా అన్నారు. శ్రీస్వామివారిలో ఏముందోఅదేమనలోను ఉంది. అయితే వారిలోని ఆత్మజ్యోతికి ఆవరణ మలినాలేమీ లేకుండా ప్రవేశిస్తుంది మనలోని ఆ ఆత్మజ్యోతికి కామ, క్రోధ, లోభ, మోహ॥ మొదలైన మలినాలు ఆవరించి ఆ వెలుగు ప్రసరించకుండా చేస్తున్నాయి. అంటే మనలోని స్వామివారిని మనమీ మలినాలద్వారా బందించామన్నమాట. మనలోని శ్రీస్వామవారిని బంధవిముక్తుని చేసేందుకు మనము చేసే ప్రయత్నమే నిజమైన శ్రీస్వామివారిసేవ. మనలోని దుర్గుణాలపై మనమెంత వరకు దండయాత్రచేసి సఫలీకృతులమౌతామో అంతమేరకు మన సేవకు శ్రీస్వామివారు సంతుష్టులౌతారు. అంతేగాని ఆత్మకుగల ఈ అడ్డుగోడను తొలగించే ప్రయత్నంచేయకుండా కేవలం మన ఆడంబరానికో, లేకలోకం మెప్పుకొరకో చేసే బాహ్యపూజ, నివేదనలు మాత్రమే చేస్తుంటే అదంతా "భక్తిలేని పూజ, పత్రిచేటు" అన్నట్లుంటుంది. అయితే ఈ బాహ్యాచారాలు పూజలు అన్నీకూడా అంతఃశుద్ధి సాధించేందుకు మాత్రమే ఉద్దేశించబడ్డాయని తెలుసుకొని చేస్తుంటే శ్రీస్వామివారు సంప్రీతులౌతారు. వారి కృపతో మనమీ అజ్ఞానాంధకారం దాట గలుగుతాము.

## రోశిరెడ్డిగారి దయ, ధైర్యములు తెల్పే ఒక అనుభవం :

అవి శ్రీ స్వామివారు సమాది చెందిన తర్వాత రోజులు. ఒకప్పుడు నేను (రచయిత) శ్రీస్వామివారి సమాధి దర్శనార్థం గొలగమూడికి వచ్చాను. రాత్రికి రెండు కి॥మీ॥ దూరములో ఉన్న మా మామగారి గ్రామం వెళ్ళిపోవాలని వచ్చాను.



గనుక దుప్పటి తెచ్చుకోకుండా వచ్చేశాను.కానీ కొన్నికారణాలవల్ల ఆశ్రమంలోనే ఉండి పోయాను. ఆ రాత్రికి నాకు బాగా జ్వరం, చలి వచ్చేశాయి. అప్పుడెవ్వరూ శ్రీస్వామివారి పూరిపాకలో పండుకోకూడదు. ఆపూరిపాక శ్రీరోశిరెడ్డిగారికి వారి స్నేహితునికి మాత్రమే ప్రవేశార్హంగా ఉంది. నేను ఆపూరిపాకబయట చలిలో పండుకొని ముడుచుకపోయి బాగా మూలుగుచు వణుకుచున్నాను.శ్రీరోశిరెడ్డిగారు నన్నులేపి వారు పడుకునే శ్రీస్వామివారి పూరిపాకలోపడుకోమన్నారు. నాపైన, వారి పంచె తెచ్చికప్పారు. వెంటనే నామూలుగు తగ్గి నిద్రపట్టింది. ఆ సమయంలో వారి స్నేహితుడు మంచి నిద్రలో ఉన్నాడు. గనుక నేను పూరిపాకలోకి వచ్చిన సంగతి చూడలేదు.

అతడు ఎప్పుడో లేచి నన్ను చూచి చాలా నీచంగా తిట్టసాగాడు. అదీచాలా పెద్ద గొంతుతో, నేనేమీ ఎరుగనట్లు పడుకోనుండాను.కొద్దిసేపట్లో అతను, నన్నులోపలికి తీసుకవచ్చిన, శ్రీరోశిరెడ్డిగారిని తిట్ట మొదలు పెట్టాడు. తాతగారతనిని మొదటినుండి సందడి లేకుండా పడుకోమని చెపుతూనే ఉన్నాడు. వినిపించుకోకపోయే తలికి, తాతగారు నోరుచేసుకొని పెద్దగా అతనిని అరుస్తూ ఏదైన నావల్ల తప్పువుంటే శ్రీస్వామివారు నన్ను శిక్షస్తారు. నీవు నోరుమూసుకొని పడుకో, లేకుంటే బయటికి వెళ్ళిపో అని చాలా తీవ్రమైన కంఠంతో మందలించారు. ఈలోగా నేనే బయటికి వచ్చేశాను. తెల్లవారి తాతగారు నా జ్వరం గురించి పరామర్శించి 'అర్ధరాత్రి వేళనీవెందుకు బయటికి పోయింది'. అవసరమైతే అతడే వెళ్ళిపోయేవాడుగదా అన్నారు. ఈ సన్నివేశంలో తాతగారి దయ, ధైర్యము చదువరులే ఊహించుకోగలరు.

## అచంచల విశ్వాసము, కార్యదీక్ష

శ్రీ స్వామివారు, వీరిది 'భీష్ముని పట్టుదల,' అని వారికి ఆశీర్వాద చీటి వ్రాయించియిచ్చారంటే ఏ విషయములో నైనా వీరెంత గట్టి పట్టుదల గల వారో ఆలోచించండి. శ్రీస్వామివారిసేవ కంకితమయ్యాక తిరిగి ఇంటి మొగమెరుగరు. ఒకటి రెండు మార్లు వీరి భార్యవచ్చి వీరిని చూచి వెళ్ళిపోయిందేగాని వీరామెతో

ంటి సంభాషణ చేయలేదు. సంసారంలో రోశి వచ్చాడు గనుక వీరిని ామివారు రోశిరెడ్డి అని పిలచేవారు. ఒకప్పుడు శ్రీస్వామివారు 'ఐదునాళ్ళు ం లేకుండా ఉండేవాళ్ళను చూపించయ్యా' అని అన్నారట. అందుకు వీరు రో ఎందుకు స్వామీ! నేనే ఉంటాను' అంటూ కేవలం మంచి నీరు మాత్రం ఐదురోజులు కటిక ఉపవాసమున్నధీరుడు. శ్రీ స్వామివారి ఆజ్ఞమేరకు ళ్ళు జావత్రాగి కాలం గడిపారు. అటుతర్వాత అటుకులు పాలు స్వల్పంగా కునేవారు. ఈ విధంగా నాలుగు సంవత్సరాలు గడిచాయి. చివరిసంవత్సరం ం చక్కెర కలిపిన వేడినీరు మాత్రం త్రాగేవారు. ఇంతటి బలహీనస్థితిలో వీరు గుర్వాజ్ఞననుసరించి బిక్షాన్నాన్ని తెచ్చే నియమాన్ని ఏనాడు ప్పవాడుకాదు. మేమింతమందిమి కుర్రోళ్ళముండగా నీవంత బలహీనంగా, కళ్ళుకానరాని స్థితిలో బిక్షకు వెళ్ళడం మాకు అవమానంగా ఉంది.ఆ సేవ ఇక మానుకోమన్నారుకొందరు. కానీ అందుకు వీరు అంగీకరించక శ్రీస్వామివారు, నా కిచ్చిన ఆజ్ఞను చివరి శ్వాసవరకు నెరవేర్చడమే నాలక్ష్యం. అని చెప్పి చివరివరకు ఆసేవను సాధించిన ధీరుడు. కళ్ళుబొత్తిగా కనిపించవు. కానీ బిక్షకు వెళ్ళేవేళయితే రోడ్డు వెంబడి తెల్లని దారం పర్చినట్లు సన్నని వెలుగు కనిపిస్తుందట. బిక్షకు వెళ్ళి వచ్చినంతవరకు మాత్రమే ఆ వెలుగు తనను నడిపిస్తుందని అదికేవలం శ్రీస్వామివారి కృపయని చెపుతారు. అంతబలహీనంగా ఉన్నా వారు తెచ్చే అన్నం కారియర్లు మనం మోయలేము. ఒక్కొక్కటి రెండు సేర్లబియ్యపన్నం పట్టేరెండు అల్యూమినియం టిఫిన్లు నిండుగా అన్నం భిక్షచేసి రెండుచేతులతోను, మూడవ (మజ్జిగ) టిఫిన్ ఎడమచేతి కొంకెకు తగిలిస్తాడు. ఇంకేమైన తినుబండారాలు, కూరగాయలు మిరపకాయలు, చింతపండు వగైరా ఇస్తే గుడ్డలో మూట గట్టి భుజాన వేసుకొస్తారు. అలా అన్నీ ఆశ్రమానికి తెచ్చి అగ్నికి, భూతబలికి సమర్పించినంతవరకు ఆ అన్నం పాత్రలను ఎవరూ తాకేందుకు వీలులేదు. మధ్యహ్నం ఒంటిగంటకు ఆశ్రమంచేరి స్నానంచేసి తన ఊతకర్రకడిగి అగ్నిగుండమునకు సాంబ్రాణి సమర్పించి జపము చేసుకున్నాకనే గంజిత్రాగేవారు.



రాత్రి ఏవేళప్పుడైన శ్రీస్వామివారు ఒక్కపిలుపు పిలువగానే 'స్వామీ' అంటూ చివుక్కునలేచి వేళ్ళేవాడు.అలా వెళ్ళాలంటే రాత్రి భోజనమెంత లఘువుగా ఉండాలో యోచించండి 'తాతగారూ మీరు ఒక్కపిలుపుతోనే ఎలా లేచి వెళ్ళగలుగుచున్నారు' అంటే ఆయన అన్నారు 'ఒక్క పిలుపుతోనే వెళ్ళలేక పోతే నేను చచ్చినట్లే లెక్క నేను శ్రీస్వామివారి చెంతనున్నదెందుకు. కడుపు నిండా తిని కమ్మంగా నిద్రపోనా! అలాగైతే ఆతిండి మా ఇంటి దగ్గర లేదా అయ్యా! రాత్రి ఎంత తేలికగా పొట్టలో ఉంచుకుంటే అంత మెలకువగా ఉండగల్గుతాము'. అని సమాధానమిచ్చేవారు తాతగారు.

ఎంతపెద్ద తుఫాన్‌లోనైనా సరే అర్ధరాత్రి గాఢాంధకారమైన చీకటిలోనైనా సరే 'గుండానికి చిదుగులు లేవయ్యా అని శ్రీస్వామివారన్నారంటే వెంటనే ఆకటిక చీకటిలో చలిగాలి, వర్షంలో వెళ్ళి ఎక్కడైనా సరే కంపలవెంబడి చేతులుపెట్టి రాలిపోయిన కంపతెచ్చి శ్రీస్వామివారి చెంతనుంచేవాణ్ణి. వారికాచిదుగు పుల్లలు చూస్తే ఎక్కడలేని ఆనందం ముఖంలో కనిపించేది. వారి ఆనందమే నాకు అన్నపానీయాలు - అదేనాకు బలముగా ఉండేది.

ఒకసారి నావేలును పాము కరచింది. శ్రీ స్వామివారు ఆ వేలును తన తొడపైన తన అరచేతితో ఐదునిమిషాలు అదిమిపెట్టి 'నీవళ్ళు సంజీవి అయిళ్ళా అయ్యా,' అన్నారు. అదిమొదలు నాకెట్టి విషజంతువు కరచినా బాధే ఉండదు'

'శ్రీస్వామివారు 'ఇదిగోనయ్యా! నీకు సద్దికూడు' అంటూ తననోటిలోని పొగాకు తంబ ముంతలో ఊసేవారు. దాన్ని నేను ఎంతో భక్తి శ్రద్ధలతో చప్పరించేవాణ్ణి'. అని తాతగారు స్వయంగా చెప్పారు. ఈ రోశిరెడ్డిగారు చాలా కాలంగా శ్రీస్వామివారి మూత్రాన్నంతా రెండవ వారికి తెలియకుండా త్రాగేసేవారు. శ్రీస్వామివారి కృపవలన ఒకరోజు అది నాకంట్లో పడింది (రచయిత) గనుకనే చివరి వరకు ఏ వ్యాధి బాధలు, శరీర రుగ్మతలు లేకుండా ఒకరిసేవ తీసుకోవలసిన

అవసరం లేకుండా శ్రీస్వామివారి చైతన్యంలో ఐక్యం కాగలిగారు. సమాధి చెందాక వీరి భౌతిక కాయానికున్న దివ్యతేజస్సు, పద్దెనిమిదిగంటల తర్వాత కూడా బిగిసిపోని దేహము, వీరిభక్తికి మెచ్చి శ్రీస్వామివారు వీరికి ఉత్తమ గతిని ప్రసాదించారని తెలుపుచున్నవి.

చివరిదశలో ఫోటో తీసేందుకు వీరు సుతరాము అంగీకరించలేదు.కానీ చివరకు భక్తుల బలవంతంపై ఒక్క ఫోటో తీసుకోనిచ్చారు. ఇంటినిగురించి తలంపు వీరిమనసులో మెదిలిందంటే వెంటనే అచ్చట జరిగే విషయాలన్నీ దృశ్యరూపంలో స్పష్టంగా సినిమాలాగా చూడగలిగేవారట. అటు తర్వాత తమ గ్రామం నుండి వచ్చిన వారిని ఆయా విషయాలను గూర్చి వీరు ప్రశ్నిస్తుంటే 'నిజంగా నీవా విషయాలు చూచినట్లుగా అడుగుచున్నావేమని' ఆశ్చర్య పోయేవారు. ఏ మనిషి ఎలాంటి వారో కూడా శ్రీస్వామివారు వీరికి సంకేత దృశ్యరూపాలలో చూపేవారట. ఉదాహరణకు

## శ్రీ భరద్వాజ మాష్టరు - శ్రీ మహావిష్ణువు

ఒకరోజిలా జరిగింది. అది సమాధి మందిర శంకుస్థాపన పుణ్యతిథి. శ్రీస్వామివారు తన పూరిపాకలో ఉన్నారు. ఆచార్య శ్రీఎక్కిరాలభరద్వాజ మాష్టరుగారు మధ్యహ్నాం పన్నెండు గంటలవేళ శ్రీస్వామివారి దర్శనార్ధం వస్తున్నారు. వారు శ్రీస్వామివారికి పది పన్నెండుగుల ఊరములో ఉండగనే శ్రీసాయిభక్తులందరూ ఆచార్యుల వారి పాదపద్మములపై వ్రాలి నమస్కరింపసాగారు. వారెంత వారించినా వారు వినిపించుకోవడం లేదు. అక్కడనే ఉన్న శ్రీరోశిరెడ్డిగారు ఇలా తలచారట 'ఇంతగొప్ప మహనీయుడు శ్రీస్వామివారే తన పాదాలను, మరొకరు తాకినమస్కరించుకోవ్వడుగదా. మరి ఈభరద్వాజ ఎంత? ఈయన శక్తిఎంత? వీళ్ళందరికి ఈ విధంగా పాదాలప్పగించి వారి నమస్కారాలు స్వీకరిస్తున్నాడే. ఇది వీరికి మంచి పనేనా? ఇంత తెలివిగలవాడు కూడ ఈ విధంగా చెడిపోవలసిందేనా స్వామీ?' అని తనమనసులో బాధపడ్డాడు. వెంటనే వీరికి మైకం గల్గినట్లు అచ్చటున్న గోడకు చేరగిలపడ్డాడట. వీరి



మనోనేత్రానికి ఒక దృశ్యంకనిపించింది. 'నేనొక ఎడారిలో నిలబడి ఉన్నాను. నా నుండి పదడుగుల దూరంలో శ్రీభరద్వాజగారున్నారు. అంతలోనే ఈ భరద్వాజగారు శంకు, చక్ర, గధా ధరుడైన మహావిష్ణువుగా మారిపోయాడు కిరీటంతో సహా సర్వం ఉన్నాయి. కానీ వీరిగడ్డం అలాగే ఉంది. వీరిపాదాలు చుట్టూ మూడడుగుల వరకు పచ్చని పచ్చిక మంచుబిందువులతో మెరిసి పోతుంది. నేను , వెంటనే ఒక దున్నపోతుగా మారి, వారి పాదముల వెంబడియున్న పచ్చికతింటున్నాను. ఆ దృశ్యం అంతరించి హుషారుగా మెలకువ వచ్చింది. శ్రీ భరద్వాజ మాష్టరుగారంటే ఎవరో శ్రీస్వామివారే నాకు తెలియజేశారు, ఈ దృశ్యం ద్వారా. నాటి సాయంకాలం నేనే వెళ్ళి ఆచార్యుల వారి పాదాలకు నమస్కరించాను. కారణమడిగిన నాతో (రచయిత) తమకు శ్రీస్వామివారిచ్చిన దృశ్యం గూర్చి "వివరించి ఆచార్యులవారిని జాగ్రత్తగా సేవించుకోమని చెప్పారు".

ఒకప్పుడు ఎవరో ఏమో అన్నారని యితడు యింటికి వెళ్ళాలనుకున్నాడు. ఆయనను శ్రీస్వామివారు ఏకాంతంగా పిలిచి, 'పంటచేను వదిలి పరిగ ఏరుకుంటావా', అని హెచ్చరించారు. అతడాసంకల్పం విడిచి పెట్టాడు. సద్గురు సాన్నిధ్యం పంటచేను. సామాన్యంగా లోకంలో జీవిస్తూ ఇతర సాధనలుచేయడం పరిగ ఏరుకోవడం లాంటిది.ఒకరోజు ఆయన అల్లుడు, కుమారుడూ ఆయనను పదిరోజులు తమ యింటికి తీసుకుపోవాలని శ్రీస్వామివారి ఆశ్రమానికి వస్తున్నారు. అప్పుడు ఆయనకు చూపు సరిగా లేనందువలన ఒంటరిగా ఎక్కడికీ పోలేకున్నాడు. కానీ శ్రీస్వామివారు అతనిని 'త్రోవ పట్టుకొని నేరుగా పో!' అని ఆజ్ఞాపించారు గుర్వాజ్ఞయందు అచంచల విశ్వాసం గల రోశిరెడ్డి తనకు చూపు కనబడని విషయం కూడా లెక్కచేయకుండా ఎనిమిది కిలోమీటర్లు నడిచి, నెల్లూరు నుండి గొలగమూడికి ఒంటరిగా వచ్చేశాడు. అల్లుడు, కుమారుడూ బస్సులో ఈయన కంటే ముందుగా గొలగమూడి చేరి రోశిరెడ్డి కోసం విచారించారు.కానీ నడిచి వస్తున్నందున రోశిరెడ్డి మార్గమధ్యంలో ఉన్నాడు గనుక ఆశ్రమంలో లేడు.

ఒకరినొకరు కలవనందున ఇక రోశిరెడ్డిని వెతికిపట్టుకోవటం కష్టమని వాళ్ళు

తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. సర్వజ్ఞులైన శ్రీస్వామివారు అలా ఆదేశించకుంటే తన కుమారుడు, అల్లుడూ చెప్పేమాటలకూ మెత్తబడి ఇంటికి ప్రయాణమై పరిగపరుకోవడంలాంటి, లంపటంలోపడేవాడే గదా? అలా పడకుండా, గురుసేవలో తన సమయాన్నంతటిని గడపడమే త్రోవపట్టుకొని పోవడమని శ్రీస్వామివారి మాటలకర్థం.

ఈ అనుభవం మీద శ్రీచుండునాగయ్యగారి స్వంత అభిప్రాయాలను సాధకులమైన మనమంతా శ్రద్ధతో ఆలకించవలసియున్నది. నేను (రచయిత) వారినడిగాను 'తాతగారూ మరి మీరు శ్రీస్వామివారిని 'నన్నే ప్రదేశానికి తోవన పొమ్మంటున్నారు. అని అడుగలేక పోయారా'? అని అడిగాను. దానికి వారి సమాధాన చూడండి. 'శ్రీసద్గురువుగారి ఆజ్ఞలను ప్రశ్నించ మొదలుపెట్టామంటే మనకు అనేక ప్రశ్నలుద్భవిస్తాయి. వారా ప్రశ్నలన్నింటకి ఎంతో ఓర్పుతో సమాధానాలిచ్చినా మనము ఆ సమాధానాలభావాన్ని సరియైన అర్థంలో, మార్గంలో అర్థంచేసుకోలేము. అంతేగాక వారిభావాన్ని తప్పుమార్గంలో అర్థంచేసుకునే ప్రమాదమెంతైన ఉంది. ఇది మన చెవులకు, అంటే, వినడంలో ఉండే గొప్ప బాధ. గనుక అన్నిటికంటె ఉత్తమమైన మార్గమేమంటే మనం వారిదివ్య పాదారవిందములకడ శరణుజొచ్చి మమ్ము సరైన మార్గాన నడిపించి తమ ఆజ్ఞలను తమ ఇష్టానుసారం నెరవేర్చునట్లు చేయవే తండ్రీ అని ప్రార్థన చేయడమొక్కటే సరైన మార్గము. వారు మనలాంటి మానవ మాత్రులుకారు. వారు సన్నివేశాలను నడిపించే మార్గమే చాలా విచిత్రంగా ఉంటుంది. వారు మన హృదయాలను తగు విధంగా ప్రేరేపించి మనలను చాలా సులభంగా గమ్యం ర్చగలరు. మన పనికిమాలిన తెలివితేటలపై ఆధారపడక వారిపాదములకడ ృదయపూర్వకముగా శరణుజొచ్చి వారొక్కరే మనకు దిక్కని నమ్మడమొక్కటే యైన మార్గమైయున్నది.

కనుక, శ్రీస్వామివారు పై విధంగా నన్నాజ్ఞాపించినపుడు నేను వారి ములకడ - "'స్వామీ ఏ దిక్కులేని నాకు నీవేదిక్కు. నన్ను తగు విధంగా



ప్రేరేపించి తమ ఆజ్ఞలను, మీకు ప్రీతి పూర్వకంగా నెరవేర్చునట్లు నన్నునడిపించరి '. అని ప్రార్థించికదిలాను. మిగిలినదంతా వారే చేశారు నిజానికి నేను ఎనిమిది కిలో మీ॥ నడిచే స్థితిలోగాని, దృష్టిగాని లేదు. నెల్లూరులాంటి ట్రాఫిక్‌రోడ్లపై ఎలా నడిచి గొలగమూడి చేరానో అంతా ఒక వింతే. ఇంతకంటే నేనేమి వివరించలేను' అన్నారు.

> **'శ్రీస్వామివారి దగ్గర నోరు విప్పితే**
> **భ్రష్టవుతాము సుబ్బరామయ్యా జాగ్రత్త'**
> **ఈ మాట వీరి ఉపదేశాలలో**
> **మకుటాయమానమై నలచింది.**

శ్రీస్వామివారు, మహాసమాధికి ముందు ఒక సంవత్సరం నిరంతరం తన రెండు పిడికళ్ళను బిగించి వేళ్ళు వూడదీయనిచ్చేవారు కాదు. ఎంతటి రుగ్మతలో ఉన్నా, యోగస్థితిలో ఉన్నాకూడా ముందుకు జరిగి, మూత్ర విసర్జన చేసేవారు గాన, తన పరుపుల మీద విసర్జించేవారు కాదు. రోశిరెడ్డి, స్వామి మూత్రమును భక్తితో ఔషదముగా అనేక రోజులు సేవించి సర్వరోగముల నుండి విముక్తులయ్యారు.

కనుకనే రోశిరెడ్డికి కంటిచూపు లేకున్నా అన్నం మానివేసి, అటుకులు, ద్రవాహారంతో జీవిస్తున్నా చివరి శ్వాసవరకు ఊరిలోకి భిక్షకు వెళ్ళి భక్తులకోసం భిక్షాన్నం తెచ్చే తన సేవను, దీక్షగా చేస్తూనే ఉండేవారు. సేవకులు స్వామి సేవచేస్తే, ఈయన ఈ విధంగా సేవకులకు సేవచేస్తున్నాడు. అచంచలమైన వారి విశ్వాసమే వారి బలం.

## ప్రేమానురాగాలు

శ్రీ రోశిరెడ్డిగారికి శ్రీస్వామివారి ఎడలగల ప్రేమనురాగములకు మచ్చుతునకగా

ఒక సన్నివేశం మిగిలిపోయింది. ఈ సన్నివేశం నాకన్నులార, నేనే చూడగలగడం నా భాగ్యంగా భావిస్తున్నాను (రచయిత) ఆరోజు శ్రీస్వామివారు తలుపూరు నారాయణదాసు ఆశ్రమంలో ఉన్నారు. అప్పుడు టైం ఒంటిగంటకుపైన అయింది. శ్రీస్వామివారి బృందానికి అన్నం ఉడుకుతుంది. శ్రీస్వామివారు "ఒక్కక్షణం ఇక్కడ ఉండకూడదు పదండి" అని ఎంతకేకలేసినా ఒక్కరు కూడా కదలలేదు. అన్నాలుతిని వెళ్ళిపోవాలని వారి ఉద్దేశ్యము. కొంతసేపు శ్రీస్వామివారికాసంగతి చెప్పినా, వారు ఆవిషయాన్నే పట్టించుకోలేదు. వారికికనబడకుండా ఉంటే వారే ఊరకుంటారని తలా ఒకదిక్కువెళ్ళారు. కాని శ్రీరోశిడ్డిగారు మాత్రం శ్రీస్వామివారి వెంబడి ఉండి శ్రీస్వామివారిని డోలీలోకి పట్టితీసుకవెళ్ళమని ఎంతమందిని పిలచినా ఒక్కరుకూడా రాలేదు. శ్రీస్వామివారు మాత్రం ఒక్కక్షణం ఇచ్చట ఉండకూడదని తలబాదుకుంటూ, రచ్చచేస్తూ తన ఆసనం మీదనుండి పరిగాడుతూ జరిగివచ్చేస్తున్నారు.

ఆ సమయంలో శ్రీబరిగెల నాగయ్యగారికి కాలునొప్పిగా ఉండి ఒక్క అడుగు కూడ పెట్టలేనిస్థితిలోనున్నాడు. వెంటనే మిగిలిన సేవకులను లెక్కచేయకుండా శ్రీచుండునాగయ్యవురఫ్‌రోశిరెడ్డిగారు అతిబలహీనంగా, కళ్ళు కనబడని స్థితిలో ఉన్నాగాని లెక్కచేయకుండా విజృంభించారు.'గురవయ్యా నీవకప్రక్క నేనొక ప్రక్క డోలీ మోసుకొని శ్రీస్వామివారిని ఆశ్రమందాటించి తీసుకవెడదాము. మిగిలిన వారు సామాను తరువాత వస్తారు' అని చెపుతూ శ్రీస్వామివారి ముందు డోలీపరచి శ్రీస్వామివారిని పట్టేందుకు గురవయ్యగారిని పిలుస్తున్నారు. అదిచూచిన శ్రీ బరిగెల నాగయ్యగారు ఇంతకాడి కొచ్చాక చచ్చీ ఒకటే బ్రతికీఒకటే అంటూ గురవయ్యా! నేనొక ప్రక్కనీవప్రక్క మోసుక పోదాం పదమంటూ శ్రీస్వామివారిని డోలీలో తీసుకొని వెళ్ళిపోయారు.

వెంటనే రోశిరెడ్డి తాతగారు శ్రీస్వామివారి పరుపుదిండ్లు, చాపలు, దుప్పట్లు, ముంతలు, పంగాలు కర్రలు ఇంకాఏమేమి వేశారోగానిఆమూట నాలుగడుగుల ఎత్తుంది. అక్కడే నిలబడి ఉండేనన్ను ఆ మూటతననెత్తి కెత్తమన్నాడు.



చెప్పులులేకుండా ఆమండుటెండలో నేనొక్క అడుగుకూడా పెట్టలేనుగనుక శ్రీస్వామివారిని గాని ఆమూటనుగాని మోసే అర్హత లేకుండా పోయింది. ఆమూటతో ఇప్పుడు పని ఏముంది తాతగారు సాయంకాలం మనవాళ్ళుతెస్తారు గదా అంటే వారంగీకరించలేదు. 'పోతానే శ్రీస్వామివారిని వేరేవాళ్ళ చాపల మీద కూర్చొబెడుదామా? వద్దు, నీవు ఎత్తవయ్యా' అని తొందరచేసి ఆమూట నెత్తికెత్తుకున్నారు. ఆ మూట ఆయన నెత్తి కెత్తే దానికే నా శక్తి సామర్థ్యాలంతా చాలలేదు. చక్కెరనీరు త్రాగే ఈ గ్రుడ్డి ముసలాయన ఇంతబరువెలా తీసికెళ్ళగల డబ్బా అని సందేహిస్తూనే వెళ్ళాను. రెండు ఫర్లాంగులవరకు ఆబరువలాగే ఈముసలాయన మోశాడు. ఆయనకు బరువనిపించి క్రింద దింపుదామనే లోపల ఒక టెలిఫోను ఇనస్పెక్టరు ఆమూట నెత్తుకొని మిగిలిన రెండు ఫర్లాంగులూ మోసి, చెర్లోపల్లి రాంమందిరం దగ్గర శ్రీస్వామివారి చెంత సాయంత్రం నాలుగుగంటల వరకు కూర్చొని యుండి నేను స్కూలు వదలగానే శ్రీస్వామివారి చెంతకు వెళ్ళగానే నన్నుకొన్ని ప్రశ్నలడిగారు.

1. అయ్యా ఈ స్వామి వారెవరు?
2. వీరి మహిమ ఏమిటి?
3. మీరెందుకు శిరస్సు వంచి మట్టిలో సాష్టాంగ దండం పెడుతున్నారు?

అందుకు నేను 'అయ్యా వారొక గొప్ప అవధూత స్వామివారి మహిమేమిటో ఎవరికి వారే అనుభవించి తెలుసుకోవాలి గాని చెప్పసాధ్యముకాదు అన్నాను. అందులకాయనన్నారు 'అయ్యా మీరు చెప్పేఅనికంటే వారి శక్తి సామర్థ్యాలు చాలా ఎక్కువ. నా క్రిందపనిచేసే వారొక పది మంది యున్నారు వారిలో ఎవరికి సైగచేసినా ఈ ముసలాయన తెచ్చే బరువైన మూట తెచ్చి ఇచ్చట దించేస్తారు. కానీ ఆ సమయములో నా హోదా మర్చిపోయి ఆ మూటను నేనే నెత్తిన బెట్టుకొని తెచ్చి ఇక్కడ బెట్టి ఇలా కూర్చుండిపోయాను. నా చేత తన మూట మోయించుకున్న ఈ స్వామివారి మహిమను నేనేమని కొనియాడగలను"అని ముగించారు.

ఇచ్చట మనం గుర్తించవలసినది శ్రీ రోశిరెడ్డిగారికి శ్రీస్వామివారి ఎడల గల

ప్రేమాభిమానములు, భక్తి శ్రద్ధలు. శ్రీస్వామివారి బృందంలోని అందరూ శ్రీస్వామివారి అరుపులుగాని తలకాయకొట్టుకోవడంగాని, ఆసనం మీదనుండి జరిగి రావడంగాని లెక్కేచేయలేదు. కానీ కళ్ళుకనబడక, చక్కెర నీళ్ళు మాత్రమే త్రాగి అతిబలహీనంగా ఉండే రోశిరెడ్డిగారుశ్రీస్వామివారిని డోలీలో కూర్చోబెట్టి మోసుక వెళ్ళేందుకు సిద్ధపడ్డారు. అటుతర్వాత అంతబరువైన మూటను రెండు ఫర్లాంగులు మోశారు. అంత బలహీన స్థితిలోగూడ శ్రీస్వామివారిని ఎచ్చట కూర్చోబెట్టాలన్నదే వారిధ్యాస. ఈ విధంగా వీరు చివరి శ్వాసవరకు శ్రీస్వామివారి చెంత నుండి సేవించిన భాగ్యశాలి.

శ్రీ చుండునాగయ్యగారి కైవల్యాన్ని గురించి వారికి సేవచేసిన శ్రీ బరిగెల నాగయ్యగారు ఇలా వివరిస్తున్నారు.

ఆనాటివరకు వారు ఎవరిసేవనూ స్వీకరించవలసిన అవసరమే లేకుండెను. నడువలేని స్థితి అయినప్పటికి వారు తనయొద్దనున్న మట్టి ముంతలో మూత్రవిసర్జన చేసి తానే, మూడడుగుల ఎత్తుగోడలు గల, తాను నివసించే పూరిపాక చూరుకంతగుండా, బయట పారబోసేవారు. షుమారు ఐదుసంవత్సరాలుగా అన్నం తినడం మానేశారు. కొన్నాళ్ళు అటుకులు, తాలింపుకూర చప్పరిస్తూతినేవారు. చివరిదశలో షుమారు ఒక సంవత్సరం పాటు వేడినీళ్ళలో చక్కెరవేసి కలిపిస్తే త్రాగేవారు. ఇంతకుమించి ఎలాంటి ఘనపదార్థము ముట్టేవారుకాదు గనుక వీరికి మలవిసర్జన నియమంగా నిత్యమూ ఉండేదికాదు. ఎప్పుడైనా వెళ్ళాలంటే పూరిపాక బయట నిర్మించిన తాటాకుదడి చాటుకు వేళ్ళేవాడు. ఆరోజు మధ్యాహ్నం స్నానం చేయాలన్నారు. ఎవరు చేయిస్తానన్నావద్దన్నారు. 'నన్ను మీరెవ్వరూ దయచేసి తాకవద్దు. బరిగెల నాగయ్యను పిలవండి నాకు స్నానం చేయిస్తాడు' అని చెప్పారు. నేను (బరిగెల నాగయ్య) వెళ్ళిచంకలోచెయ్యివేసి లేవదీసి స్నానం చేయించాను. నేను పట్టుకొంటే శ్రీస్వామివారి బండి, పటాలకు ప్రదక్షిణ చేశారు. ఈతాకు చాపమీద కూర్చోబెట్టి అందరమూ బయటికి వచ్చేశాము. శ్రీచుండునాగయ్యగారు తీవ్రంగా



ధ్యానస్థులయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు లోపలికి వెళ్ళిచూచినవారు కన్నీటితో తిరిగి బయటకు వచ్చారు. తాతగారు ప్రశాంతంగా పూర్తి ప్రజ్ఞస్మరణతో శ్రీస్వామివారి సాన్నిధ్యం చేరారని అందరూ గుర్తించారు భీష్ముని పట్టుదల గలవాడని శ్రీస్వామివారిచేత ప్రశంశింపబడిన పురుషసింహము, ఎంతో ఉదాత్తంగా భీష్మునిలాగానే శరీరం వదలారని అందరూ నివాళులర్పించారు.

నిస్వార్థంగా సంపూర్ణ విశ్వాసంతో తన శరీరం శ్రీస్వామివారి కర్పించి, దానిపై మమకారం లేకుండా శ్రీస్వామివారికి సేవచేసిన ధీరుడు గనుక శ్రీవారు వీరిని మంచాన కుంచానబడకుడా ఎవరిసేవనూ తీసుకొనవలసిన అవసరం రాకుండా పూర్తి ప్రజ్ఞ, స్మరణతో తనువు వీడేలాగ ఆచల్లని తండ్రి అనుగ్రహించారు. మానవ మాత్రులమైన మనకింతకంటె కావలసిన సిరిసంపదలేముంటాయి! సద్గురు కృప ఎలా పొందాలో ఆచరణద్వారా మనందరికీ నేర్పిన ధన్యజీవి, శ్రీచుండునాగయ్యగారు. వీరు గత జన్మలో శ్రీస్వామివారికి గురువు గారట. ఈ జన్మలో వీరు మనందరికీ గురువుగారే!

పురుగుకాటు వల్ల వాచిన కాలువాపు నొప్పి, విముక్తి చేయడం, రోశిరెడ్డిగారి కొండంత ప్రారబ్దాన్ని గోరంత అనుభవింపజేసి నివారించడం, రోశిరెడ్డిగారి కొమారుని ప్రాణాపాయ పరిస్థితిలో రక్షించినవైనం, రోశిరెడ్డి శరీరాన్ని సంజీవిని చేయడం, మొదలైన విషయాలు అవధూత లీలలో చూడవచ్చు.

'వసద్ది చేసుకుంటే రెండక్షరాలు చాలవాయ్యా?' ఏమంత్రం మంచిది, ఏమంత్రం శక్తి వంతమైనది అనే వారికీమాట కనువిప్పుగల్గిస్తుంది. వసద్దిచేసుకోవడమే ముఖ్యం. మంత్రంలో ఏమీలేదని శ్రీస్వామివారు బోధిస్తున్నారు. శ్రీరోశిరెడ్డిగారికి మనకూ కూడా అది చక్కనిసలహానే.

## మాతాజీ వక్కెమ్మగారు



మాతాజీ మేకల వక్కెమ్మగారు నెల్లూరు జిల్లా మహిమలూరు దగ్గర - బనవరాజుపాళెం గ్రామమునకు చెందినవారు. వీరికి ఒకప్పుడు పురుగుకాటువలన వంటిపై పొడ, విపరీతమైన జిల ఉండేవి. ఎన్నెన్నో వైద్యాలు, మంత్రాలు విఫలమైనాయి. మంత్రించిన మిరియాలు షుమారొక బుట్టడుతిన్నా ఇసుమంతకూడా గుణంకన్పించలేదు. ఎవరోచెప్పగా శ్రీస్వామివారిని దర్శించింది. ఉదయం పదిగంటలకు శ్రీస్వామివారి సన్నిధికి వచ్చి సాయంకాలం నాలుగు గంటలవరకు వారిసన్నిధిని నిలుచుకొని ఉన్నా శ్రీస్వామివారు ఈమెను పలకరించిందిలేదు. ఈమె తనకైతాను శ్రీస్వామివారికి తనబాధను చెప్పుకొన్నదిలేదు. ఈ ఆరుగంటలకాలంలో ఈమెకు కాలగతి తెలియకుండా శ్రీస్వామివారే చేశారన్నమాట. చివరకు శ్రీస్వామివారే ఈమెను పలుకరించి ఆమె ఎందులకొచ్చిందో అడుగమని శ్రీచలమానాయుడు అనే తన సేవకునికి చెప్పారు. తనకు పురుగుకాటని శ్రీస్వామివారికి వినపడనంత తిన్నగా చెలమానాయుడుగారి చెవిలో ఈమె చెప్పేలోగా శ్రీస్వామివారే అన్నారు. 'వక్కెమ్మకు పురుగు కాటుకదయ్యా ఏటుకు (దెబ్బకు) పోదా అది' అన్నారు. ఇక్కడ చిత్రమేమంటే ఈమెపేరు శ్రీస్వామివారికేగాదు వారి సేవకులకు కూడా తెలియదు. కానీ శ్రీస్వామివారు ఆమె పేరుతో కూడా ఆమె జబ్బును కూడా చెప్పి వారు సర్వజ్ఞులనే విశ్వాసం కల్గించారు. వారు చెప్పినట్లే ఆక్షణం నుండి ఆమె శరీరంలో జిలతగ్గి ఏమందూ మంత్రమూ లేకుండానే మూడురోజులలో ఆమె పురుగుకాటు బాధనుండి పూర్తిగా విముక్తి పొందింది. అదిమొదలుకొని ఆమె ఎక్కువ కాలం శ్రీస్వామివారిని సేవించమొదలు పెట్టింది.

ఈమెగారు హరిజన వర్ణానికి చెందినవారు. వీరికి ఆ జన్మాంతము వివాహం



లేదు. ఈమెగారు ప్రారబ్ధవశమున కొన్నాళ్ళు చిల్లరంగడినడిపింది. అచ్చం శ్రీతుకారాం మహరాజ్ వ్యాపారం చేసినట్లేచేసి అందరి ఋణాలు తీర్చి ఆ అంగడి ఎత్తివేసింది. అందరిలో భగవంతుని చూచే ఈ మహాతల్లి, చిల్లరంగడి అమ్మి ఏమి సంపాదించగల్గుతుంది? భగవంతుని కృపమాత్రమే చివరకు ఈమెకు మిగిలింది. శ్రీస్వామివారు బాగా నడిచే రోజులలో వీరి గ్రామానికి కూడా వెళ్ళేవారు. కానీ ఎవరింటికి పోకుండా పెన్నానదే వీరి ఆలయమయ్యేది. అలాంటి సమయాల్లో ఈమె శ్రీస్వామివారికి సేవచేసే భాగ్యం కల్గింది. మొదట మొదట కొన్నాళ్ళు శ్రీస్వామివారి సేవలోను కొన్నాళ్ళు ఇంటిదగ్గర గడుపుతూ చివరకు శాశ్వతంగా శ్రీస్వామివారి సేవకంకితమైనధన్యజీవి.

వీరు సన్నగాను, పొట్టిగాను అంటే నాలుగునుంచి నాలుగున్నరడుగుల ఎత్తు, నల్లగాను ఉండేవారు. ఆహారం చాలా స్వల్పంగా తినేవారు. నామస్మరణచేయడం, ధ్యానం చేయడం వీరికి పూర్వజన్మనుండి వచ్చిన సంస్కారాలై ఉన్నాయి. శ్రీస్వామివారి బృందానికంతా విస్తరాకులు సప్లయిచేయడం, బిక్షాన్నం చాలక అన్నంవండవలసి వస్తే వంటచెరకు తెచ్చిపెట్టడం, మంచుకాలం, వర్షాకాలాలలో శ్రీస్వామివారి అగ్నిహోత్రానికి అవసరమైన చిదుగుపుల్లలు సరఫరాచేయడంలాంటి భారంలేని పనులన్నీ నిర్విరామంగా చేస్తుండేది. ఏమాత్రం తనకు వ్యవధిచిక్కినా దూరంగా వెళ్ళి ఏకాంతంగా ధ్యానస్థులయ్యేవారు. వీరు ధ్యానస్థులైతే అనేక సార్లు వీరికి కాలగతి తెలిసేదికాదు. అలా ధ్యానంలో ఎంతసేపు వీరున్నారో శ్రీస్వామివారొక్కరికే తెలిసేది అందుకే శ్రీస్వామివారు 'అయ్యా వక్కెమ్మ, లోకం మరచిపోయింది. ఆమెను పిలచి అన్నం పెట్టండయ్యా' అని సెలవిచ్చేవారట.

మాతాజీ వక్కెమ్మగారు అటుఇంటిని, ఇటు శ్రీస్వామివారిని వదలలేక రెండు చోట్లకు పరుగులు తీసేరోజులవి. ఒకరోజు ఆమెగారు వచ్చి శ్రీస్వామివారికి నమస్కరిస్తూనే 'వక్కెమ్మ చచ్చిపోయిందనుకున్నానే' అనిపలికారు. అంతే! ఆమాటలో ఎంత ప్రభావముందోగాని అదిమెదలుకొని ఆమె శ్రీస్వామివారిని

వదలి ఇంటికి గాని మరెచ్చటికిగాని వెళ్ళలేకపోయింది. ఆ ఒక్కమాటతో మనలో ఉండే ఆశావ్యామోహాలు, బంధుప్రీతి మొ॥ చాపల్యములను శ్రీస్వామివారు తనయోగశక్తితో క్షాళన చేశారు. మన ఆధ్యాత్మిక పురోభివృద్ధిపట్ల వారికిగల శ్రద్ధ మరెవరికైన ఉన్నాదేమో చెప్పగలమా! ఎవ్వరికి ఉండవు. వారిశక్తి సామర్థ్యములు మనమర్థముచేసుకొని తగువిధంగా సాధనసాగిస్తామని పై విధమైన మాటలద్వారా వారుచేసిన పని, మనకెరుక పరచేవారు. సూర్యచంద్రులున్నంత వరకు వారు ఉండేవారే గనుక నేటికీ మనలను వారు వేయికండ్లతో కనిపెట్టూనే ఉంటారు. ఈ సత్యాన్ని గుర్తెరిగి నడుచుకోవడమే సాధన.

ఒకరోజు శ్రీస్వామివారు 'ఈరోజు ఎవ్వరూ మాట్లాడకూడదు. సముద్రస్నానం పోవాలి. వక్కెమ్మను కూడా తీసుకపోవాలి' అని అన్నారు. కానీ ఆరోజు శ్రీస్వామివారు సముద్రస్నానానికే పోలేదు. కానీ వక్కెమ్మగారికి సముద్రస్నానంచేసి వచ్చినట్లు స్వప్నమొచ్చింది. ఆస్వప్నం కాక తాళీయమైనది కాదని, తామే ఆమెకట్టి పవిత్రమైన అనుభూతి ప్రసాదించనున్నానని భక్తులకు తెలియజేయడానికే శ్రీస్వామివారలా అన్నారు. అయితే ఆరోజు ప్రత్యేకంగ్గా ఎందుకుమౌనం పాటించాలో భక్తులెవరూ వారిని అడుగలేదు.

ఒకరోజు శ్రీస్వామివారి బృందంలోని వారంతా పనులమీద వెళ్ళారు. 'నేను స్నానం చేయలేదు. కాబట్టి శ్రీస్వామివారికి జావపోయి' అని తులశమ్మగారు వక్కెమ్మగారిని పంపారు. వక్కెమ్మగారు ఎన్నడూ శ్రీస్వామివారికి గంజిపోయడం వంటి సేవచేయలేదు. అంతేగాక తాను హరిజన కులానికి చెందినదువలన అట్టిసేవజేయడానికి అర్హురాలు అవునో కాదోనని శంకించింది. భయంతోనే జావతీసుకొని శ్రీస్వామివారి వెనుక నిలబడింది. సర్వజ్ఞులైన శ్రీస్వామివారు 'రావక్కెమ్మా! భయమెందుకమ్మా, రా! జావరేకలో పోయి' అని పిలిచారు. సత్పురుషులపట్ల భక్తిశ్రద్ధలు, పవిత్రమైన నడవడీలేక పోవడ మెక్కటే కులహీనతని శ్రీస్వామివారిభావము.



ఒకరోజు శ్రీస్వామివారు 'వక్కెమ్మ తొంబై తొమ్మిది వాకిళ్ళు ఎక్కాలి' అని ఆమె పేరు మీద చీటి వ్రాయించారు. అదివిని వక్కెమ్మ పట్టరాని దుఃఖంతో ఏడుస్తూ శ్రీస్వామివారి పాదాల మీదపడి 'స్వామీ! మీకు ఇష్టం లేకుంటే నన్ను అడవిలో ముళ్ళచెట్టుగానైనా పుట్టించండి. కానీ మరలా మనిషిజన్మవద్దు.' అని రెండు గంటల్పాటు వారిపాదాలను తనకన్నీటితో అభిషేకించింది. ఆకరుణామూర్తి 'వక్కెమ్మ ఇక వచ్చేదిలేదని దేవునిపై ఆనపెట్టి వ్రాసి ఇవ్వయ్యా' అని చీటి వ్రాయించి ఆమెకు తన స్వహస్తాలతో ప్రసాదించారు. ఇదేవిధంగా ఇకప్పుడు శ్రీస్వామివారు 'వక్కెమ్మకు తొమ్మిది కిరీటాలున్నాయని వ్రాసియ్యాయ్యా' అని వ్రాయించి ఇచ్చారు. తొమ్మిది కిరీటాలంటే నవవిధ భక్తులూ ఆమెకు ఫలిస్తాయని వారిభావంగాభావు.

1. నెల్లూరు బస్టాండులో ఈమె నిద్రిస్తూ దొంగకు తన కమ్మలు తీసుకునే వీలుకల్పించడం.
2. ఈమె స్వప్నంలో ఒకస్త్రీ ఈమెకు కాటుకభరిణె ఇవ్వడం.
3. శ్రీస్వామివారి దర్శనార్థం నిండుగాపారే పెన్నానది దాటి వెళ్ళడం
4. ఈమె స్వప్నంలో శ్రీస్వామివారు విశ్వరూపం చూపడం
5. ఈమెకు ఆంజనేయ స్వామిగుడిలో బ్రహ్మబొమ్మలు చేసి ప్రాణం పోయడం దర్శనమైంది.
6. ఒకరోజు జాగ్రత్తులో ఈమెకు శ్రీస్వామివారు శ్రీకృష్ణదర్శనం ప్రసాదించడం.

పై అంశాలు అవధూత లీలలో వివరంగా చదువగలము.

1. మాతాజీ వక్కెమ్మగరితో నాకు (రచయిత) గలనాలుగు సంవత్సరాల పరిచయాన్ని మీతో పంచుకోవడం నాభాగ్యంగా భావిస్తాను. ఈమహాసాధ్వి బాగా తిరిగే రోజులలో ప్రతినిత్యం ఉదయం సాయంత్రం ఆశ్రమ పరిసర ప్రాంతాలంతా తిరిగి పశువుల పేడ ప్రోగుచేసేది. ఈ పేడంతా శ్రీస్వామివరి తోటలోని పూలచెట్లకు వేసేవారు. ఆపూలన్నీ శ్రీస్వామివారి సమాది నలంకరించేవారు. ఈపేడ

ప్రోగుచేయడంద్వారా ఈ మహాసాధ్వి రెండు మూడు విధాలుగా లాభమార్జించేది.
1. ఇతరులవలె ఊరక ఆశ్రమములో తిని కూర్చుంటే లౌకికమైన వ్యవహారాలు దొర్లి తాను కూడా, పరమపామరుల స్థితికి వచ్చే ప్రమాదమున్నది. పేడ ప్రోగుచేయడంద్వారా తానా ప్రమాదం నుండి బయటపడిందన్నమాట.

2. ఆశ్రమంలో ఇతరులతో కలసి గడిపేకాలం కంటే తీవ్రంగాను హృదయపూర్వకంగాను నామస్మరణాదులు ఈ కాలంలో జరిగేందుకు వీలుంది. అంతే గాక తాను పరమలౌకికులను వదలి ఏకాంతంగా కాలం గడిపే శుభసమయమదేనన్నమాట.

3. తాను నామస్మరణ పూర్వకంగా ప్రోగుచేసిన పేడ, శ్రీస్వామివారి సమాదికి అలంకరించే పూలు పూచే చెట్లకు ఉపయోగపడుతుంది. కొంతపేడను ఆనాడు ఆశ్రమంలో పెంచే కూరగాయలచెట్లకుకూడా వాడేవారు. ఈ మహాసాధ్విచేసే కార్యము ద్వారా తనకు మాత్రమే గాక ఇతరులకు గూడా ఉపయోగకరమెలా ...య్యేదో యోచించండి.

వీరితోగూడ నేను కనీసం నాలుగు సంవత్సరాల కాలం ఆశ్రమంలో ...వసించాను. ఏనాడైన ఈమె నోటిగుండా, పలానా వారిలాంటి వారనిగాని ...లానా వారిలాచేశారని గాని నేను విని ఎరుగను. అలాగే ఈమె ఇతరులతో ...లాంటి విషయాలు మాట్లాడుచుండగా నేనెన్నడూ వినియుండలేదు.

ఈమె అనేకసార్లు మా ఇంటికి వచ్చేవారు. ఎందుకో తెలుసా? నన్ను ...కరించి పోయేందుకు మాత్రమే సుమా! మా ఇంటికి వచ్చిందేచాలని ...తెచ్చిపరిస్తే ససేమిరా దానిపై కూర్చోకుండా నేలపైగాని అందుబాటులోనున్న ...ంపట్ట మీదగాని కూర్చునేది. 'నిన్ను చూచిపోవాలని వచ్చానయ్యా అనేది' ...్వామివారితో తన అనుభవాలు చెప్పమని ప్రతిదఫా మొండికేసేవాణ్ణి. అవన్నీ ...డు చెప్పకూడదులే అంటూ దాటేసేది. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు ప్రమింగి



ప్రమింగి కొంత బయట పెట్టేది. 'ఫలానా విషయమెట్లా జరిగిందవ్వానాకు చెప్పవచ్చులే చెప్పవ్వా! శ్రీస్వామివారి చరిత్రే బయటికొచ్చి అందరూ వచ్చి వారినుండి మేలు పొందుతుంటే నీవు దాచి పెడితే ఎట్లాచెప్పు' అని ఎంతో చెపితే కొంచెం చెప్పి మద్యలో ముగించేది. ఒక్కొక్కసారి పూర్తిగా ఒక్కొక్క సన్నివేశం చెప్పికన్నీరు కార్చేది. మా తల్లిగారి వద్ద ఎప్పుడూ పొగాకుండేది. అది కొంచెం పెడితే ఎంతో సంతోషించేది. ఒక్కసారిగూడ లోకాభి రామాయణం మాట్లాడక పోవడమే చిత్రమనిపిస్తుంది. మరి మనసంగతెలాంటిదో మనమే ఎవరికి వారు చూచుకోవాలి. కనీసం గొలగమూడి వచ్చి వెళ్ళినంత వరకైనా మనం శ్రీస్వామివారిని గూర్చి చింతించడం, మాట్లాడడం చేయగల్గితే మనమీ ప్రయాణానికి పెట్టిన డబ్బులో కొంతైనా ఉపయోగపడినట్లవుతుంది.

వీరుచేసిన మరొకగొప్పపని: శ్రీ స్వామివారి సమాదికి ప్రతినిత్యం రాత్రి మూడుగంటలకు అభిషేకం జరుగుతుంది. సమాదిమందిరంలో పనిచేసేవారంతా షుమారు నలుగురు ప్రతినిత్యం రెండుగంటల రాత్రి వేళ మందిరానికి వెళుతారు. ఈమె ఎప్పుడు నిద్ర పోతారో తెలియదుగాని రాత్రి ఒంటిగంటకే పొయ్యిమీద నీళ్ళుకాచి ఉంచేది. అక్కడే కూర్చొని మంటేస్తూ ఉండేది. వర్షాకాలంలో పొయ్యి సరిగా మండదని వర్షంలేని సమయంలో కొన్ని ఎండుపుల్లలు, టెంకాయ పెంకులు ఎండిపోయిన పేడ పిడకలు ఏరి తెచ్చి జాగ్రత్తగా భద్రపరచి ఉంచుకునేది. సమాదిమందిరంలో పనిచేసే వారేగాక ఇతరులు కూడా ఈ వేడినీరు స్నానంచేసేవారు. తెల్లవార్లు అలా మేలుకొని నామం చేస్తూ, ఆపొయ్యే, శ్రీస్వామివారి అగ్నిహోత్రంగా భావించి ఉంటుందని నాభావం. నేను నాఖర్మ నసించాలని చన్నీటి స్నానం చేస్తుంటే వీరెంతో బాధపడి వేడినీరు స్నానం చేయమని నన్నెంతో ప్రాధేయపడేది. ఈమె ఈసేవ చేయకున్నాగాని ఈమెను అడిగేందు కెవ్వరూ లేదు. కానీ ఈమె ఎంతో శ్రద్ధాభక్తులతో ఈపని నిర్వర్తించేది.

చివరివరకు ఎవరేమిస్తానన్నా తీసుకునేది కాదు. ఈమె ఇక జన్మకువచ్చేదిలేదు

గనుక రుణానుబంధాలు తీరాలిగనుక చివరి దశలో ఎవరైనా డబులిచ్చినా గుడ్డలిచ్చినా తీసుకొని తన మేనల్లుళ్ళకిచ్చేది. ఇది శ్రీస్వామివారి ఆదేశమై ఉంటుందని నా భావము.

శ్రీ తిరుమలశెట్టి వెంకయ్య ఇలా చెపుతున్నారు:-


ఆకుకూర దొరికే రోజులలో ఈమె ఎంతో శ్రద్ధగా కోనేటి కట్టమీద పరిసర ప్రాంతాలలో తిరిగి పెద్ద బుట్టడుకోసుకొచ్చేది. ఆ ఆకంతా చాలా చిన్నచిన్న ఆకులు కాడలు కలిగియుండేది. వారు అంత ఆకు అవిధంగా సేకరించాలంటే ఎంతో ఓపిక అవసరం, ఆ ఆకు కోసినంత సేపు నామజపం జరుగుతుంది, తనసేవ ఇతరులకు ఉపయోగపడుతుంది, తాను ఏకాంతంగా ఉండవచ్చు. ఒకే దెబ్బకు మూడుపక్షులు పడుతున్నాయి.

## శ్రీస్వామివారిలో ఐక్యం చెందడం:

షుమారు పదిహేనురోజుల కాలం వీరు కదలలేని స్థితిలో నున్నారు. ఈ కాలంలో తన సేవను తిరుమలశెట్టి వెంకయ్య అనే భక్తునకు అనుగ్రహించారు. వీరు దొడ్డికి పోవాలన్నా, మూత్రవిసర్జనకు వెళ్లాలన్నా వీరిని వెంకయ్య లేవదీసి రెట్టపట్టుకొని నడిపించి పదడుగుల దూరం తీసుకపోతే ఆయా అవసరాలు తీర్చుకొని తిరిగి తన ఆసనం పై విశ్రమించే వారు. బియ్యపు గంజివంటి పలుచని ద్రవాహారమే చివరి రోజులలో గ్రహించారు. చివరి ఘడియలలో కూడా వీరు సంపూర్ణ ప్రజ్ఞ కలిగి ఉన్నారు. రాత్రి ఒక వేళలో లేచి పలుకరించిన వెంకయ్య, వక్కెమ్మగారు శ్రీస్వామివారి చరణసాన్నిధ్యం చేరినట్లు గ్రహించి అందరికి వెల్లడిచేశారు. తన జీవితాంతము ఏధ్యేయాన్నైతే సాధిస్తూ వచ్చారో అపరమపదాన్ని శ్రీస్వామివారి కృపతో ఎంతోసులభంగా పొందిన ధన్యజీవి మాతాజీ వక్కెమ్మగారు 'వక్కెమ్మ ఇక వచ్చేదిలేదని దేవునిమీద ఆనబెట్టి వ్రాసియ్యయ్యా' అని శ్రీస్వామివారు శెలవిచ్చారు గదా. ఆమాటకు తిరుగేలేదు.



## భక్త శిఖా మణి శ్రీ అక్కిం వెంకట్రామిరెడ్డిగారు



శ్రీ వెంకట్రామిరెడ్డిగారు ముదిగేడు, నెల్లూరుజిల్లా వాస్తవ్యులు. ఈనాడు శ్రీస్వామివారి వేలిముద్రల కాగితాలెవరి వద్దనైనా ఉన్నాయంటే అవి ఈ మహాభక్తుని ప్రసాదమేనని చెప్పకతప్పదు. ఆ రోజుల్లో శ్రీస్వామివారు నిర్విరామయజ్ఞంగా సాగించిన వేలిముద్రల యజ్ఞఫలాలైన కాగితాలను తనను దర్శించిన భక్తులందరికీ ప్రసాదించి 'ముందురోజుల్లో లక్షల విలువ చేస్తాయి జాగ్రత్త వరచుకోండని' చెప్పిన శ్రీస్వామివారి మాటలను విశ్వసించి ఆవేలిముద్రలకాగితాలు జాగ్రత్తపరచుకొన్నవారు చాలాకొద్దిమంది మాత్రమే. వారిలో ఎక్కువ మంది, శ్రీస్వామివారు ప్రసాదించిన వేలిముద్రల కాగితాలలో ఏ ఒకటో రెండో దాచుకున్నారు కాని మిగిలిన వన్నీ చెత్తబుట్టలో పడేసిన వారే. కానీ శ్రీ అక్కిం వెంట్రామిరెడ్డి గారు మాత్రం శ్రీస్వామి వారి మాటయందు విశ్వాసంతో ఒక చిన్న కాగితం ముక్క కూడా పోగొట్టకుండా మొత్తం ఐదు బస్తాల కాగితాలు దాచిఉంచారు. శ్రీస్వామివారు సమాది చెందాక ఈ వేలిముద్రల కాగితాలనేరెడ్డిగారు దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులందరికీ పంచిపెట్టారు. ఈ మహాభక్తుడే ఆనాడు దాచిఉంచకపోతే మనకు శ్రీస్వామివారి వేలిముద్రల కాగితాలే దొరికేవికావు.

ఇంతేకాక, వీరిదగ్గర శ్రీస్వామివారు వాడిన, సిరా కలిపే ముంత ఇంకు పొడులు, కొన్ని వేలిముద్రల కాగితాలు మొదలైనవి ఒక ట్రంకుపెట్టెలో పెట్టి ఆ ట్రంకు పెట్టెను శ్రీస్వామివారే స్వహస్తములతో ఒక తాడుతో జాగ్రత్తగా కట్టి వీరికి ప్రసాదించారు. అది నేటికీ వీరి దగ్గర శ్రీస్వామి వారి ప్రతిరూపంగా నిలచిఉంది.

శ్రీ స్వామి వారు గృహస్తుల ఇండ్లలో విడిది చేసి వారి ఆతిథ్యం స్వీకరించిన గృహాలు చాలా అరుదు. అలాంటి అరుదైన గృహస్తులలో శ్రీ అక్కిం

వెంకట్రామిరెడ్డిగారు చాలా ముఖ్యమైన భక్తుడు. కారణం శ్రీస్వామివారు వీరి గృహంలో ఒక్కొక్కసారి వారం పదిరోజులుకూడా ఆతిద్యం స్వీకరించేవారు. ఇదే వీరిభక్తికి నిదర్శనం. వీరు శ్రీస్వామివారి కొరకు చిన్న పూరిపాక తన ఇంటి ఆవరణంలో వేసి శ్రీస్వామి వారు వస్తే అందులో ఉండమనే వారు. శ్రీ స్వామివారు లేనప్పుడు దానిలోనికెవ్వరూ ప్రవేశించకుండాజాగ్రత్తచేసేవాడు. ఈ పరమభక్తుని బాల్య జీవితాన్ని గూర్చి కొద్దిగా తెలుసుకోవడం మంచిది. ఆ విసయం వారిలా చెప్పారు.

'మా తాతగారికి మా అమ్మ మామేనమామ ఇద్దరే బిడ్డలు. మా నాన్నగారు మా తాతగారి దగ్గరకు ఇల్లరికం వచ్చారు. మా మేనమామ భార్య కాపురం చేయకుండా పుట్టింటికి వెళితే ఆమెను బలవంతంగా మా అమ్మ తీసుకువచ్చింది. ఆ తర్వాత ఆరునెలలకు మా అమ్మ అకస్మాత్తుగా చనిపోయింది. అది మొదలు మా అత్త నన్ను, మా నాన్నను, మా మేనమామను సరిగా పోషించకుండా మా హృదయాలను మాటలతోగాయపరుస్తూ బాధపెడుతుండేది. అప్పుడు నా వయసు పన్నెండు సంవత్సరాలు. ఈ మానసిక బాధ భరించలేక ఎవరైనా గురువును సేవించి తరించాలనే తపన మొదలైంది'. ఇలాంటి పవిత్రమైన కోరిక కలగడమే జన్మ సంస్కారమంటారు. మామూలు వ్యక్తులైతే మాటకు మాట తగాదా పడటమోలేక వేరేనీడచూచుకోవడమో జరుగుతుంది. కాని గురువు కొరకు అన్వేషణ చేయడం జరుగదు.

**గురువు కొరకు అన్వేషణ:** మా గ్రామానికి ముప్పైమైళ్ళ దూరంలోని మహమ్మదాపురంలో ఎవరో మహనీయుడున్నాడని విని ఒకనాడు కాలినడకన బయలుదేరాను. అక్కడి ఆశ్రమంలో ఉన్న పెద్దలు నాకన్నం పెట్టించి 'నీలాంటి చిన్న పిల్లలను మేము ఉంచుకోమని చెప్పి త్రిప్పిపంపేశారు. అది మొదలు మా ఇంటికి పోకుండా మా గ్రామంలోనే రైతులకు గొఱ్ఱెలు బఱ్ఱెలు మేపుతూ వాళ్ళు పెట్టింది తిని కాలం వెళ్ళబుచ్చుతుండే వాడిని. కానీ మహనీయులకొరకు నా అన్వేషణ మాత్రం మానలేదు.



విజయవాడ వైపునూజివీడులో ఎవరో మహనీయుడున్నాడని విని కాలినడకన నలభైమైళ్ళ దూరంలోని నెల్లూరు చేరాను. అప్పటికే నేను బాగా డస్సిపోయాను. నెల్లూరులో మా అమ్మ స్నేహితురాలు కనిపించి నాకన్నం పెట్టి తన హోటల్‌లో పనిచేస్తూ ఉండమనిఎంత బ్రతిమాలినా వినకుండా నూజివీడు చేరాను. ఎప్పుడో అరుదుగా దర్శనమిచ్చే ఆమహనీయుడు నా అదృష్టం కొద్దీ ఆరోజు తనగదినుండి బయటకొచ్చి ఆ దిగంబరయోగిగారు నాకు దర్శనమిచ్చారు. తను నాలుగు వైపులకు తిరుగుతూ తన దేహాన్ని చూపించి నాలాంటి చిన్న పిల్లలకు అక్కడ తావులేదని వెంటనే వెళ్ళిపొమ్మని రైల్వే పాసు ఇచ్చి పంపివేశాడు. విధిలేక తిరిగి మా స్వగ్రామంచేరాను. ఇంటికి రమ్మని మా అత్త నన్ను పిలువలేదు. నేను పోలేదు. రైతులకు పనిచేస్తూ వారు పెట్టింది తిని కాలంగడుపుతున్నాను. నా 17వ సం॥ వయస్సులో 6 నెలలు కలిచేడు మైకాగనిలో పనిచేశాను. అక్కడ మైకా దొంగలను పట్టుకున్నాను. కానీ ఆతర్వాత ఆదొంగలు నాకు హానికలిగిస్తారని భయపడి రాజీనామాచేసి ఇంటికివచ్చాను.

మా అత్త తనకు అన్నం సరిగా పెట్టడం లేదని ఇంటి పట్టున ఉండి తనకు వేళకంత అన్నం పెట్టమని మామామ కన్నీరు పెట్టాడు.దాంతో మాకున్న సేద్యం చేసుకుంటూ మా అత్తగారి సాధింపులు లెక్కచేయకుండా మామామను మా తండ్రిని సాకుతూ ఉండేవాడిని.

## ప్రధమదర్శనం

అప్పుడు నావయసు ఇరవై ఐదు సం॥రాలు. వివాహం కాలేదు. ఎద్దులు కొనేందుకు పెన్న బద్వేలు వెళ్ళాను. పచ్చా సుబ్బమ్మగారింట్లో జొన్న సంగటి ముద్ద అరచేతిలో పెట్టుకొని తింటున్నాను. ఆరోజుల్లో ఆప్రాంతంలో విస్తరాకులు దొరికేవికావు. ఇంతలో ఒకనడివయస్కుడు చేతిలో కర్రపట్టుకొని అక్కడకు వచ్చి 'అమ్మా'అని మృదువుగా పిలుస్తూ నేలపై తనపై పంచ పరచాడు. వెంటనే సుబ్బమ్మగారు ఒక సంగటిముద్ద అంత పచ్చడి తెచ్చి ఆ పంచలో వేసింది. వెంటనే అతడు ఆ సంగటి ముద్దను మూటకట్టుకొని భుజానవేసుకొని రివ్వున వెళ్ళిపోయాడు. ఆ వ్యక్తిని చూస్తూనే నాకొక విధమైన కుతూహలం గల్గి వారిని

గురించి వివరాలడిగాను. 'ఆయన ఏటిలో ఇసుకతో కట్టలేసుకుంటూ ఉంటాడు. కొందరు పిచ్చెంకయ్య అంటారు మరికొందరు వెంకయ్యస్వామి అంటారు'. అని సుబ్బమ్మగారు చెప్పారు. నేను భోజనం చేసి పశువుల డలారి పెద్దబ్బయ్యను తీసుకొని శ్రీస్వామివారిని చూడాలని ప్రక్కనున్న పెన్నానదికి వెళ్ళాను అనేక చోట్ల వెతికినా వారి జాడేలేదు.చివరకు నెత్తిన కపిలమోకు ముక్కల మోపు పెట్టుకొని,ఒకకొసకు నిప్పంటించిన కపిలమోకు ముక్క చేతపట్టుకొని మాకు ఎదురయ్యారు. 'స్వామీ! మిమ్ములను చూడాలని ఈ అబ్బాయి వచ్చాడు' అని పెద్దబ్బయ్య చెప్పగానే తన పైకండువా క్రింద పడేసి రెండు చేతులూ చాపి 'చూడవయ్యా చూడు బాగా చూచావా' అంటూ తన చుట్టూ తాను తిరిగారు. తన పైకండువా నుండి మూడు దారపుపోగులు తీసినాకిచ్చి, ముంతలోని ఆముదం వేలికిపూసుకొని ఒక కాగితం పై మూడు బొటన వేలిముద్రలు వేసి నాకు ప్రసాదించి ఒక వెళ్ళమన్నారు. వారి దర్శనముతో నా హృదయంఎందుకో ఆనందంతో నిండిపోయి ఎద్దులబేరం మానుకొని ఇంటికి వస్తున్నాను. మార్గమధ్యమున ఒకగ్రామస్తుడు మాటల సందర్భములో తన దగ్గరున్న ఎద్దును చూపి కొనమన్నాడు. ఆ ఎద్దు 100 లేక 120 రూ॥ ఖరీదు చేస్తుంది. కానీ ఆ ఆసామి 60 రూ॥ ఖరీదు చెప్పి 50 రూ॥ లకే అమ్మేశాడు. ఇంటికితోలుకొస్తే గ్రామస్తులందరూ 200 రూ॥ లకు ఇస్తే కొంటామన్నారు. కానీ నేనమ్మలేదు. ఇది శ్రీస్వామి వారి వేలిముద్రల మహిమని గుర్తించాను.

అది మొదలు కనీసం వారమునకొకసారైన కాలినడకన 30 మై॥ దూరం వెళ్ళి శ్రీస్వామివారిని దర్శించి వచ్చేవాడిని. వారి వల్లనేను పొందవలసినదేమీలేదు. కానీ వారిని చూస్తేనే ఆనందం నా నిలువెల్లి పొంగి పొరలేది. శ్రీస్వామివారు కూడా ఎంతో ప్రేమతో నాకు అన్నం పెట్టించి తనతో కొంతసేపు ఉంచుకొని పంపేవారు. నేనెప్పుడు వెళ్ళినావారిని వెతకవలసిన పనిలేకుండా వారే నాకెదురయ్యేవారు.

సాయి చరిత్రలో ప్రధమ దర్శనంలోనే బయాజీబాయికి శ్రీసాయిపై భక్తిప్రేమలు కల్గి, ఆమెజీవితాంతం సాయినిసేవించి నట్లుంది, వీరి విషయం.



ఇలాంటి నిస్వార్థమైన ప్రేమగల్గి జన్మజన్మల అనుబంధం వలననే వీరు శ్రీస్వామివారికి తన ఆవరణములోపూరిపాకవేసిశ్రీస్వామివారికి విడిది ఏర్పాటు చేసి సేవించేవారు. శ్రీస్వామివారితో పాటు శ్రీవారిదర్శనార్థం వచ్చిన భక్తులకు కూడ ఆతిధ్యమిచ్చేవారు రెడ్డిగారు 'నాకు ఇల్లువాకిలివద్దు. నేనెప్పుడూ నీతోనే ఉండి నీసేవచేసుకుంటా'నని పలుమార్లు అర్థించాడు. కానీ శ్రీస్వామివారు, 'ఇల్లువాకిలీ అన్నీ ఉంటేగదయ్యా సాదయ్య నీదగ్గర కొచ్చేది. ఏమీలేకుంటే ఎట్లావస్తాడు. మనచెయ్యిపైన, వచ్చినోళ్ళ చెయ్యి క్రింద ఉంటే అదెంత గొప్పనుకున్నావు ఏమికథ' అనిచెప్పి వీరిని గృహస్తుగానే ఉంచారు. వీరి ఆతిధ్యము స్వీకరించినందుకు ఆధ్యాత్మికంగా అనుగ్రహించడమేగాక లౌకికంగా కూడా అనుగ్రహించారు. పూరింటికి తాటాకు కప్పుకోలేని స్థితిలో వీరిచేత అప్పుచేయించి మిద్దెయిల్లు కట్టించారు, శ్రీస్వామివారు. శ్రీస్వామివారి కృపవలన అనతికాలంలోనే అప్పంతా తీర్చేశారు.

నేను, కాలినడకన షుమారు ఇరవైమైళ్ళకుపైన నడిచివెళ్ళి శ్రీస్వామివారిని పెన్న బద్వేలు దగ్గర దర్శించి వచ్చేవాణ్ణి ఎన్నోమార్లు మాగ్రామం రమ్మని పిలచినా మౌనం వహించేవారు. ఒకనాటి అర్థరాత్రి ఎద్దులకు గడ్డివేసేందుకు లేచివస్తే 'అయ్యా సుబ్బరామయ్యా, ఆహా, ఆహా,ఆగు ఆగు' అని పలకరించారు. (వెంకట్రామిరెడ్డిగారిని శ్రీస్వామివారు అలాపేరు మార్చిపిలిచారు) ఇదేమిటి స్వామి ఈకటికచీకటిలో ఇలా కూర్చున్నారు. ఎద్దులు పొడిస్తేఏమైనా ఉందా అని నొచ్చుకున్నాను. 'పరవాలేదులేయ్యా. ఒక చింపిరిమట్ట అట్లావెయ్యి కూర్చుంటాన' న్నారు. వెంటనే పందిరి పెరికి తాటిమట్టలు పరిచి ఎండు గడ్డిపరిచానుస్వామివారు ఆసీనులై 'అయ్యా అంత నిప్పుచూడు' అన్నారు.పందిరితాటిమట్టలు కొన్ని పెండెలు పెరికి మంటేశాను. స్వామివారు సంతోషంగా కూర్చున్నారు.

ఇదేవిధంగా అర్థరాత్రి వేళ అనేకసార్లు విచ్చేసి నిప్పుచూడమనే వారు. అలాగే వర్షాల్లో ఒక్కొక్కసారి పదిరోజులు కూడా మా గృహాన్ని పావనం చేశారు. కట్టెలకొరకు గ్రామస్తులను దేబిరించలేక నా అయిదంకణముల పూరింట్లో ఒక అంకణం

ఇంటికప్పు, పెండెలు అన్నీ స్వామివారి గుండానికే సమర్పించాను. ఒకరోజు దూలము కుంట తూలములాంటి వాటిని తీసి గుండానికి సమర్పించబోతే 'అయ్యా! అవి, పనిముట్లకు ఉపయోగపడుతాయి గదా వాటినెందుకు మంటలో వేస్తావు' అన్నారు. 'ఇప్పుడు మాత్రం మనం పారవేశామా స్వామీ అవి, మన పవిత్రమైన అగ్నిహోత్రానికి ఉపయోగపడుతున్నాయి గదా' అని విన్నవించుకున్నాను. అప్పటికే ఇల్లు వాకిలి అంటే విసిగిపోయిన నేను చిన్నపూరిపాక వేసుకొని వేరే కాపురమంటూ వుండే వాణ్ణి. నా శ్రద్ధాభక్తులు చూచికొందరు గ్రామస్తులు చింతమాళ్ళుకొట్టితోలారు. ఇలా నిస్వార్థంగా సేవించినందుననే స్వామివారు శ్రీరెడ్డిగారికి మిద్దెఇల్లు కట్టించారు. జీవనానికి ఢోకాలేకుండా నిమ్మతోట వేయించి వీరి కుటుంబాన్ని ఆర్థికంగా కూడా అనుగ్రహించారు.

## గొర్లు తోలడం

కొన్ని సంవత్సరాలుగా శ్రీస్వామివారి వెంట తిరుగుతూ ఇల్లువాకిలి వదలిపెట్టి శ్రీవారిని సేవించిన ధన్యజీవి శ్రీ చలమానాయుడు. అందరు సేవకులకంటె ఎక్కువ చనువుగాను చొరవగాను ప్రవర్తించేవాడు. ఒకరోజు ఉదయాన్నే శ్రీస్వామివారు, పెన్న బద్వేలులోని, శ్రీచలమానాయుడుగారింటికి పోతుంటే నేను (అ॥ వెంకట్రామిరెడ్డి) కూడా వెళ్ళాను. మేము వెళ్ళేసరికి చలమానాయుడు ఇంకా నిద్రపోతున్నాడు. 'ఏమి చలమానాయుడా, రాత్రి వానపడ్లా, నాలుగు సద్దగింజలు చల్లితే పిల్లకాయలు తినరా? అమాయిన్నే పడుకున్నా వేమయ్యా' అని చలమానాయుణ్ణి నిద్రలేపాడుశ్రీస్వామివారు 'విత్తనాలు లేవు పాడులేవు ఇప్పుడే విచల్లేదిలే స్వామీ' అన్నాడు చలమానాయుడు మంచందిగకుండానే, "లేలేవయ్యా గొఱ్ఱుకట్టి జడ్డిగం తగిలించు నీవు విత్తుతుండు నేను గొఱ్ఱుతోలుతుంటా, పదయ్యా" అని గొఱ్ఱుకట్టించి చేలోకి బయలుదేరదీశాడు శ్రీస్వామివారు. శ్రీచలమానాయుని అత్తగారు అప్పటికప్పుడు సజ్జకంకులు నలగొట్టి రెండు పళ్ళువిత్తనాలు తయారుచేసి ఇచ్చింది. శ్రీస్వామివారు గొఱ్ఱుతోల, చలమానాయుడు విత్త - సాయంకాలానికి ఆరు ఎకరాల సజ్జ విత్తారు.



శ్రీస్వామివారు పాదం పెట్టిన మహాత్మ్యమేమో, ఆసంవత్సరం చలమానాయుని చేసు అదరపండి, ఎకరాకుపుట్లు పండాయి. ఆ విధంగా తన అంతరంగిక భక్తులకు శ్రీస్వామివారు సేద్యపు పనులలో కూడా సహాయపడేవారు.

ఒకసారిచలమనాయుని చిన్న పిల్లవాడు చనిపోతే శ్రీస్వామివారే ఆశవాన్ని భుజానేసుకొని తీసుకపోయి పెన్నానదిలో పూడ్చి పెట్టివచ్చారు.

శ్రీస్వామివారి గొప్పదనాన్ని ఈ మాయలోకం గుర్తించడాన్ని గూర్చి అక్కం వెంకట్రామిరెడ్డిగారు ఇలా వివరించారు.

## ప్రథమ మహిమ:

ఆరోజులలో శ్రీస్వామివారిని, 'పిచ్చెంకయ్య చాలా బాగా ప్రశ్నలు చెపుతాడు. జబ్బులు కూడా నయం చేస్తా'రనే వారే ఎక్కువమంది. వెంకయ్యస్వామివారు అనే పూజ్యభావంగలవారు చాలా కొద్ది మందే ఉండేవారు. పెన్నానది వెంబడి నీటికడ్డంగా ఇసుకతో కట్టలు వేసుకుంటూ, ఒక కొనకు నిప్పంటించినకపిలమోకు ముక్క నొకచేత, ఉగ్గంపెట్టిన ముంత పంగాలుకర్ర మరొకచేత ధరించి పెన్నానది వెంబడి తిరిగే రోజులవి.

ఒకరోజు ఉయ్యాలపల్లిశెట్టిగారొకరు మిద్దెఇల్లు కట్టుకుంటూ పెద్దలావైన దూలమొకదాన్ని రెండెడ్లబండిపై తోలుకవస్తున్నాడు. ఆ బరువైన దూలాన్ని ఆ ఎద్దులు పెన్నానది ఇసుకలో లాగలేకపోయాయి. మరొక జత ఎద్దులను కట్టి లాగించినా ప్రయోజనంలేకపోయింది. ఆనాటికి బండి దూలము, నదిలో వదిలేసి వెళ్ళిపోయి తెల్లవారి వచ్చారు. ఆదూలమక్కడలేదు. అంతబరువైన దూలమెలా మాయమయిందా అని అందరూ మదనపడ్డారు. ఇసుకలో అడుగులజాడ బట్టి వెళ్ళారు. కోటి తీర్థం దేవాలయం దగ్గర పిచ్చెంకయ్య వేసేమంటలో ఆదూలం జాజ్వల్యమానంగా మండుతుంది. ఏమయ్యా బంగారంలాంటి దూలాన్ని ఇట్లా తగలపెడుతున్నావు. అయినా అనలంతబరువైదూలాన్ని ఇక్కడికెలా తేగలిగావు అనే ప్రశ్నలతో

లబోదిబోమన్నాడాశెట్టిగారు. నాలుగు ఎద్దులులాగలేని ఆదూలాన్ని ఈయన ఇక్కడకు తెచ్చాడంటే వీరు సామాన్య మానవుడుకాదు!

వీరు అణిమాది సిద్ధులుగల యోగీశ్వరుడని అక్కడ చేరినవారంతా అబ్బురపడి సాష్టాంగదండ ప్రణామములాచరించారు. శ్రీస్వామివారు, ఆకాలేదూలముపై నీళ్ళుచల్లి ఆర్పించి 'అయ్యా ఈ కాలిన ముక్కను తీసుకపోయి నీయింటి పనిముట్లకువాడుకో నీకు నాలుగు లక్షలు లాభం వస్తుందని ఆశీర్వదించారు. మామూలుగా కాలిన కొయ్యను ఇంటిపనిముట్లకు వాడరాదని వాస్తుశాస్త్రం చెపుతుందని ఆశెట్టిగారు వెనుకాడారు. కానీ అక్కడున్న వాళ్ళంతా 'యోగీశ్వరుడైన శ్రీవెంకయ్యస్వామివారు ఆజ్ఞాపిస్తున్నారు భయపడకుండా వారు చెప్పినట్లు చేయమని సలహా ఇచ్చారు. శెట్టిగారు అలానే ఆ ముక్కను తీసుకవెళ్ళి ఇంటికి వాడుకున్నారు. కాలాంతరం లో వారు నిజంగానే భాగ్యవంతులయ్యారు.

ఈ వార్త, నలుమూలలా బాలభానుని సూర్య కిరణాల లాగ వ్యాపించి అనేకమంది భక్తులు శ్రీస్వామివారినిదర్శించేందుకు కారణమైంది. ఇది మొదలు, ప్రతిఒక్కరూ శ్రీవారిని శ్రీవెంకయ్యస్వామివారు అని ఎంతో పూజ్యభావంతో చూడసాగారు.

షిర్డిసాయిచరిత్రలో నీటితో దీపాలు వెలిగించి ప్రజలకన్నులు తెరిపించిన శ్రీసాయినాధుని చర్యవలె ఉంది ఈ దూలాన్ని మండించిన లీల.

## నా కొమారుని తొడగడ్డ

నాకొక్కడే కుమారుడు. వానికి ఆరవసంవత్సరములో తొడమీదవాచి విపరీతంగా నొప్పిపెట్టసాగింది. నాటువైద్యాలు, భూతవైద్యాలన్నీ విఫలమైనాయి. నా ప్రారబ్దం కొద్దీ శ్రీస్వామివారికి విన్నవిచాలనే తలంపే కలుగలేదు. నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి ఒక్క సంవత్సరంరోజులు వైద్యం చేయించినా వీసమెత్తు బాధతగ్గలేదు. చేతిలో డబ్బులేక, నేను, ఒక్కపూట, పూటకూలి వారిదగ్గర అన్నం



తిని టీ బంకు దగ్గర పడుకొనేవాడిని. ఆస్పత్రిలో ఉన్న నాభార్యకు అన్నం అందిస్తుండే వాడిని. ఇంజక్షన్లు మాత్రలు అన్నీ విఫలమైచివరకు బిడ్డకుకాలు తీసివేయాలి. పరికరాలు మావద్దలేవు. మద్రాసు తీసుకపొమన్నారు. పిల్లవాని బాధచూడలేకుండా ఉన్నాము.ఎనిమిదేళ్ళ పిల్లవాడు కళ్ళకు గంతలు కట్టుకని ప్రశ్నలు చెపుతుంటే వెళ్ళాను. 'దయ్యం గాని చేతబడిగాని లేదు. వంటనబుట్టినఖర్మ. కొన్నాళ్ళకు పోతుం'దన్నాడు. పిల్లవాని బాధచూడలేక, మద్రాసు తీసుకపోను ఆర్థికంగా శక్తిలేక, రైలు క్రిందపడి చనిపోవాలని రైలు స్టేషను దగ్గర కొచ్చాను. ఆ సమీపంలో ఎవరో మాట్లాడుకుంటూ అయ్యపురెడ్డి పాళెంలో, ఎవరో ఒకతను, మనము నోరు విప్పకుండానే ప్రశ్నచెపుతున్నా'డని చెప్పుకుంటుంటే విని వచ్చినపని మరచిపోయి వాళ్ళదగ్గర అడ్రసు తీసుకొని అయ్యపురెడ్డిపాళెం వెళ్ళాను. అతడు తన అరచేయి చూచుకొని 'నీబిడ్డకు కాలునొప్పి అని వచ్చావు. నీవు ఆస్పత్రినుండి ఇంటికి వెళ్ళిపో. అది బాగవుతుందని చెప్పాడు. ఇకచేసేదిలేక బిడ్డను ఇంటికి ఈసుకవెళ్ళాను.

వేయి కళ్ళతో మమ్ము కనిపెట్టి కాపాడే శ్రీస్వామివారు మేము ఇల్లుచేరిననాడే మా గృహమును పావనం చేయవిచ్చేశారు. బిడ్డవిషయం విన్నవించగానే తనపైపంచెతో బిడ్డకు మంత్రించి 'అయ్యా బిడ్డ జబ్బును పై వాళ్ళుతీసుకపోయారు. అల్లా మొండిచేతిగమళ్ళాయన్ను తీసుకరాపో' అని శెలవిచ్చారు. ఆ గమళ్ళతనికి ఒకచేయి మనికట్టువరకులేదు. రణవైద్యంచేస్తాడు. ఆగమళ్ళ తను బిడ్డనుచూచి 'పెద్ద పెద్దడాక్టర్లకు అలివిగానిది, నేనేమి చేయగలను స్వామీ? అని విన్నవించారు.

'పైవాళ్ళు జబ్బును ఎప్పుడో తీసుకపోయారయ్యా, నీవు ఊరకనే నీకు తోచిన వైద్యం చెయ్యి సరిపోతుంది' అని శ్రీస్వామివారు శెలవిచ్చారు. రణవైద్యుడు బిడ్డ కాలికట్టువిప్పిచూచాడు.నాకు చాలా ఆశ్చర్యమేసింది. అంతవరకు విపరీతంగా వాచియున్నకాలు యొక్క వాపంతా ఏమైందో గాని, కాలు కట్టెపుల్లలాగసన్నగా ఉంది. రణవైద్యుడు నువ్వులనూనె పూసి గుడ్డచుట్టి వెళ్ళిపోయాడు. వెంటనే బిడ్డ హాయిగా నిద్రపోతున్నాడు. అలా హాయిగా బిడ్డనిద్రపోవడం మేము గత

సంవత్సరం నుండి ఎన్నడూ చూడలేదు. అర్ధరాత్రికి బిడ్డ నిద్రపోతున్నాడు కాని కాలు మాత్రం మరలా చాలా ఎక్కువగా వాచి ఉంది. భయపడి పోయి వెంటనే రణవైద్యుని నిద్రలేపి తీసుకవచ్చాను. వైద్యుడు ఏదో చెక్క పిడికెడు తెచ్చి, దాన్ని ఒక కిలో నువ్వులనూనె పోసి నూరించాడు. ఆ పిడికెడు చెక్క ఒక కిలో నువ్వుల నూనెను మొత్తం పీల్చేసి చివరకు పొడిగానే మిగిలింది. ఆపొడిని ఆకు పై చల్లి ఆకును తొడకంటించి కట్టుకట్టాడు. 'అయ్యా! మంగలింటిగోరుగాలుతో ఆ లోపలుండే దాన్ని తీసెయ్యయ్యా' అన్నారు శ్రీస్వామివారు. ఒక పెద్దపళ్ళెం నిండా నీరు పోయించి కాలు దగ్గర పెట్టించి, గోఱుగాలుతో గాటుపెట్టి తన మొండి చెయ్యి తొడపై పెట్టి అలానొక్కాడు. తొమ్మిదంగుళాల పొడవు బొటిన వేలిలావు గల నల్లని, ఒక కండవంటిది, బొళక్కిన పళ్ళెంలోని నీళ్ళలోపడి గిర్రునతిరిగింది. 'అయ్యా గొడ్ల, పిల్లా తిరగని తావులో గుంట త్రవ్వి అందులోవేసి తగులబెట్టి పూడ్చేయండి. పశువులు దాన్ని త్రొక్కితే వాటికికూడా ఆజబ్బువసు ంది' అని ఆజ్ఞాపించారు. శ్రీస్వామివారు. రణవైద్యునితో 'అయ్యా ఎర్రమందు ద్రావకం చేసి, నోటితో తీసికొని, పుక్కిలించి ఆగాయం మీద ఉమ్ము, మానిపోతుం 'దన్నారు శ్రీస్వామివారు. అలాగా చేయగా క్రమంగా గాయం మానిపోయింది. కురుపు నయమైంది కేవలం శ్రీస్వామి వారికృపవలన మాత్రమే. కానీ రణవైద్యుడు ఒక పరికరంగా ఉపయోగపడ్డాదు. గనక ఒక వందరూపాయలు, ముప్పై కిలోల జొన్నలు క్రొత్తబట్టలు ఇచ్చి సత్కరించాను. అనాధ రక్షకుడైన శ్రీస్వామివారు , నాహృదయపూర్వకవందనములు తప్పమరేమి స్వీకరించరు గదా!

## మిద్దె కట్టించడం

ఆరోజులలో నేను కూలిచేసుకొని ఆపూట కాపూట వెళ్లబుచ్చుతున్నాను. నాకున్న కొద్దిపాటి మెట్టపొలం సరిగా పండదు. ఎద్దులు ఉన్నాయిగాని బండి కొనేశక్తి లేక కొనలేదు. శ్రీస్వామివారిని దర్శించినది మొదలు నాలో తెలియని ఆనందం తొణికిసలాడుతుండేది. ఎంతో హుషారుగా హాయిగా ఉండేది. నిరంతరం



వారిసేవలో, సాన్నిధ్యంలో ఉండాలని ఉబలాటపడే వాణ్ణి. కానీ శ్రీస్వామివారు నన్ను గృహస్తుగానే ఉండాలని నిర్బందించారు. ఒక్కొక్కప్పుడు వర్షాల్లో పదిఇరవైరోజులు మా పశువుల కొట్టంలో గుండం వేసుకుంటూ ఈ పేదవాని జొన్నసంగటి ముద్ద తినేవారు. అర్ధరాత్రిపూట అంతుచెప్పకుండా వెళ్ళిపోయి తిరిగి మధ్యహ్నాం సన్నెండు గంటలకు వచ్చేవారు. వర్షాకాలం కట్టెలు దొరకనందున నా ఇంటిలో ఒక అంకణం వరకు పై కప్పువాసాలు పెరికి శ్రీస్వామివారి అగ్నిగుండానికి సమర్పించాను. ఇక ఆ ఇంటిలో ఉండే వీలులేక ప్రక్కనపూరిపాక వేసుకొని అందులో కాపురముండే వాణ్ణి.

ఒకరోజు శ్రీస్వామి వారు 'అయ్యారేపు వేకువన మంచి లగ్గనం వస్తుంది. అన్ని పాలు బియ్యం సంపాదించుకో ఇంటికి లగ్గనం చేస్తాను. మిద్దె ఇల్లుకట్టుకుందువు' అని శెలవిచ్చారు. కూలిచేసుకున్నాపూట గడవని నాకు మిద్దెందుకు స్వామీ. ఇట్లాటిపనులు చేస్తే గ్రామస్తులంతా హేళనచేస్తారు. వద్దులేస్వామీ' అన్నాను. 'అబ్బోలగ్గనం మొలచి వస్తుంటే, ఆలోకంలో వాళ్ళు ఎదురుచూస్తుంటే ఆరణాలు నీవు పెట్టుకుంటే మిగిలినదంతా వాళ్ళే పెట్టుకొని కట్టిస్తామని అంటుంటే వద్దంటే ఎట్లాగయ్యా. అదంతా నీకెందుకు ఉగ్గిన్నెడు పాలు, అన్ని బియ్యం సంపాదించిపెట్టయ్యా చాలు' అని అన్నారు. ఆరాత్రికి వారు మా ఆవరణంలో ఒకచోట ఒక చిన్నగుంటత్రవ్వి ఆగుంట దగ్గరే పడుకొన్నారు. వేకువ జామున నన్ను తట్టిలేపి.నీకు నిద్రపట్టిందాయ్యా, ఆ వైపున, లగ్గనం లేచివస్తుంటే? నీవు నిద్రపోతే ఎట్లా. లెయ్ నిద్రలేచి ఆపాలు బియ్యం తీసుకురాపో 'అని తొందరించారు. వాటిని నేను తెచ్చిస్తే వాటినా'గుంటలో పోసి మట్టికప్పి 'అబ్బో, ఐదుగుర్రాల స్పీడులో ఆలగ్గనం పెంచలకోనచేరిందయ్యో. అబ్బో ఇక నీ పని అయిపోయింది. నువ్వు ఇంటికి గోడకాలు త్రవ్వించయ్యా' అన్నారు. నేను గోడకాలు త్రవ్వి డబ్బులేక కట్టుబడి పని మొదలు పెట్టలేదు. కొంతకాలానికి శ్రీ స్వామివారు వచ్చి చూచి' ఏందయ్యో రాయి రప్పవేసి గోడకాలు కట్టించకుండా ఆమాయస్నె కూర్చుంటే ఎట్లా'? అన్నారు. కూలీలకిచ్చేందు నా దగ్గర చిల్లి గవ్వలేదు స్వామి! రాయి తోలేందుకు ఎద్దులున్నాయి గాని నాకుబండిలేదు. నేనే మీ చేయలేను

స్వామీ, అన్నాను. 'అబ్బో ఉత్తరాన్నుంచి పైవాళ్ళు పంపిన మనిషివచ్చికట్టుబడి చేస్తుంటే నీవేందయ్యా! ఎవరినడిగితే బండివ్వరు? ఏందయ్యానువ్వు' అని మాట్లాడుతుండగానే ఒక గ్రామస్తుడొచ్చి విషయం తెలుసుకొని తనబండి ఉపయోగించుకొనమని చెప్పాడు.

అంతలోనే ఒకబేలుదారి ఒక ఎద్దును కొనుక్కొని తోలుకపోతూ దాని మేపుకొరకు ఒక చొప్పకట్టఅడిగేందుకు వచ్చాడు. నేనిచ్చిన మేపు ఎద్దుకు వేసి వచ్చాడు. అతనిని శ్రీస్వామివారు ఏ విధంగా ప్రేరేపంచారోగాని నేనేమి చెప్పుకోకుండా అతనే నాపరిస్థితి అంతా అడిగి తెలుసుకొని తాను ఎద్దును ఇంటిదగ్గర తోలి తెల్లవారి వచ్చి పైసాకూలి లేకుండా పునాదులు కట్టి వెళ్ళాడు.

ఆ తర్వాత మరలా శ్రీస్వామివారు వచ్చేంతవరకు ఇంటి కట్టుబడ పని అనుకోలేదు. శ్రీస్వామివారు వచ్చి "అయ్యా అంత మట్టి పిసికి బిళ్ళలు చేసి కరిపించకూడదా" అన్నారు. నాదగ్గరకూలీలకు పైసాలేదు. ఏమిచేయాలో నాకేమీ అర్థం కాలేదు స్వామీ' అని విన్నవించాను. "అయ్యా నువ్వు పనిచేస్తుండు అదే జరిగి పోతుందని అభయమిచ్చాతు" ఒకరిద్దరు కూలీలతో నేనే ఇటుకకోసి సూలవేశికాల్చాను. తోలేందుకు బండి లేక అలాగే ఉండిపోయింది.

కొన్నాళ్ళకు శ్రీస్వామివారు వచ్చి ఏందయ్యా బండి లేదని అట్లాగే కూర్చున్నావు. అట్లా ఊర్లోకి పోయి అడిగితే ఎవరివ్వరు'. అని చెప్పేలోపల మాగ్రామస్తుడొకరు వచ్చి విషయం తెలుసుకొని తనే గ్రామంలోకి వెళ్ళి స్వామివారు చెప్పారని చెప్పి పదిబండ్లు కట్టించి ఇటుకంతా సాయంకాలానికి పైసాఖర్చులేకుండా తోలిచ్చాడు.

తెల్లవారి చెంచయ్య శెట్టిగారు వచ్చి పునాదులు కట్టి, పనినిలిపేసిన కారణం అడిగాడు. 'నా ఆర్థిక పరిస్థితే'నని వివరించాను. 'మీనాయన నాకొకప్పుడు గొప్ప సహాయం చేశాడు. నీవు నాకు డబ్బు ఇవ్వనవసరం లేదు. రేపొచ్చి రెండుపుట్లు తెల్లసున్నం తోలుకొచ్చుకొని గోడలు కట్టుకో' మని చెప్పారు. అట్లాగే తెచ్చి గానుగాడించి సున్నం రడీచేశాను.



మరలా శ్రీస్వామివారు మా ఇంటికొచ్చి 'అయ్యా నీవు రేపు చీకటితో లేచి పొదలకూరు మీదుగా పోతుండు నీకు కర్రలు, తాపులు తీసుకొని బేలుదార్లు ఎదురౌతారు. వాళ్ళు వచ్చి గోడలు కడుతారు. రేపే బయలుదేరి పొమ్మ'న్నారు. శ్రీస్వామివారు చెప్పినట్లే బేలుదార్లు ఎదురుపడి నన్ను పలుకరించారు. మాటలసందర్భంలో ఈ విధంగా వెంకయ్య స్వామివారు ఇల్లు కట్టమని నన్ను తిప్పలు పెడుతున్నారు అని చెప్పాను 'ఓరేయ్ ఎన్నాళ్ళనుంచో స్వామిని చూడాలనుకుంటున్నాను. ముందు స్వామిని చూచి, వీళ్ళపనిచేసి వద్దామురా' అని చెప్పుకొని నాతోటి మాగ్రామం వచ్చి పదిరోజులలో గోడల పని పూర్తిచేసి వెళ్ళిపోయారు.

చాలా రోజులువరకు స్వామివారు తిరిగి నాఇంటికిరాలేదు. కప్పువేయకుండా అట్లా మొండి గోడలుండకూడదు. తాటాకైనా కప్పమంటున్నారు అందరూ. శ్రీస్వామివారు గొలగమూడిలో ఉంటే, నా ఆర్థిక పరిస్థితివివరించి పూరికప్పు వేస్తానన్నాను. 'అబ్బో పైవాళ్ళు పైకం తెస్తుళ్ళా! ఏందయ్యా నువ్వో. ఓ చలమానాయుడా నాలుగు పేలికలిట్లాతే' అని చెప్పి ఆయన తెచ్చిన కాగితాలపై జడ్జీకి ఒకటి, కలెక్టరుకు ఒకటి, మాష్టాలదేవుడికొకటి పెద్దాయనకొకటి అర్జీలు వ్రాయించి ఆ నాలుగు కాగితాలు నేలపై బెట్టి తన అరచేతితో అదిమిపెట్టి రెండు నిమిషాల తర్వాత వాటినితన అరచేతుల నడుమపెట్టి నలిపి ఉండలు చేసి ఆకాశంవైపు వెదజల్లి 'షు-పో' అని చేతులు దులుపుకున్నారు. ఇంకనీవు చక్కా వచ్చిన తోవన్నేపో. జడ్జీ డబ్బు తీసుకొస్తున్నాడు. అని సెలవిచ్చాడు. తులసమ్మ నన్ను అన్నంతిని పొమ్మన్నది. 'అబ్బో మంచినీళ్ళయినా ఇచ్చేవు జాగ్రత్త ఆయన ఏమీ తీసుకోకుండా వచ్చిన తోవన్నే పోవలమ్మో' అన్నారు. నేను కాలికొద్దీ వెనక్కు తిరిగి మా గ్రామం వెళ్ళిపోయాను.

నేను ఇల్లుచేరేసరికి నాకు తెలిసిన కంసాలిబత్తుడు వచ్చి మా ఇంట్లో కూర్చొని ఉన్నాడు. మొండిగోడలు పెట్టుకొని కూర్చున్నావేమి. ఒకవెయ్యి రూపాయలు సంపాదించు మీచేలో తాటి మాన్లు కొట్టి, పెంకు కప్పేస్తాను. అని చెపుతున్నాడు.

ఇంతలోనే మా గ్రామస్తుడైన మాలెపాటి ఓబులురెడ్డి అక్కడకు వచ్చి 'ఏమిదొరామొండిగోడలు పెట్టి కూర్చున్నావే? అని అడిగి నా ఇబ్బందులు చెప్పాను. వెంటనే తన జేబులోని వెయ్యిరూపాయలు తీసి నాచేతిలోపెట్టి వెంటనే పెంకుకప్పేయ్' మని చెప్పివెళ్ళాడు.

పెంకు కొనేందుకు నేను ఆకంసాలిబత్తుడు కాలినడకన గూడూరుపోతూ చవటపాళెంలో పంచినీళ్ళు త్రాగాలని రంగపనాయుని ఇంటికి వెళ్ళాము. ఆయన మా ప్రయాణగురిచి విని 'అబ్బే పెంకువేస్తే కోతులు గుల్లగుల్ల చేసేస్తాయి. స్లాబే వేయించు' అని ఆగ్రామంలోని బేలుదార్లను పిలిపించి 'ఐదంకణాల ఇంటిని స్లాబువేస్తే ఎంతఖర్చు పెంకుకప్పితే ఎంతఖర్చు అవుతుంది గోడలు పెట్టి ఉన్నారు'. అని అడిగాడు. పెంకు వెయ్యాలంటే వెయ్యి స్లాబైతే పన్నెండు వందలు అవుతుంది 400 కమ్మి 400 రూ॥ సిమెంటు 400 రూ॥ కూలీలు అని వివరం చెప్పాడు. 'ఓస్ ఇంతేనా ఆరెండు వందలు నేను ఇస్తాను స్లాబే వేయించుకోవయ్యా' అని నేనెవరో తెలియకున్నాగానీ ఆయన వెంటనే రెండు వందల రూపాయలు నాచేతిలో పెట్టేశారు' గూడూరులో కమ్మికొంటే నాలుగువందలకు బదులు ఏడువందలరూ॥ అయింది. ఇంటికివచ్చి కంకరకోసం విచారిస్తుంటే మాగ్రామస్తుడొక హరిజనుడు కంట్రాక్టుకు కంకర కొట్టిస్తున్నాడు. ఇరవైమైళ్ళదూరంలోని ఆమంచర్లనుండి కంకరతోలనక్కలేదు. అని మా గ్రామంలోని చాకలింద్ల ప్రక్కనున్న బండలు చూపించి వీటిని కొట్టిస్తే బ్రహ్మాండమైన కంకరవుతుందని చెప్పి అతనే కంట్రాక్టుకు బండి 9 రూ॥ చొప్పున కొట్టేందుకు పనివాళ్ళను మాట్లాడికుదిర్చాడు.

ఆమరుసటిరోజు గ్రిద్దలూరు నుండి ఒక కంట్రాక్టరు వచ్చి తాను చెరువు పనిచేయిస్తున్నానని కొంతసిమెంటు బ్లాకులో అమ్ముకోవాలని కావాలంటే సిమెంటు ఇంటికి చేరుస్తానని చెప్పి బస్తా తొమ్మిది రూపాయల లెక్కన తొంబై బస్తాలు ఇంటికి చేర్చాడు. పొదలకూరు చెట్ల శేషయ్య బేలుదార్లను తీసుకవచ్చి కొంతపైకం కూడా తానే పెట్టిదగ్గరుండి స్లాబుపోయించాడు. ఓరేయ్, స్వామివారు



వెంకట్రామిరెడ్డికి రాత్రికి రాత్రి మిద్దె కట్టించాడురా అని ఊరంతా ఒకటే పొక్కిపోయారు. నాకంటే ఎంతో ధనికులంతా పూరింట్లో ఉంటే ఈ దరిద్రునికి మహల్ కట్టించారు. శ్రీస్వామివారు మా గ్రామంలో నాదే మొదటి మిద్దె. అంతా స్వామిదయ. ఇందులో నా ప్రశక్తి అవగింజాత కూడా లేదు.

## నిమ్మతోట వేయించడం

ఆరోజులలో నేను కడుబీరువాడను. మిద్దె ఇల్లు కట్టుకునే స్థోమతలేదు. కానీ శ్రీస్వామివారు నన్ను బలవంతం పెట్టి మిద్దె ఇంటికి వారే స్వయంగా శంకుస్థాపన చేశారు. వారి బలవంతం మీద పునాదుల వరకు కట్టి డబ్బులేనందున పని ఆపియున్నాను. అలాంటి కష్టసమయంలో ఒకనాటి ఉదయం శ్రీస్వామివారు చేలోకి పోవాలి రమ్మని నన్ను ప్రయాణంచేశారు. ఎందుకు స్వామీ? అంటే నిమ్మవనం వెయ్యాల బయలుదేరయ్యా అని తొందర చేశారు. మిద్దె ఇల్లు ప్రారంభించి ఇలా తెల్లారిందిగదా ఇక నిమ్మవన మెందుకు స్వామీ అంటే వినకుండా బయిలుదేరారు. మా చేనువారేనాడు చూచియుండలేదు. కానీ వారే ముందునడుస్తూ నేరుగా మా పొలంలో కెళ్ళి ఒకచోట కూర్చొని చాలసేపు నాదం మీటారు. 'అయ్యా ఇక్కడ మూడు బండరాళ్ళుతెచ్చి పెట్టు అన్నారు. నేనలాగె తెచ్చి, వారు గుర్తుపెట్టిన తావులో ఉంచాను. అయ్యా! ఇక్కడ బావి త్రవ్వి నిమ్మచెట్లు గుచ్చి పెట్టు అంతా బాగుంటుందని శెలవిచ్చారు. వారిమాట కాదనలేక అక్కడున్న తెల్లతుమ్మ చెట్లన్నీ కొట్టి శుభ్రంచేశాను. పగలంతా మిద్దెపని రాత్రిపూట నిమ్మచెట్లకు గుంటలు త్రవ్వడం, ఇలానేనొక్కడనే శ్రమచేసి వందచెట్లు నాటాను. ఆరోజుల్లో మనిషికిఒక్క రూపాయపావలా కూలి. ఒక కూలివానిని పెట్టి నాలుగునిలువులు (24అడుగులు) బావిత్రవ్వాను కొద్దిగా నీరు పడ్డాయి కానీ పెద్దజలలేదు. మరుసటి సంవత్సరం మరి పన్నెండడుగులు లోతు త్రవ్వినా ఊట పెరగలేదు. బావిలోనుండి నీరు మోసుకొచ్చి చెట్లకు పోసి బ్రతికిస్తున్నాను. ఇంకొక సంత్సరం గడచినా. నా ఆర్థికపరిస్థితి మారలేదు బావిలోతు చేయనుగాని, ఇంజను కొనుటకుగానీ శక్తిలేదు. ఒక స్నేహితుడు అయిలింజను అప్పు ఇప్పించినా పైపులు కొనేందుకు డబ్బులేక ఒక సంవత్సరం

ఆ ఇంజను మూలపెట్టుకొని కూర్చున్నాను. శ్రీవారి కృపవలన, మా గ్రామస్తులు ఇంజను సామాను అమ్ముతుంటే అప్పుకు తెచ్చుకున్నాను. ఈ కష్టకాలంలో, పూర్వం నేను ఒకరిదగ్గర రెండు వేలు అప్పుతెస్తే, అది వడ్డీ మొదలు ఆరువేలయింది. ఆ ఆసామి పైకం కట్టమన్నందున నాకున్న గొఱ్ఱెలమ్మికట్టేశాను. మరొక చోట ఇంకా ఐదువేలు అప్పుఉన్నాను. ఈ ఐదువేలకు పదిహేను వేలు కట్టవలసి వస్తుంది గదా ఎక్కడ తెచ్చికట్టాలి. ఇంతశ్రమపడి పెంచిన నిమ్మతోట ఈ అప్పులోళ్ళకు పోతుంది గదా? ఎట్లాగా అని ఒకటే దిగులుయాతనైంది. ఒకరోజు శ్రీస్వామివారు తోటలోకి వచ్చారు. నాకడుపులోని బాధంతా వెళ్ళగక్కేను. ఏమిస్వామీనా నేరము? నన్నెందుకిలా కాలరాసి నీళ్ళముంచారు? పదిహేనువేలు అప్పు పడ్డాను. దీన్ని తీర్చేదెలా? నాకెందుకింత కష్టం వడిగట్టారు. అని బాధపడ్డాను. 'అయ్యో అప్పుపడ్డావా? తీరిపోతుందిలేయ్యా, చెట్లుకాపుకొస్తాయిలేయ్యా' అని ఓదార్పు మాటలు చెప్పి వెళ్ళారు. ఆమహనీయుడు తన యోగశక్తితో ఏమిచేశారో ఏమో తెలియదు. ఒక నెలరోజుల్లో ఆకు ఆకుకూగుత్తులు గుత్తులుగా పిందెలు దిగియున్నాయి. ఏవిధంగా యోచించినా మామూలుగా అయితే తొలిసంవత్సరం బెట్టుకు పదికాయలుకాయాలిగాని అంతకాపుదిగే ప్రశ్నేలేదు. వెంటనే నెల్లూరు వెళ్ళిఋ నాస్నేహితుని నిమ్మకాయల కొట్టులో మట్లాడుకొని నిమ్మకాయలు వారికివేస్తానని మూడు మార్లు మూడు ఐదువేల చొప్పున తెచ్చి అప్పు తీర్చేశాను. ఐదువేలకు పదిహేను వేలు చెల్లించానని ఓబుల్‌రెడ్డిగారు నాకు బహుమతిగాపది హేనువందలు తిరిగి నాచేతిలో పెట్టేశాడు. ఈ నాటికీ వారు నాకెంతకావాలన్నా అప్పిస్తున్నారు.

ప్రస్తుతం నాతోటి తోటలు వేసినవారు చెట్లు ముదిరి కాపుకాయడం లేదని కొట్టి బొగ్గుచేశారు. కానీ శ్రీవారికృపవలన నేటికీ నాకాచెట్లే జీవనాధారమయ్యాయి. ఎప్పుడైనా వీటిని కొట్టి వేయాలని వీటి ప్రక్కనే మరొక వందచెట్లువేసి పెంచుతున్నాను. నాకుమారుడు ఆయిలింజన్లు రిపేరు చేయడంలో సిద్ధహస్తుడు. అది శ్రీవారికృప గ్రామస్తులంతా ఎంతో గౌరవంగా చూస్తారు. లక్షాదికారులము



కాకున్నా శ్రీవారి దయవలన లక్షాదికారులకంటే ఎక్కువగానే గౌరవమర్యాదలతో జీవిస్తున్నాము. ఇంతకంటే నాకేమికావాలి.

## అన్ని జీవుల్లో నిశ్రీస్వామివారు :

పెన్నబద్వేలు దగ్గర అంకాళమ్మ బోటుదగ్గర శ్రీస్వామివారున్నారు. ఒకరోజు అర్ధరాత్రివేళ నన్ను నిద్రలేపి 'అయ్యా చెలమానాయుడింటికి వెళ్ళి ఆఎద్దుల కంత గడ్డివేయమని చెప్పిరాయ్యా' అని ఆజ్ఞాపించారు. నేనా అర్ధరాత్రివేళ గురువాజ్ఞ మీరరాదని వెళ్ళి చలమానాయుణ్ణి నిద్రలేపి ఆసంగతిచెపితే ఆయన నిద్రలేచి తూగుకళ్ళతో మంచం దిగకుండానే 'స్వామి చెప్పాడూ? ఆయనకేమీపనిలేదు. ఏదోఒకటి చెపుతుంటాడు. నీవే నాలుగుగడ్డిపోగులు ఆ ఎద్దులముందు వేసిపో' అని చెప్పి తిరిగి నిద్రకు పక్రమించాడు. నేనే కొంచెగడ్డి తెచ్చేస్తే ఆమూగజీవులెంత ఆకలై ఉండెనో ఏమోగానీ ఆగడ్డంత ఒక్క నిమిషములో ఆవురావురుమంటూ తినేశాయి. నేను శ్రీవారిదగ్గరకొచ్చి జరిగింది చెప్పాను. మంచి పనిచేశావయ్యా. అంతేలే అని సంతోషించారు. ఎద్దుల ఆకలి తీరితే శ్రీస్వామి వారి ఆకలి తీరినట్లే. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడన్న మాట నిజమని నిరూపించారు.

ఒకరోజు చావుబ్రతుకుల్లోనున్న మానిండు సూడి బఱ్ఱెకుచేసే వైద్యాలేవీ ఉపకరించలేదు. శ్రీస్వామివారు దానిచూట్టూ కఱ్ఱతో ఒకగీతగీచి అయ్యో, రేపీవరకు ఈమె ఈలోకంవదలి పైలోకాలకు పోతుంది నీవేమీ బాధపడవద్దు. అక్కడకు చేరడం ఈమెకెంతో మేలు ఆలోకంలో వాళ్ళకేమి చాలా పాలిస్తుళ్ళా' అన్నారు. వారు చెప్పినట్లే ఆబఱ్ఱెమరణించింది. దానిని మాదిగ వాళ్ళకిచ్చి కోతపెట్టించవద్దని పూడ్చమని చెప్పారు వేమలాగేచేశాము. ఆజీవిఎంతటిధన్యురాలో!

## అక్కిం చెప్పిన అబద్ధం :

ఒకప్పుడు శ్రీస్వామివారికి కుడిభుజము ముంజేయి కాలి భయంకరంగా

బొబ్బలు వచ్చాయి. శ్రీస్వామివారిని బలవంతాన భక్తులు కలువాయి డాక్టరు దగ్గర ఆస్పత్రిలో ఉంచి కట్టుకట్టి ఇంజక్షన్లు వేయిస్తున్నారు. 'స్వామీ! మీకు చెయ్యేందు కాలింది? మాకు చెప్పకూడదా స్వామీ!' అని వినయంగా అర్జించాడు అ॥వెం॥ రెడ్డి ''కుల్లూరు రాజుపాళెంలో ఈడిగ సుబ్బమ్మ ఇంట్లో రెండు నగుళ్ళు లేచాయి, ముదిగేడు గ్రామదేవత ముదిగేడమ్మ దేవళంలో మూడు నగుళ్ళు లేచాయి, గొలగమూడి ఆంజనేయస్వామి దేవస్థానానాకి, పుట్టస్వామి దేవస్థానానికి, మధ్య మూడు నగుళ్ళు లేచాయి, ఆనగుళ్ళు మా కివ్వమని ఆలోకం వాళ్ళు తొమ్మిది మంది వచ్చారు. ఆనగుళ్ళు వాళ్ళకిస్తేత మనకు ఆస్తిఎట్లాగా అని నేను ఇవ్వనన్నాను. అందుకని ఆతొమ్మిది మంది నన్ను పట్టుకొని కట్టేసి బలవంతం చేసి అగ్ని ద్రావకం పోసిపోయారయ్యా. వెంకటేశ్వర్లు కొడుకు, చిన వెంకటయ్య అదిచూచాడు. ఆ తొమ్మిది మందిని పట్టుకొని నెల్లూరు రంగనాయకులు స్వామికివప్పచెప్పాడు. నెల్లూరు రంగనాయకులస్వామి ఆ తొమ్మిది మందిని జైల్లో పెట్టి కేసు పెట్టారు. రేపు విచారణ 'అయ్యా! ఈ కలువాయి డాక్టరు, సాదయ్యను (నన్ను) తీసుకవచ్చి ఇక్కడపెట్టి కట్టుకడుతున్నాడు. రేపుసాదయ్య నెల్లూరుకు వాయిదాకు పోయ్యే దెట్లాగయ్యా? అయ్యా! నీవు పోయి డాక్టరుగారినడిగి అంతకాగితం రాయించుకురాయ్యా అయ్యో! అక్కడ అంతా అబద్ధం చెప్పాలయ్యో' అన్నారు. అందుకు నేను 'స్వామీ! వాళ్ళను నేనేమి మోసం చేయాలో చెప్పండి స్వామీ! అన్నాను.

'పిచ్చెంకయ్యనాకు ఇల్లు కట్టించాడు, రేపు పొద్దున గృహప్రవేశం. ఇండ్లల్లోకి పోవాలి. కొంచెం స్వామివారిని పంపించండి. రేపు మరలా తీసుక వచ్చి వదలి పెడుతాను' అని అడగమన్నారు. నేనడిగేసరికి డాక్టరుగారు చాలా కోపంగా 'ఆయన వళ్ళంతా కాలి బాధలో ఉంటే, మేము మందేసి మానునుపుతుంటే ఎక్కదెక్కడి ముండా కొడుకులొచ్చి పంపించండి. పంపించండి. అని ఒకటేగోల అయింది అని అరుస్తూ నాచెంపనొక దెచ్చేశాడు. కానీ నేనేమీ నొచ్చుకోకుండా మొండికిపడికూర్చున్నాను. తిరిగి కొంతసేపయ్యాక మరలావెళ్ళి బ్రతిమాలాను.



డాక్టరుగారు మెత్తబడి నర్సుచేత కట్టుకట్టించి శ్రీస్వామివారినిపంపిస్తూ'రేపు సాయంకాలానికి తీసుకరాకుంటే నిన్ను పదహారు కమ్ముల్లో పెట్టిస్తా, తెలిసిందా? అని పంపేశారు.

తెల్లవారి ఉదయాన్నే ఐదుగంటల బస్సు ఎక్కాలి ఆ బస్సు వాళ్ళు నిలపరను కున్నారో ఏమో శ్రీస్వామివారు 'అయ్యా నివ్వు రోడ్డుకడ్డంగా పడుకో. బస్సు నిలుస్తుంది. ఎక్కి పోదాము అన్నారు. శ్రీస్వామివారికి నమస్కరించి నేనలాగే పడుకున్నాను. బస్సు వచ్చి నిలిచిపోయింది. కండక్టరు వచ్చి నన్నుచీవాట్లు పెట్టాడు. బస్సెక్కి నెల్లూరులో దిగాము.

బస్సుదిగి స్వామివారు 'అయ్యో నీవు నిప్పేసుకొని ఇంటిదగ్గర కూర్చొనుండు నేను కోర్టువాయిద చూచుకొని మూడవనాడు వస్తాను అన్నారు. నేనలాగే చేశాను. మూడవనాడు శ్రీస్వామివారు వచ్చి నేను గుండమేసుకొని కూర్చొని ఉండడం చూచి 'భేష్, భలే' అంటూ గుండం దగ్గర కూర్చున్నారు. కేసేమయింది స్వామీ అంటే. కేసు మన పక్షమయింఇ. వాళ్ళకు ఆరునెలలు జైలు శిక్షవేశారు. అని చెప్పారు.

ఇక కలువాయికి పోకుండా పొదలకూరు నుండి కాంపౌండరును పిలిపించి కట్టుకట్టిస్తుంటే ఆకట్టు ఉంచకుండా పీకేస్తున్నారు స్వామీ. చివరకు మానేదేట్లాస్వామీ అని అడిగితే 'కుక్క పురె మందు పుయ్యమ్మా, పోతుంది' అన్నారు. అంటే ఏమిటి స్వామి అంటే ఆచెట్టాకు, ఆచెట్టాకు తెచ్చి నలిపి పెంకులో రసంపిండి వేలుతో పూయమన్నారు. దొండాకు, కుక్కతొళిసాకులాంటి వాటిరసం పిండి పూస్తే మాడవనాటికి మాడిపోయింది. అదే ఆకు పసరు మాగ్రామస్తులొకరికి పూస్తే నయమేకాలేదు. స్వామివారి కురుపు మానింది వారి వాక్కు ప్రభావంవలనగాని మన ప్రజ్ఞ, ఆకు మహిమకాదు. ఆవిధంగా నాచేత అబద్ధమాడించి తన అద్భుతలీలను ప్రదర్శించారు శ్రీస్వామివారు.

## నాకొమారుని వివాహం :

శ్రీస్వామివారు మా ఇంట్లో ఉండేటప్పుడు అనికేపల్లి శివకొటారెడ్డిగారు నాకొమారునికి పిల్లనిస్తాననివచ్చాడు. శ్రీస్వామివారినడగమన్నాను. వారినడిగితే 'డబ్బెంత ఇస్తావేమిటి? అన్నారు. స్వామినాకు యాభై ఎకరాల పొలం బంగారం వగైరా ఉన్నాయి నాకు ఒక మగబిడ్డ ఒక ఆడపిల్ల చెరిసగం వ్రాసిస్తాను అన్నాడు. అది ఎన్నాళ్ళొస్తుందయ్యా. అది అయిపోతే ఎట్లాగయ్యా?' 'ఎట్లా అయిపోతుంది స్వామీ రాను రాను పెరిగేదే గదా'. అన్నాడు. 'ఓయబ్బొ పిల్లకాయలు కలిగితే హైదరాబాద్ లో చదవాలంటే అక్కడికి డబ్బు పొంపాల, మద్రాసులో చదవాలంటే అక్కడకు డబ్బు పంపాల ఇంకెక్కడన్నా చదవాలంటే అక్కడకు పంపొద్దా? అదేమిచాలుతుంది, అన్నారు. 'ఇంకా కావాలన్నా సంపాదించి ఇస్తానుస్వామీ' అన్నాడు'. అబ్బొ పసుపు కుంకుమ నిలవదయ్యో' అన్నారు. ఆ మాటతోటి ఆయనవెళ్ళిపోయాడు.

ఆ తర్వాతొకనాడు ఇంపెర్లపాటినుండి మరొక సంబంధం వచ్చింది అప్పుడు కూడా స్వామివారు ఆయన్నుదుడ్డెంత ఇస్తావయ్యా అని అడిగారు. ఎంతైనా ఇస్తాను స్వామీ అన్నాడు. అంటే మానికతో కొలిచి ఇస్తావా లేక బండి జల్లతో తిరగదోడ్తావా ఎట్లా ఇస్తావు ఎంత ఇస్తావయ్యా అన్నారు. మీరెట్లా కోరితే అట్లా ఇస్తానన్నాడు. అబ్బొ, సంతానం లేదే ఇక ఎందుకీ పెండ్లి అన్నారు అంతటితో వారు వెళ్ళిపోయారు.

కొన్నాళ్ళకు బొగ్గలోళ్ళ కండ్రిగ నుండి వచ్చారు. ఈ అమ్మాయిని నేను ఇదివరకు చూచి ఉన్నాను. మా అబ్బాయికి ఈమెకు ఈడుజోడు బాగుండదు. కానీ నేను స్వామివారి నడగమన్నాను. స్వామివారు వీరినికూడా కట్నమెంత ఇస్తావని అడిగారు. వాళ్ళు మేము పేదవాళ్ళము స్వామీ ఏమీ ఇవ్వలేము అన్నారు. ఏమీ ఇవ్వకుంటే ఎవరు చేసుకుంటారు. ఏదో ఒకటివ్వొద్దా అన్నారు. మాదగ్గరేమీ లేదు స్వామీ అన్నారు. అట్లయితే ముహూర్తం పెట్టించండి అన్నారు. అప్పుడు నేను కలుగజేసుకొని స్వామీ అబ్బాయికి ఈడూజోడు బాగుండదు. ఈ



సంబంధం వద్దు స్వామీ అన్నాను. అబ్బొ బంగారానికి ఎలిగారం అంటుకున్నట్లు వాళ్ళిద్దరూ కతక్కున అతుక్కుపోతుండ్లా ఇద్దరు మొగసలపలు? ముగ్గురు ఆడసలపలను వదిలియున్నారు. అన్నీబాగుంటాయి. అయ్యో మీరింటికిపోయి జొన్నసంగటిచేసి ఒకముద్ద సొకలోళ్ళకు ఒకముద్ద మంగలోళ్ళకు వేసి అమ్మాయినితీసుకొని రాపొండి. అన్నీ బాగా సరిపోతుంటే ఈయనకేమి తెలుసు. అని తన అంగీకారం తెలిపి పంపారు.

శ్రీస్వామివారు ఇష్టప్రకారం నాకొమారుని వివాహం చిల్లిగవ్వ కట్నంలేకుండా జరిపించాను. శ్రీస్వామివారు చెప్పినట్లే దంపతులు మనసులు కలసి హాయిగా, సుఖంగా ఉన్నారు. వారి ఆశీస్సుల ప్రకారం ముగ్గురు ఆడసంతానం ఇద్దరు మగసంతానం కలిగారు. స్వామివారిచ్చిన నిమ్మతోటే జీవనాధారమైంది.

'స్వామీ చిల్లిగవ్వ కట్నంలేకుండా పెండ్లిచేస్తిరే పిల్లా జల్లా కలిగితే వాళ్ళేమితినాలి' అని అడిగాను. ఓయబ్బో ఆ గొలగమూడి దగ్గర పద్నాలుగు గత్తాలనుండి మన డబ్బు రాసులు రాసులుగా పడిఉండ్లా, కావాలంటే ఒకరాసి తీసుకొచ్చుకుందువులే. అన్నారు. కానీ నాకు గొలగమూడిలోఆరాసులెక్కడ ఉన్నాయో కనిపించవుగదా! ఒకరోజు గొలగమూడిలో అర్ధరాత్రి శ్రీస్వామివారు ఎక్కడికో వెళుతుంటే చాటుమాటుగా వెంబడించాను. నాగలారం దగ్గర ఒకచోట తిరుగుతూ నన్నుచూచారు. ఈ గండు మిత్తవలు తిరిగే ఝాములో రావచ్చా! .పదోచూపు వదులుతున్నాను. అట్లాచూడు అన్నారు. అంతదూరాన, అయ్యా! బ్రహ్మాండమైన పద్నాలుగురాసులు బంగారు ఛాయతో దగద్దగాయమానంగా మెరిసిపోతూన్నాయి. ఎంతపెద్దరాశులోచెప్పలేను. ఒక ఐదు నిమిషాల తర్వాత అదృశ్యం ఉపసంహరించారు. వెంటనే నన్ను తిరిగి ఆశ్రమానికి పంపేశారు. ఆవిధంగా వారిధనాగారాన్ని నాకు దర్శింపజేశారు ఆకరుణామయుడు.

## నీటిగండం

అది వర్షాకాలం. కళ్ళేరుకు అవతలవడ్డుననున్న శిద్దలయ్య కొండకు వెళ్ళాలంటే

శ్రీస్వామివారిని రెండెద్దులబండిలో తీసుకవచ్చాను. మేము వచ్చేసరికి కళ్ళేరు గట్లు పొర్లి ప్రవహిస్తుంది. స్వామీ! బండిని ఏటిలోకి దించితే బండి ఎద్దులతో పాటు మనం కూడా ప్రవాహంలో కొట్టుకొని పోతాము' అని విన్నవించాను. శ్రీస్వామివారి కాళ్ళుపట్టుకపోయి నడువలేకున్నారు. 'అయ్యా! నన్ను నీమెడమీద కూర్చోబెట్టుకొని చిన్నంగా అవతలివడ్డుచేర్చయ్యా' అన్నారు. 'మునిగి పోతాముస్వామీ!' అంటే 'అదేమీ చెయ్యదు, నువ్వుపదయ్యా' అన్నారు. శ్రీస్వామివారిని అటొక్కాలు ఇటొక్కాలు వేసి నామెడమీదకూర్చోబెట్టుకొని నీళ్ళలోకి దిగాను. నేను రొమ్ములలోతు నీళ్ళలోకి పొయ్యాక శ్రీస్వామివారు నన్నాపి 'అయ్యా నీవు చిన్నంగా ఒక బుటకెయ్యి. సాదయ్యగారు నీళ్ళపైన్నే పోతుంటారు నీవు నావెంటనే వచ్చెయ్' మన్నారు. శ్రీస్వామివారి యోగశక్తి బాగుగా ఎరిగిన నేను మారు మాట్లాడకుండా నీటిలో మునిగానోలేదో స్వామివారు నీటిమీదనే బెండులాగా తేలినేరుగా అవతలిగట్టుచేరి అక్కడుండే చెట్లతీగలు పట్టుకొని నిలిచారు. నేను వారి దయవలన చిన్నగా ఈదుకుంటూ అవతలిగట్టుచేరాను. వారియోగశక్తి నాపైన లేకుంటే అలాంటి ప్రవాహంలో ఏటికడ్డంగా చక్కగా ఈది అవతలిగట్టు చేరలేము. శ్రీస్వామివారిని ఎత్తుకొని వెళ్ళి దేవాలయం వాకిటిముందుదించాను. 'పూజారిలేడు మందిరం తాళమేశారు స్వామీ' అంటే వేసేతాళం తీసేతాళం మన దగ్గరుండ్లా అయ్యా - చిన్న పుల్లతీసుకొని తాళం బుర్రను కలబెట్టు వస్తుందని శెలవిచ్చారు. ఆశ్చర్యం! నేనలాచేశానోలేదో వెంటనే అంతలావుతాళం బుర్ర ఊడి వచ్చేసింది.శ్రీస్వామివారు గర్భగుడి ముందు కూర్చొని ఒకగంటసేపు ఏదేదో మాట్లాడి అంతవరకు బయట కూర్చొని యున్న నాదగ్గర కొచ్చ పనిఅయిపోయింది ఇకపదయ్యా అని ప్రయాణమైనారు. వచ్చేటప్పుడు వెంకట్రామిరెడ్డి మెడమీద కూర్చొని నది దాటినట్లే శ్రీస్వామివారు నది దాటి, నది అవతల, వారు నిలిపివచ్చిన బండిలో ఇల్లుచేరారు. ఇలాంటి యోగశక్తులు వెంకట్రామిరెడ్డిగారు, వక్కెమ్మలాంటి ఆంతరంగిక భక్తులకు మాత్రమే చూపారు. తక్కిన వారందరికి ఈలాంటి లీలలు కథలు మాత్రమే అయ్యాయి.

## అహంకారపు అడ్డుపొర:

మా గ్రామంలో ఒక ఎద్దుకు జబ్బుచేసి పొట్ట ఉబ్బి మేతతినదు. కండ్లెర్రగా ఉండి చూపుపోయింది వైద్యాలన్నీ విఫలమై చివరకు శ్రీస్వామివారిని శరణుజొచ్చి విలపించాడు. శ్రీస్వామివారు తన సేవకుని పిలిచి 'అయ్యా నీవీ రాత్రి ఝాము కాని ఝాములో వెళ్ళి వీళ్ళెద్దుకు మంత్రించి రాయ్యా.. తెల్లవారేసరికి ఎద్దుకు బాగుంటుందని 'ఆజ్ఞాపించారు. కానీ శ్రీవారి శక్తి సామర్థ్యము లెరుగని ఆసేవకుడు 'స్వామీ ఇంగ్లీషు మందులకు నయంకానిది నామంత్రానికి తగ్గుతుందా? 'అని హాస్యమాడాడు. 'నీకెందుకు నీవు నేను చెప్పినట్లు చేసిరాయ్యా' అన్నారు. ఆసేవకుడలాగే చేశాడు. తెల్లవారేసరికి ఆఎద్దు లేచి మేత నీరు తీసుకోసాగింది. ఆగ్రామస్తులంతా తండోపతండోలుగా వచ్చి ఆ ఎద్దును చూచి శ్రీస్వామివారి మహిమ వేనోళ్ళకొనియాడారు.ఎద్దుకు చూపు పోయిందని, నేత్రదానం చేయమని ప్రాధేయపడ్డాడారైతు. 'అయ్యా రెండు తెల్ల, కనికి రాళ్ళు తీసుకొని రాతికిరాయి కొట్టు - మెత్తని కుంకుమవంటి పొడి రాలుతుంది. ఆపొది రెండుకళ్ళకు పట్టించు చూపొస్తుందని శెలవిచ్చారు. ఆరైతు అలాగే చేయగా ఆఎద్దు చక్కగా చూడగలిగింది.

ఆరైతు కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించి స్వామీ తమరు నాఎద్దుకు చేసిన మేలు ఈజన్మలో మరచిపోను. తమరేమిచేయమంటే అది చేస్తానని ప్రాధేయపడ్డాడు. ఆ ఎద్దుకు మంత్రించిన సేవకుని హృదయంలో ఎలాంటి కోరికలున్నాయో ఏమో శ్రీవారు 'అయ్యా ఒక జండా తెచ్చి మీ గ్రామంలోని రాములవారి దేవాలయంపై ఎగురవేసి తర్వాత ఒక బండికి మూడుగాళ్ళ ఎద్దులు కట్టి ఆబండిపై ఈ జండకట్టి ఆబండిపై ఈ మంత్రించిన ఆయన్ను కూర్యోబెట్టి ఊరంతా ఊరేగించయ్యా' అన్నారు. ఆరైతు అలాగేచేసి ఆసేవకుని అంతరంగంలోని కోరికి తీర్చాడు.

ఒకనాడొక ఆసామి భార్యా సమేతంగా వచ్చి 'స్వామీ ఆరుగురు బిడ్డలు పుట్టి చనిపోయారు. మా జీవితానికి వెలుగు ప్రసాదించమని విలపించారు. శ్రీస్వామివారు ఏకబిగిని మూడుగంటల సేపు నాదం మీటి, అయ్యా నీకు ఒక్క మగబిడ్డకల్గి

నిన్నుద్ధరిస్తాడులే' అని చెప్పారు. తన సేవకుని పిలచి అయ్యా నీవు వీళ్ళింటికెళ్ళి వీభూతి పండునలిపి నాలుగు మూలలచల్లి రాత్రంతా భజన చేయించి వచ్చెయ్' అన్నారు కాని, అహంకారి, అమాయకుడు, అయిన ఆసేవకుడు 'పుట్టినబిడ్డలందరూ చనిపోతుంటే ఇకనేనేమిచేసి లాభమేమిటి' అని శ్రీస్వామివారి మాటకు ఎదురు చెప్పాడు కానీ శ్రీవారి బలవంతంపై ఆసేవకుడు వెళ్ళి శ్రీస్వామివారు చెప్పినవన్నీ యధాతథంగా చేసివచ్చాడు. సంవత్సరము తిరగకుండానే ఆమెకు సంతానం కలిగింది.

ఆదంపతులొచ్చి శ్రీస్వామివారిని తమ గ్రామం విచ్చేసి తమ విందారగించమని ప్రాధేయపడ్డారు. ఎంతచెప్పినా వారు వినిపించుకోలేదు. చివరకు శ్రీవారు అయ్యా నాబదులు ఈయన్ను తీసుకపొండి అని వారింటికివెళ్ళి భజన చేయించిన స్వామివారి సేవకుని వెళ్ళిరమ్మని ఆజ్ఞాపించారు. ఆదంపతులాసేవకునికి బంగారు ఉంగరం, క్రొత్తగుడ్డలు, వాచి, మరొక చేతికి బంగారుచైన్ ఇచ్చి అతనిని సత్కరించారు.

ఆ సేవకుని కండ్లు తలకెక్కాయి "చూడు స్వామి, నాదెబ్బనేనెంత బంగారు సంపాదించానో నీవు సంపాదించిందేదో చూపించు" అని శ్రీవారిని హేళనచేశాడు. అందుకు స్వామివారు 'అంతేగదయ్యా దాంతో సరిపోయిండ్లా' అన్నారు. ఆసేవకుని పని ఆనాటితో సరిపోయింది. ఆతడిక ఎవరికి మంత్రించినా ఫలించడం లేదు. శ్రీస్వామివారి చెంత ఆనాటితో ఆసేవకునకు స్థానం పోయింది. శ్రీస్వామివారి సేవకుడవని చెప్పుకుంటూ దేశమంతా తిరుగుతూ పొట్టగడుపుకునే స్థితికొచ్చాడు. ఏమీకోరని శ్రీరోశిరెడ్డి లాంటి సేవకుల ప్రేమకు, కీర్తికాంక్షతో ఆశకు లోపడ్డ ఇతర సేవకులకు బేధం ఇలాగే ఉంటుంది.

## అన్నానికి అగచాట్లు

అక్షయ సంపదలిచ్చే ఆయోగిపుంగవునకు అన్నానికి అగచాట్లు వచ్చాయి. ఒకరోజు మేము తలుపూరులో ఉన్నాము. శ్రీస్వామివారు తనతో తీసుకవెళ్ళే



చిన్నట్రంకు పెట్టెలో ఎప్పుడుపెట్టాడో ఒక సరిగకండువా ఉండచుట్టి పెట్టిఉన్నాడు. ఆసరిగకండువ తీసుకొని నేరుగా ఒకరైతుగారి మిద్దెమీది గదిలోకి వెళ్ళాడు. అక్కడున్న ఇనుపపెట్టె హాండిల్ పట్టుకొని అట్లా తిప్పాడో లేదో తలుపులు టపీమని తెరచుకున్నాయి. శ్రీస్వామివారు ఆసరిగకండువను ఆ ఇనుపపెట్టె (బీరువాలో) లో పెట్టే లోపల ఆ రైతు వచ్చి 'ఓరేయ్ పిచ్చెంకయ్యా తాళామేసిన ఇనప్పెట్టె నెట్లా తెరిచావురా? మాబంతిన కూర్చొని తినమంటే తినవు ఈవెదవనాయాళ్ళందరినీ ఈ విధంగా వెంటేసుకొని తిరుగుతూ ఇట్లాటి పనులు చేస్తుంటావు. అంటూ తన చేతిలోని ముల్లు గద్రతో శ్రీస్వామవారిని ఒక్క దెబ్బవేశాడు. కానీ శ్రీస్వామివారు నవ్వుతూ 'సంజీవయ్యో! వేసేతాళం, తీసేతాళం మనదగ్గరుళ్ళా. అయ్యో! అరచేతిలో బొటినవ్రేలేసి రుద్దితే పేనుకన్నంత మట్టివస్తుందా? ఏముందయ్యా ఈడ' అనిహిత బోధచేసి మేడదిగి వచ్చాడు. ఈసంసారంలో నీవెంత శ్రమించినా నీకేమీదక్కదని అర్థం వంటింటి వైపు వెళ్ళి అంతముద్దుంటే పెడతా అని తలగీరుకుంటూ వినయంగా అర్థించారు. ఆమె కొప్పరించినట్లుగా మొగం చిట్లించి' 'అందరికీ ముద్దలెక్కడనుండి వస్తాయి. అందరూ తినేశారు. ముద్దలేదు గిద్దాలేదు పొండి' అని కసిరికొట్టింది. శ్రీస్వామివారు 'ఆ ఉట్టిమీద సిబ్బెలో కూలోళ్ళకు చేసిన వాటిలో రెండు ముద్దలుండాయి ఇట్లా తెమ్మా' అన్నారు. ఆమె కోపంగానే వెళ్ళి సిబ్బెలో చూస్తే రెండు ముద్దలున్నాయి. వాటిని తెచ్చి కోపంగా శ్రీస్వామివారి దోసిట్లో వేసి ప్రక్కకు తొలగింది. 'అయ్యా ఆవిస్తరాకు రెండు సగాలు చేసి అటొకటి ఇట్టొకవెయ్' అన్నరు. నేనలాగే వేస్తే ఒక్కొక్క విస్తరి పేలికలో ఒక్కొక్క ముద్దసంగటి పెట్టి మరలా' వంటామె దీంట్లోకేమన్నా అంతవెయ్యమ్మా అన్నారు'. 'దానిలోకేముంది? ఏమీలేదు' అని నారమ్మకసిరికొట్టింది. 'ఆటెంకాయ చిప్పలో చింత ఆకు పొడి ఉంది. ఇట్లాతేమ్మా' అన్నారు ఆమె విసురుకుంటూ కస్సుమంటూనే ఆచింతాకు పొడివేసే టెంకాయ చిప్ప తెచ్చి అక్కడ పడేసి వెళ్ళింది. 'అయ్యా ఆపొడిని వేలు కద్దుకొని ఆముద్దపైన ఈముద్దపైన అట్లారాయయ్యా' అన్నారు. నేనట్లాగే చేశాను. ఈలోగా మిరాత్మకూరు శేషారెడ్డి (స్వామివారితో వచ్చినభక్తుడు) పెద్దగడ్డంతో కళ్ళెర్రజేసి చూస్తున్నాడు.

'స్వామి ఈలాంటి వెధవల ఇండ్లకెందుకు తీసుకవస్తాడు? బంగారంగా కళ్ళ కద్దుకొని అన్నం పెట్టేవాళ్ళను వదిలేసి ఈపాపిష్టి కొంపకు తీసువచ్చాడే' అని గొనుగుచున్నాడు.

స్వామివారు మరలా ఆమెతో 'అమ్మో ఆయనకన్నిరెళ్ళలుంటే పెట్టమ్మో' అన్నారు. 'అబ్బయ్యకూడా తిని పోయాడు. ఇక అన్నం లేనేలేదు' అని ఖండితంగా చెప్పేసింది 'ఆ వండిన గిన్నెలో చెయ్యి పెట్టమ్మా అన్ని మెతుకులుంటాయి' అన్నారు. శ్రీస్వామివారు ఆమె విసురుగా ఆగిన్నె తెచ్చి శ్రీస్వామివారిముందు పడేసి ప్రక్కకు పోయింది. 'అయ్యా ఆగిన్నెలో చెయ్యిపెట్టు, అన్ని మెతులు చిక్కుతాయి. వాటిని ఆయన విస్తట్లో వెయ్యయ్యా' అన్నారు. నిజానికది ఖాళీగిన్నె. శ్రీస్వామివారి మహిమేమోగాని ఆగిన్నె తుడిస్తే దండిగా అన్నం చిక్కింది. దాన్ని శేషారెడ్డి విస్తర్లోవేశాను 'అమ్మా నీకు పుణ్యముంటుంది. ఆ ఉట్టిమీద ఉండే సొరకాయ కూర అంత వెయ్యమ్మా' అని ప్రాధేయపడ్డారు శ్రీస్వామివారు మరలాకూడా ఆమె ఆకూర గిన్నె తెచ్చి స్వామివారి ముందుపడేసి వెళ్ళింది. 'అయ్యో ఆగంటితో గంటెడుకూరఆయన విస్తట్లో వెయ్యయ్యా' అన్నారు. నేనలాగేవేస్తే శేషారెడ్డి ఇంక కాస్తవెయ్యమన్నారు. 'ఇదేమినా సొంతసొత్తుగాదు. స్వామి వారు చెప్పినంతేగాని ఎక్కువ వేయనన్నాను. ఆయనగొణుక్కుంటూ అన్నం తింటున్నాడు. 'అక్కడట్లా, ఇక్కడిట్లా అనుకోకుండా తినయ్యో' అన్నారు నాతో. అంటే శేషారెడ్డికి అన్నము నాకు సంగటి పెట్టించారే స్వామి' అని అనుకోవద్దని శ్రీస్వామివారి భావం. ఈ మాట అంటూ సంగటి తినకుండానే స్వామివారు ఎటో వెళ్ళిపోయారు. నేనారెండు ముద్దలు సంగటీ తినేశాను. శ్రీవారి మహిమ వలన వేలుతో పూసిన చింతాకుపొడి కారమే సంగటి ముద్ద కంతకూ సరిపోయింది.

## హితబోధ I:

మనలోని రజోగుణం, తమోగుణాలు ఎంతహీనాతిహీనంగా మనకండ్లు కప్పెడు తాయోచూడండి. శ్రీస్వామివారి రూపంలో సాక్షాత్తు భగవంతుడే భూమిమీద



సంచరిస్తూ భక్తులనుద్ధరిస్తున్నారు. అందుకు నిదర్శనం, వారి నుండి ప్రకటమయ్యే దివ్యమహిమలే. అసంఖ్యాకమైన భక్తులకు డాక్టర్లకు అలవిగాని వ్యాధులు నయంచేస్తున్నారు. ఎంతో మందికి రాబోవు ఆపదలు ఎలా తప్పుకోవాలో తెలిపి రక్షిస్తున్నారు. అందుకే ప్రజలందరూ వారిని ఎంతో పూజ్యభావంతో శ్రీస్వామివారని పిలుస్తున్నారు. కానీ తమో, రజోగుణాల వలన కన్నులు తెరువలేని స్థితిలో శ్రీస్వామి వారిని గౌరవించకున్నా వరవాలేదు. వారి మహిమను గుర్తించకున్నాపరవాలేదు గాని సాటిమానవుడనే గౌరవంకూడా లేకుండా చెయ్యి చేసుకోవడం ఎంత హీనమైనప్రవర్తనో చూడండి. ఎంత సిరిసంపదలున్నా, సత్‌సంగము, సత్‌గ్రంధ పఠనలేని కారణంగా ఎంతటి ఘోరపాపానికొడిగట్టాడో చూడండి సాక్షాత్తు భగవంతునిపైచేయి చేసుకోవడమంటే ఎంత ఘోరపాపం! శాంతమూర్తి, దయామూర్తి అయిన శ్రీస్వామివారు అతని అజ్ఞానానికి నవ్వుకున్నారేగానీ పల్లెత్తుమాట అనలేదు. సరికదా ఎంతో జాలితో హితబోధచేశారు. అరచేతతికి బొటనవ్రేలు వేసిరుద్దితే పేనుకన్నంతమట్టి వస్తుందా అని ఆభక్తునకి హిత బోధచేశారు.

నీవు ఈ సారంలేని సంసారంలో సాధుసత్‌పురుషులకు అంత అన్నం పెట్టకుండా ఎంతగింజులాడి కూడ పెట్టినా, పడరాని పాట్లుపడి సంపాదించినా చివరకు పేనుకన్నంత కూడా నీతోరాదు. అని సాక్షాత్తు భగవంతుడే స్వయంగా చెప్పినా అతని బుర్రకెక్కలేదు. గనుకనే ఆనాడు లక్షాదికారిగా ఉన్నా! వృద్ధాప్యంలో చివరకు శ్రీనాధసార్వభౌమునివలె సర్వసంపదలూ పోయి చాలాగడ్డు పరిస్థితులనుభవించారు.

వీరిజీవిత విధానానికి పూర్తి వ్యతిరేక జీవనవిధానమవలంభించారు. అక్కిం వెంకట్రామిరెడ్డిగారు. వీరు తనకున్న పేదగంజిలోనే ఎంతో శ్రద్ధాభక్తులతో శ్రీస్వామివారికి అనేక రోజులు ఆతిద్యమిచ్చేవారు. వీరు సమర్పించినది సంగటి ముద్దే అయినా వారు సమర్పించిన భక్తిభావం ప్రధానం.అందుకే జీవితాంతం వీరికి లేమి అనేది దరిరాకుండా సంపద అనుగ్రహించారు. ఏ ఆదివ్యాధులు

లేకుండా మహాసమాధి అనంతరం కూడా ఆదుకొనుచున్నారు. అందుకే జన్మజన్మలకు సాధుసజ్జనుల సాంగత్యము సత్‌సంగము వీడరాదని శాస్త్రాలన్నీ ఘోషిస్తున్నాయి. ఈ లక్షాధికారి జీవితానికి అ॥వెంకట్రామిరెడ్డిగారి జీవితానికిగల తారతమ్యమే మనందరికీ కన్ను తెరిపించే హిబోధగా శ్రీస్వామివారు మనకనుగ్రహించారు.

శ్రీస్వామివారొకప్పుడు 'డొక్క సుద్ధి చేసుకుంటే దొరలే అవుతారయ్యో అంతేగానీ ఊరకేదేశంతిరిగితేగాదు' అని శెలవిచ్చారు. డొక్క సుద్ధంటే ఉపవాసాలుండడం మాత్రమేనని మనంపొరబడరాదు. ఇక్కడ సత్‌సంగం, సత్‌గ్రంధ పఠన సాదుసాంగత్యం అని ఆమాట కర్థం అని మనం గ్రహించాలి. పై సత్కాలక్షేపాలవలన మానవుడుగా పుట్టిన మన మేమిచేయాలో తెలిసివస్తుంది. అంతేగాక నిజమైన సత్పురుషులను గుర్తించి తగువిధంగా సేవించే సంస్కారం ఏర్పడుతుంది. అప్పుడు ముముక్షు మార్గంలో జీవిస్తాడు. మెదడుకు మేతపెట్టి మనలోని దుర్గుణాలు బాపుకొన్నప్పుడే మనం దొరలమవుతామని శ్రీస్వామివారు సెలవిచ్చారు.

## అన్నానికి అగచాట్లు

ఒకరోజు శ్రీస్వామికొరకు అన్నం నీళ్ళు లేకుండా అడవిలో వెతికి వెతికి చివరకు తెగచర్లదగ్గరకలుసుకున్నాను. నన్ను నేరుగా తెగచెర్లలోని ఒక పేదరాలింటికి తీసుకవెళ్ళారు. వాళ్ళు అప్పుడే సజ్జలు దంచి కడిగినందున తొట్టినిండా కుడితి నీళ్ళున్నాయి. స్వామివారు తన చేతికర్రతో ఆ తొట్టిలోని కుడితిని బాగా కలబెట్టి ఆతొట్టిమీదకు తాను వంగి తననోటితో పశువులు త్రాగినట్లు, ఆ తొట్లోని కుడితిని సగానికి త్రాగేశారు. నాతో 'అయ్యా దాహంగా ఉందా రెండు గుక్కలు చెయ్యిపెట్టకుండా నోటితో త్రాగిరా అని శెలవిచ్చారు. శ్రీవారి ఉచ్ఛిష్ట దొరికిందే చాలని నేనుకూడా వంగి కొంచెం త్రాగాను కానీ శ్రీస్వామివారు త్రాగినంత ప్రీతిగా త్రాగలేకపోయాను. వాసనతో కూడిన ఆకుడితి వారి స్పర్శతగులుతూనే పాయసంగామారి ఉంటుంది.



ఒకరోజు ఉదయం పదిగంటలకు శ్రీస్వామివారు నన్నుతీసుకొని గుగ్గిళ్ళు అమ్ముకునే పచ్చాసుబ్బమ్మ ఇంటికి వెళ్ళారు. 'అమ్మా ఈయన, కన్ని సద్దిపిసుళ్ళు పొయ్యమ్మా అని అర్థించారు. తనదగ్గర గింజలు లేక ముందటి రాత్రి పస్తున్నానని ఇప్పుడు కుండలు కడుక్కుంటున్నానని సవినయంగా విన్నవించింది, ఆపేదరాలు. అట్లా పళ్ళేదమ్మా నీవా సంగటి కుండలోచెయ్యిపెట్టి తుడిచిచెంబెడునీళ్ళు పోసి ఒక పుల్లతోకలబెట్టిపొయ్యమ్మా' ఆతల్లి మారు పలక్కుండా అలాగే చేసింది. అక్కడున్నది ఉగ్గుగిన్నెడే అయిన రెడ్డిగారికి తృప్తిగా సరిపోయింది. శ్రీస్వామివారి అమృతవాక్కు ఫలితమే ఆవిధంగాతృప్తినిచ్చిందని అ॥వెం॥రెడ్డిగారు గుర్తించి భక్తితో శ్రీస్వామివారికి ప్రణమిల్లారు.

అది మధ్యహ్నం మూడు గంటల సమయం. గ్రామస్తులంతా బోజనాలు చేసి పాత్రలు శుద్ధిచేసి తిరిగి రాత్రిభోజనాలు వండేందుకు తయారయ్యేవేళ. శ్రీస్వామివారెక్కడెక్కడో తిరిగి షుమారు డెబ్బైమందిని వెంటబెట్టుకొని వస్తున్నారు. తలపాగచుట్టి, తుపాకిలాంటి చేతికర్రను భుజాన పెట్టుకొని రాజఠీవితో రాజాదిరాజు తనబలగముతో తరలివచ్చినట్లు వస్తున్నారు. ఆరోజుల్లో మాగ్రామం వస్తే మా ఇంటికి తప్ప మరొకరి. ఇంటిగడప త్రొక్కేవారు కాదు. శ్రీస్వామివారినంత దూరాన చూచి ఇంట్లో సంగటేమైనా ఉందేమోనని అడిగాను. బొత్తిగా లేదన్నారు. అప్పుడు సంగటి చేసే వ్యవధిలేనదని గ్రామంలోకి బిక్షకు వెళ్ళివస్తానని శ్రీస్వామివారికి విన్నవించాను (ఆరోజుల్లో మా గ్రామాలలో కలికానికి కూడా బియ్యం దొరికేవిగాదు) ఊరంతా తిరిగినా రెండు ముద్దల సంగటి మాత్రమే దొరికింది. ఆసంగటి శ్రీస్వామివారి ముందుంచి తరుణోపాయం అర్థించాను. 'అయ్యో చిన్నబానలో కడివెడు నీళ్ళుపోసి దోసెడు ఉప్పువేసి చెయ్యి పెట్టకుండా కర్రతో కలబెట్టి అందరకీ పోయమన్నారు. ఆ సంగటి కలిపిన నీళ్ళను అందరూ తృప్తిగా త్రాగి బ్రేవ్‌మని తేపారు. చివరకొక దొశడు నీళ్ళు మాత్రమే మిగిలాయి. శ్రీస్వామివారిని త్రాగమని అర్థిస్తూ నంజుకొనుటకు అనుపాక మేమీ లేదని విన్నవించారు. రెండు ఎండుమిరపకాయలు ఒక తెల్లపాయ ఒక ఉప్పుగల్లు

మూకుట్లోవేసి నలిపి తీసుక రమ్మన్నారు స్వామివారు. అలాగే చేసి తెస్తే ఆకారం నంజుకుంటూ ఆ దోశెడు నీళ్ళు లొట్టలేస్తూ త్రాగి ఆ! సరిపోయిందయ్యా అని తన తృప్తిని వ్యక్తం చేశారు. ఆవిధంగా ఆవిశ్వవిభుడు రెండుముద్దల సంగటితో ఎనబైమంది ఆకలి తుష్టుగా తీర్చారు.

ఒకరోజు స్వామివారు కలిచేడు ప్రక్కనున్న సిద్దలయ్య కొండకు పోవాలని నాబండి కట్టమన్నారు. అట్లాగే బండిలో శ్రీ స్వామివారిని తీసుకవెళ్ళాను. శిద్దలయ్య కొండకు పోవాలంటే కళ్ళేరుదాటాలి. వెళ్ళేటప్పుడు కొద్దిపాటి ప్రవాహం ఉండింది గనుక బండి సులబంగా నీటిని దాటి అవతలగట్టు చేరింది. అక్కడ కొంతసేపున్నాక 'అయ్యా ఆ ఎద్దుకన్నిగడ్డిపోగులెయ్య కూడదా' అన్నారు. శ్రీ స్వామివారు. అక్కడున్న ఆశ్రమవాసికి గడ్డివామి ఉంది. ఆయన్ను కొంచం గడ్డి ఇమ్మనిఅడిగాను. కానీ ఆయన చాలా కోపగించుకొని వచ్చి నోళ్ళందరికి గడ్డి ఇవ్వదానికేనా మేముండేది "అని మాట్లాడుతూ" గడ్డి ఇచ్చేది లేదు పొమ్మన్నాడు. ఇకచేసేది లేక ఆకలి దప్పికతో గింజుకుంటున్న ఎద్దులకు ఇంటి దగ్గరన్నా గడ్డి నీళ్ళు పెడుదామని బండికట్టాను. వచ్చేటప్పుడు ప్రవాహం లేదు. కానీఇప్పుడు నది నిండుగా గట్లు తన్నుకొని సుళ్ళుతిరుగుతూ ప్రవహిస్తుంది. ఎద్దులు తీవ్రమైన ఆకలితో ఉన్నందున అడ్డదిడ్డాలుగా గుంటలలోకి లాగాయి. బండ్లుదింపే మార్గంకాని సుడిగుండాల మీదుగా నదిలోకి లాగాయి. నేను ప్రాణభీతితో గట్టిగా కన్నులు మూసి గట్టిగా నగలు పట్టుకున్నాను. బండి బరువుకు నీటిలో మునిగిపోయి ఎద్దులగొంతులు పట్టెళ్ళలో బిగుసుకొని చనిపోవాలి. చిత్రంగా బండి నీళ్ళమీద బెండులాగ తేలుతుంది. ఎద్దులు అటు ఇటు తమక కుండా ఈది అవతల గట్టుకు బండిని సురక్షితంగా చేర్చాయి. ఎలా ఆలోచించినా అది శ్రీ స్వామివారి కృపేగానీ ఇతరము కాదు. అంతపెద్ద ప్రవాహంలో బండి ఎద్దులు కొట్టుకొని పోవాలి. అలాజరుగలేదంటే వారి భక్తరక్షణ ఏమని చెప్పాలి! నేను ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్నానుగానీ శ్రీ స్వామివారిని ప్రార్థించనేలేదు.మనం ప్రార్థించని ఆపదసమయాలలో కూడ శ్రీస్వామివారు



మనలను రక్షించి ఆదుకోవడమే వారి గొప్పతనం.

శ్రీ స్వామివారు మంచి ప్రాయంలో ఉన్నారు. బాగానడిచేవారు. అప్పుడు శ్రీ స్వామివారు క్షౌరం చేసుకునే పద్ధతి చిత్రంగా ఉండేది. తనచేతిలో ఎప్పుడూ ఏమారకుండా కపిలమోకు ముక్కకు ఒక కొసన నిప్పంటించిపట్టుకొని ఉండేవారు. ఆ నిప్పుతో తల గడ్డంలోని వెంట్రుకలను శుభ్రంగా కాల్చేసేవారు. చేతితో తవిడి వెంట్రుక తగిలిన చోట మరలా కాల్చేవారు. ఆ విధంగా తల, గడ్డం ఎప్పుడూ నున్నగా ఉంచుకునేవారు. నీళ్ళలోమునిగి తల గడ్డం గుడ్డతో రుద్దుకొనేవారు. అంతేగాని మంగలివారిదగ్గర క్షౌరం చేయించుకునేవారు కాదు. (అ॥వెం॥ రెడ్డి చెప్పారు)

శ్రీ స్వామివారు ఎక్కడంటే అక్కడ కూర్చోరు. తన నడుంవెనుకరెండుచేతులు కట్టుకొని వంగి గట్టిగా శ్వాస పీలుస్తూ ఆ స్థలాన్ని పరిశీలించేవారు. అక్కడ కూర్చోవచ్చని వారికితోస్తే తన చేతికర్రతో అక్కడున్న ఆకు అలము పుల్ల పుడుచు ప్రక్కకు త్రోసి తాటిమట్ట వేసుకొని కూర్చునేవారు.

### శ్రీ స్వామివారి మహా సమాధిని గూర్చి అక్కిం వెంకట్రామిరెడ్డి ఇలా చెప్పారు.

1982 ఆగష్టు 23వ తేది రాత్రి నాకొక స్వప్నదర్శనమైంది. పగలంతా పొలాల్లో పనిచేసినందున ఘాడంగా నిద్రపోతున్నాను. రాత్రి 12 గం॥ ప్రాంతంలో శ్రీ స్వామివారు నా స్వప్నంలో వచ్చి నిద్రపోతున్న నన్ను తనచేతి కర్రతో నాడొక్కలో ఒక పోటు పొడిచి నిద్రలేపాడు. 'నీకింకా నిద్రపడుతుందే. అక్కడ సాదయ్యా ఎల్లిపోతే - అక్కడ కొచ్చి ఏదైనా అందుకోకుండా ఇంకా నిద్రపోతున్నావే' అని చెప్పి అదృశ్యమయ్యారు. వెంటనే నిద్రలేచి ఆరాత్రి వేళకాలినడకన కసుమూరు మీదుగా నడిచి తెల్లవారే సరికి గొలగమూడి చేరాను.

ఒకసారి శ్రీ స్వామివారు అన్నారు 'డొక్కసుద్ది చేసుకుంటేగదయ్యా దొరలయ్యేది ఊరకే తిరిగితే ఏమవుతుంది! మరొకసారి తననుగూర్చి 'పెట్టిలోకి పోయి తాళం వేసుకుంటే అనాడు గదా కొమ్మగట్టి మండలిచ్చుకు పోయేది. ఇప్పుడు పారవిడిస్తే

ఏముంది పాతాళలోకానికి తొక్కేస్తారు. అబ్బోపార విడవకూడదే' అని అన్నారు. అక్కిం వెంకట్రామిరెడ్డిగారిచే అర్ధరాత్రి వేళ గట్లు తన్ను కొనిపారే కళ్ళేరు దాటించడం, రేపల్లెలో గొప గోవికలు పాలు పిండడం, ఆలమందలను జాగ్రతావస్థలో అ॥వెంకట్రామిరెడ్డిగారికి చూపించడం. శ్రీస్వామివారు నిండుగా పారే కళ్ళేరు నీటిపై పసిపిల్లవానివలె జలక్రీడలాడుతుండడం, మల్లెం కొండ మామిళ్ళకోన వ-నవులకు దుర్భేద్యమైనా శ్రీ స్వామివారు తనయోగశక్తితో రెడ్డిగారిని కూడా తీసుకవెళ్ళడం, గొలగమూడిలో పెగ్రరాజుగుంట దగ్గర భయంకరమైన సర్పాల దర్శనం. మొదలైన విషయాలు అవధూతలీలలో చూడవచ్చు.

ఒకరోజు శ్రీస్వామివారు ఈ విధంగా జ్ఞానాన్ని బోధించారు.

'అయ్యో కుల్లూరు ఈడిగ సుబ్బమ్మ ఇంట్లో రెండు నగుళ్ళు ముదిగేడు గ్రామదేవత ముదిగే డమ్మ కాద మూడునగుళ్ళ, గొలగమూడి ఆంజనేయస్వామి దేవ స్థానానికి, పుట్టస్వామికి మద్య మూడు నగుళ్ళు లేచాయి. ఆనగుళ్ళేమిటో ఆయన కనుకున్నాడయ్యో. నీవు ఆయన్ను కనుక్కో'. అని 30-7-94 న శ్రీ అ॥వెం॥ రెడ్డి గారికి ఆదేశమైంది. వారు నన్ను (రచయితను) ఈ విషయం అడిగితే నేనేమి చెప్పగలను. ఏమీ చెప్పలేదు. ఆ తర్వాత శ్రీస్వామి వారే వారిద్వారా ఈ క్రింది విషయం తెలిపారు. ఆ ఎనిమిది నగుళ్ళు మనలో ఉండే ఎనిమిది గుణాలు. 'అష్టమదాలు'. అవిమనలో ఉన్నంతవరకు పైవాళ్ళు మనలను వాళ్ళలోకాలకు రానీయరు. వాటిని మనమే ఎవరికి వారు చంపాలి. అలా చంపితేనే పైవాళ్ళు రానిస్తారు. అప్పుడు డొక్కశుద్ధి అవుతుంది. డొక్కశుద్ధి అయినవాడు దొర అవుతాడు. అప్పుడు ముడ్డి కడగాలి. ముడ్డి కడిగితేగదా మోక్షం కలిగేది. (ముడ్డి కడగడమంటే గుదస్థానములోని 'కుండలినీ' జాగృతమవడమనుకుంటాను) ఈవిధంగా చేస్తే పదోచూపు అందుతుంది. పదోచూపు అందగానే పావనాల చూపు అడ్డమొస్తుందయ్యో. మాష్ణాలాయన ఆచూపును అందుకుటాడయ్యో. దాన్ని పెద్దదేవుడు పెరుక్కొని అమ్మచేతికిస్తాడు,



వరుపెయ్యామని ఆవరువులో ఏమితేలివస్తుందో అప్పుడేగదయ్యో మొనగాడయ్యేది'.

ఒకప్పుడు శ్రీస్వామివారు గొలగమూడి ఆశ్రమంలో తమ అగ్నిగుండం ముందు కూర్చొని తన నిర్విరామయజ్ఞమైన వేలిముద్రలు వేసే కార్యక్రమం సాగిస్తున్నారు. అది సాయం సంధ్యా సమయము. చెట్లపైన కొంగలు, పిట్టలు, చేరి అరుచుకుంటూ ఉన్నాయి. శ్రీస్వామివారు అన్నారు. 'అయ్యో! నాలుగు ప్రక్కలకు పోయి తిరిగి తిని వచ్చెనే, గమ్మని ముడుక్కోకుండా తగవులాడు కుంటున్నాయి చూడయ్యా'

అందుకు శ్రీ అక్కిం వెంకట్రామిరెడ్డిగారు స్వామీ అవి తగవులాడుకుంటున్నట్లు మీ కెట్లా తెలుసు? స్వామి' అన్నారు. స్వామివారు 'అబ్బో! మనం అన్నిభాషలూ చదివుండ్లాయ్యా అని సెలవిచ్చారు.

'అన్ని జీవులలో వెంకయ్య ఉన్నోడని 'వ్రాసుకోయ్యా' అని శ్రీ స్వామివారన్నారు గనుక పిపీతికాది బ్రహ్మపర్యంతం వారికి తెలియనిదేముంటుంది!

ఒకరోజు శ్రీ అ॥వెంకట్రామిరెడ్డిగారికి శ్రీస్వామివారీ విధంగా జ్ఞానాన్ని బోధించారట.

'కుదురేస్తే గదయ్యా కుండదొర్లకుండా ఉండేది.

'కుదురుగట్టిగా కట్టుకొని వేసుకోయ్యో'. మరొకరోజు చెప్పారు :- 'అయ్యా చేపలగంప ఎత్తుకున్న వాని సామాసం (friendship) చేస్తే ఏమొస్తదయ్యో'

అ॥వెం॥రెడ్డి :- చేపల వాసనే గదా స్వామీ ఇంకే మొస్తుంది.

శ్రీ స్వామివారు :- అత్తరు పన్నీరు అమ్ముకునే వానితో గుద్దులాడితే ఎట్లా ఉంటుంది?

అ॥వెం॥రెడ్డి :- వాని వంటికి పూసుకున్న అత్తరు పన్నీరు సువాసన మనకు కూడా వస్తుండ్లా స్వామీ.

1. శ్రీ స్వామివారు :- ఆ : అంతే : అది తెలుసుకొని మసలు కో చేపలమ్ముకునే వానితో ఎన్నడూ చేరకుండా ఉండయ్యే. చెడ్డవాని స్నేహ మెన్నడూ చేయవద్దని, మంచివానితో (ఆధ్యాత్మిక సత్పురుషులతో) గద్దులాడిని (విరోధించినా) మంచే జరుగుతుందని శ్రీ స్వామివారు సెల విస్తున్నారు.


ఒకరోజు శ్రీస్వామివారు జొన్నలు బండపై నూరి సన్నపొలుకులు చేసి చీమలకు చల్లుతున్నారు. అక్కిం వెంకట్రామిరెడ్డిగారు అదిచూచి శ్రీస్వామివారి నుండి ఏదోవినాలనే సరదాతో 'స్వామీ! ఆజొన్నలు ఆవిధంగా నూడకుండా చల్లేసి ఉంటే ఎంతబాగుండును. వర్షమొచ్చినపుడు అవి మొలచి పెద్దవైతే పశువులన్నీ తినును గదా? అప్పుడిట్లా పొడిచేసి చెట్లల్లో పుట్టల్లో చల్లి ఏం ప్రయోజనము స్వామీ' అన్నారు అప్పుడు శ్రీస్వామివారిట్లా అన్నారు.

'అయ్యోవచ్చినా! రా' అంటూ తనచెవిని చీమల చేరుకు చేరువలోవుంచి, ఏదో వినినట్లు భంగిమచేసి 'చూడవయ్యా చీమలు సన్నాయి మేళాలతో, గిడుగిడు మేళాలతో పెండ్లిచేసుకొని వెళుతుంటే వాటికి దిక్కెవ్వరు. ఈ నూకలు మనం చల్లితే చీమకొక పొలుకు చొప్పున ముక్కున బెట్టుకొని పరుగులు తీస్తున్నాయి. చూడు! అన్నారా విశ్వవిభుడు. 'చీమలకు నూకలు చల్లితే మంచి దిగదయ్యా వాటి పెండ్లిడ్లు చేసుకొని బందులందరికి విందు పెట్టుకుంటుండ్లా' అన్నారా చల్లని తండ్రి. అందుకే గాబోఅ తులసమ్మగారు జీవించినంత కాలం విధిగా ప్రతినిత్యం చెట్లలో పుట్టల్లో నూకలు చల్లుతూ ఉండేవారు.

ఒకరోజు శ్రీస్వామివారు ఈ భక్తునికి జ్ఞానాన్ని ఇలా భోదించారు. 'అయ్యో! పిల్లి తన తోకముడుచుకొని కూర్చున్నట్లు మనం మన మనసు ముడుచుకొని కూర్చోవాలయ్యో'. 'పిల్లి తన ముడిచిన తోకను కదిలిస్తూ తనపిల్లలకు సర్వవిద్యలు నేర్పింస్తుండయ్యో' ఇచ్చట శ్రీస్వామివారు మార్జాల కిశోరన్యాయాన్ని గూర్చి ముచ్చటిస్తున్నారు. అదే వారి దివ్యప్రేమ.



## వల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డిగారు



వీరు మాతాజీ తులసమ్మగారి ఏకైకపుత్రుడు. తాను నమ్మిన సత్యాన్ని నిర్భయంగా, నిర్మొహమాటంగా చెప్పగల ధీరుడు. వీరికి భక్తి అనే మాటకు అర్థం తెలియని కుర్రకారు ప్రాయమది. ఒకనాడు శ్రీస్వామివారు వీరి మిద్దెపైన అగ్నిహోత్రాన్ని సాగిస్తున్నారు. శ్రద్ధాభక్తులు లేని ఆమిడిసిపాటు వయసులో శ్రీస్వామి వారిని వారిసేవకులను తన నోటికొచ్చినట్లు మాట్లాడి అందరిని తనగృహం వదలి వెళ్ళమన్నారు. అందరూ వెళ్ళినా శ్రీస్వామివారు తన అగ్నిహోత్రం దగ్గర నిర్వికారంగా కూర్చొనియున్నారు. రెడ్డిగారు ఆరడుగుల వెదురుకర్ర తీసుకొని దుర్భాషలాడుతూ శ్రీస్వామివారిని తన గృహంవదలి వెంటనే వెళ్ళిపొమ్మని గద్దించారు. అమాయకుడైన పసిపిల్లవాని వలె శ్రీస్వామివారు మిద్దెమెట్లు దిగి క్రిందికి వచ్చేశారు. రెడ్డిగారు మెట్లపైనున్నారు. శ్రీస్వామివారు రెడ్డిగారిని చూస్తూ ఎంతో అమాయకంగా మృధువైన కఠంతో అనునయంగా 'పొమ్మంటాయ్యా' అన్నారు. 'పో' అంటూ దబాయిస్తూ దుర్భాషలాడారు. శ్రీస్వామివారు వారి గృహాన్ని వదలి వెళ్ళిపోయారు. వారి నిర్భయత్వం ఎంత పరాకాష్టకు చేరిందో చూడండి. దైవీ సంపదలక్షణాల్లో నిర్భయం మొదట చెప్పబడింది.

గొలగమూడిలోని శ్రీస్వామివారి ఆశ్రమానికి తాను కోశాధికారిగా నున్నంత కాలమూ 'క్యూ' కు అడ్డంగా పెద్దవారిని శ్రీస్వామివారి దర్శనార్థం తీసుకపొమ్మని ఏనాడూ ఆజ్ఞాపించి ఎరుగరు. తానుగా తీసుక వచ్చిందీలేదు. ఎంతపెద్ద ఆఫీసర్లు వచ్చినా సరే అందరినీ సమానంగా నేలపై చాపలు పరచి కూర్చొపెట్టేవారేగాని కుర్చీలు వేసి ఎరుగరు. ఆ ఆఫీసరుగారి అనుచరులు త్వరగా శ్రీస్వామివారి దర్శనం ఇప్పించమని తనను కోరినప్పుడు వారితో మాటవరుసకు సరేనని చెప్పేవారు. తిన్నగా ఆ ఆఫీసరుగారి దగ్గరకు వెళ్ళి

'తమరు కావాలంటే వెంటనే అడ్డుత్రోవన దర్శనానికి పంపుతాను. కాని తమరింత శ్రమపడి వచ్చినందుకు అడ్డుత్రోవన దర్శనానికి వెళ్ళినందుకు సరిపోతుంది. ఇక మీకేమీ మీగలదు. మీ ఇష్టం' అనేవారు. 'అలా అక్కరలేదండీ. ఒక అరగంట ఆగి క్యూలోనే వెళదాం తొందరేమీలేదు.' అని నిదానంగా క్యూలోనే దర్శనానికి వచ్చేవారు. ఎన్ని జన్మలెత్తినా అంతనిర్భయంగా, నిర్మొహమాటంగా నేను మాట్లాడగలనా? ఇదే వారి గొప్పదనం.

కమిటీ మీటింగులో తనను చీల్చి చెండాడి దుర్భాషలాడిన వారితోకూడా, అరగంట ఆగి బయటకు వచ్చి ఎంతో లాలనగా వారి చెయ్యి పట్టుకొని 'నా ప్రారబ్ధం అలా ఉంది. అలా ఆడించింది. నేను చేసింది తప్పేబాబూ. మీరు ఏమీ అనుకోవద్దు'. అని వారితో చేయికలిపి కరచాలనం చేసిన ఘనత వారికే దక్కింది.. 'ఏమిటన్నా ఇలాచేశారే' అనినేనడిగితే 'అంతా పూర్వం చేసిన కర్మఫలితమే కదా! ఈ అనుభవం ద్వారా ఆ కర్మఫలం ఖర్చయింది. ఇప్పుడు రాగద్వేషాలు లేకుండా కొనసాగడమేగదా మనధ్యేయం'. అని నాకు వేదాంతసారం గుర్తుచేసేవారు. నిజంగా వారు తులసిమాత కుమారుడని పించుకున్నారు. అందరిఎదుట తనను దుర్భాషలాడినవారి ఎడలకూడ రాగద్వేషాలు లేకుండా ప్రవర్తించిన ఘనత వీరికే దక్కింది.

ఒక వ్యక్తిని కమిటీ నుండి తొలగించి వేస్తే పోతుందని కొందరు వ్యక్తులు సలహా వీరికిచ్చారు. కానీ వీరు 'ఆయనను తొలగించకూడదు. ఆయన కూడ శ్రీస్వామివారికి ఒకప్పుడు సేవచేసియున్నారు'. అని సలహాయిచ్చారు. ఆ వ్యక్తికి రెడ్డిగారికి ఎంతో తీవ్రంగా భేదాభిప్రాయాలున్న మాట వాస్తవమే కాని శ్రీరెడ్డిగారు ఆవ్యక్తి శ్రీస్వామివారికి చేసిన సేవనే లెక్కలోకి తీసుకొని అలా సలహాయివ్వడం ఎంత గొప్పవిషయమో ఆలోచించండి.

కొందరు బయటి వ్యక్తులు ఆశ్రమంలో అక్రమాలు సాగిస్తున్నారు. వారి నరికట్టగల ధీరులేకరువయ్యారు. చివరకు శ్రీరెడ్డిగారి దృష్టికి వచ్చింది.



నిర్భయంగావారినెదుర్కొన్నారు. ఆదుండగులు రెడ్డిగారిని కొడతామని బెదిరించారు. 'మీకేమాత్రం ధైర్యమున్నా ఒక్కదెబ్బవేసి వెళ్ళమని' నిలుచున్న ధైర్యం ఆశ్రమచరిత్రలో వారికే దక్కింది. శ్రీరెడ్డిగారు ఉన్నంతకాల ఆశ్రమ వాతావరణమే మారిపోయి ప్రశాంతత ఏర్పడింది.

కమ్యూనిటీహాలు ఫౌండేషన్స్ సరిగా నిర్మించబడలేదు. ఫౌండేషన్స్ తొలగించమన్నారు. పదివేల రూపాయలు నేలపాలు చేయడం ఇష్టంలేక కూలీలు వెనుకాడుతుంటే తానే మొదట గడ్డ పారతో, కొంతదూరం ఆ ఫౌండేషన్స్ తొలగించిన ఘనత వీరికే దక్కింది. 'ఇలాంటి ఫౌండేషన్స్ మీద నిర్మించిన భవనం కూలితే అందులో ప్రాణాలు కోల్పోయిన అభాగ్యుల గతి ఏం కావాలి. ఆ పాపం ఎవరు మోయాలి' అన్న వాక్యం వారిచరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచి పోయింది.

1980-81వ సం॥లో షుమారు లక్షరూపాయలకుపైగా తన సొంతపైకం ఖర్చుచేసి శ్రీస్వామివారి సమాధి మందిరం నిర్మించారు. తాను పెనుబర్తి గ్రామంలో నిర్మించబోయే పైమిద్దెకొరకు షుమారు లక్షరూపాయల వ్యయముతో చేయించి ఉంచిన టేకు ద్వార బంద్రములు, కిటికీ ప్రేములు ఆశ్రమంలోని కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కైంకర్యము చేసిన దానకర్ణుడు వీరు.


కొన్ని వత్తిడులు తట్టుకోలేక, కొందరి సలహాలు పాటించి, శ్రీస్వామివారి సొమ్ము కొంత ఖర్చుపెట్టుకున్నారు. అయితే ఆధర్మమూర్తి ఈ పైకం తాను తీసుకున్నట్లు ఆశ్రమ లెక్కలో వ్రాసి వాడుకున్నారు. ఆపైకం సకాలంలో చెల్లించలేక పోయారు. అందుకు నేనొక సలహా ఇచ్చాను. 'మీరు శ్రీస్వామివారికి కైంకర్యము చేసిన టేకు ద్వారబంద్రాలు, కిటికీ ప్రేములు కొన్నట్లుగా లెక్క వ్రాసుకుంటాము. మీరు పైకం మీబాకీకి చెల్లించినట్లు జమవ్రాసుకుంటాము. మీ చేతికి డబ్బురాగానే శ్రీస్వామివారి

హండీలో సమర్పించండి' అని చెప్పాను. అందుకు వారిచ్చిన సమాధానం వారి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించతగియున్నది. 'శ్రీస్వామివారికి కైంకర్యం చేసిన దాన్ని తిరిగితీసుకోమంటారా? చేసిన పాపం చాలక ఇంకామూటకట్టుకోమంటారా? నాబిడ్డలకు అన్నం పుట్టాలనా? లేక వద్దనా మీభావం?' అని బొంగురుబోయిన కంఠంతో శెలవిచ్చారు. ఆసన్నివేశం ఈధర్మమూర్తి చరిత్రలో శాశ్వతంగా నిలచిపోయింది.

వారు కోశాధికారిగా ఉన్నంతకాలం ఆశ్రమానికి కుర్చీలు ఉన్నా వాటిని ఆఫీసు రూములోకి ఏనాడూ రానివ్వలేదు. ఎంతమంది ఆఫీసర్లుగాని, మామూలు వ్యక్తులుగాని అతిథులుగాని వచ్చినా అందరూ ఒకే విధంగాచాపలమీద కూర్చోవలసిందే. అదే వారాచరించి చూపిన శ్రీస్వామివారి పద్ధతి.

ఇట్టి సద్గుణాలరాశి నిజంగా తులసిమాత బిడ్డడై శ్రీస్వామి వారికృపకు పాత్రుడైనారు.

## శ్రీ కొమరగిరి రమణయ్యగారు



శ్రీ కొమరగిరి రమణయ్యగారు, తన దున్నపోతుల బండితో శ్రీస్వామివారి అగ్నిహోత్రమునకు షుమారు పది పన్నెండు సంవత్సరములు అడవినుండి కట్టెలు తోలిన భాగ్యశాలి. వీరిని బండి రమణయ్య అనికూడ పిలవడం కద్దు. వీరు తన జీవితయాత్ర చివరి వరకు శ్రీస్వామివారిని వీడకుండా గొలగమూడిలోనే నివసించారు. కానీ ఏనాడూ ఆశ్రమపాలకుల కట్టడిలో ఉన్నవారు కాదు. ఆశ్రమపాలకులు తనను పోషించాలని కోరినవారూ కాదు. తన ఏకైక రక్షకుడు శ్రీస్వామివారేనని హృదయపూర్వకంగా విశ్వసించిన దన్యజీవి. ఆశ్రమ పాలకులు వీరిని ఏదో ఒక పని ఒప్పగించి అన్న వస్త్రాలు సమర్పించాలని అనేకసార్లు ప్రయత్నించారు.కాని వీరువాచా 'సరేలే స్వామీ' అనేవారేగాని వారిచ్చినపని చేసిందిగాని, వారి పోషణలో ఉన్నది గానిలేదు. గొలగమూడి



ఆశ్రమంలో ఎక్కువగా శ్రీ సుబ్రమణ్యస్వామివారి పుట్టదగ్గర ఉండేవారు. వచ్చిన యాత్రికులలో అనేకమంది తమ వంట తామే చేసుకొని తింటూ శ్రీ స్వామివారి కృపకొరకు వారినిసేవిస్తూ ఉండేవారు. అలాంటివారు సమర్పించిన భిక్షాన్నంతోనే తృప్తిచెంది మరికొందరికి కూడ తనదగ్గరున్న అన్నం పెట్టేవారు.

తనకు అనారోగ్యమై మంచాన ఉంటే ఎవరుచూస్తారు?అనే ప్రశ్నే లేకుండా జీవించారు. లోకం దృష్టిలో అనామకుడు, బికారి, డబ్బు పిచ్చిగలవాడు.కాని వీరిచర్యలను నిశితంగా పరిశీలించాలనే వారెందరున్నారు? అలాంటివారు చాలా అరుదు. తనదగ్గర కొచ్చినప్రతివారికి తను మంత్రించే గుడ్డతో మంత్రించేవారు. శ్రీ స్వామివారి విభూతి ఇచ్చేవారు. శ్రీ స్వామి వారిని గూర్చి తనకువచ్చిన పాటలు పాడి తనకు శ్రీస్వామివారితో గల అనుభవాలు చెబుతుండేవారు. ఎవరైనా డబ్బు దక్షిణగా సమర్పిస్తే వద్దనకుండా తీసుకునేవారు. తనకై తానుగా వారిని దక్షిణతెమ్మని అడిగేవారుకాదు. ఇలా వచ్చిన దక్షిణపైక మేమి చేస్తారనేదే ప్రశ్న! ఈ లోకం ఎంత చిత్రమైనదో ఈ మహనీయులు అంతకంటే చిత్రంగా ఉంటారు. మీ ముందుంచే ఈ స్వల్ప విషయాలు వారినిజజీవిత విధానానికి మచ్చుతునకలుగా నిలువగలవని ఆశిస్తాను.

ఒకరోజు విజయవాడనుండి నా మిత్రులు వచ్చి శ్రీస్వామివారి దర్శనానంతరము ప్రక్కనున్న సమాదులు దర్శిస్తూ అక్కడే అరుగుమీద కూర్చొనియున్న వీరిని కూడా చూచారు. నా పరిచయ వాక్కులైపోగానే వారిలో భర్త ఇరవైరూపాయలు, భార్య పదిహేను రూపాయలు దక్షిణగా సమర్పించి వస్తూ, మిగిలిన సమాదులను గూర్చి నేనుచెప్పే విషయాలు శ్రద్ధగావింటున్నారు. ఇంతలో ఆ సమాదుల ప్రక్కనుండి మరొక జంట పోతున్నారు. వారిదగ్గర భర్తచేతిలో ఇరవైరూపాయలనోటు, భార్య దగ్గర పదిరూపాయలనోటు, ఐదురూపాయలనోటు ఉన్నాఇ. వాళ్ళు కొండంత సంబరంగా పోతుంటే నేను మాట్లాడుతూనే కన్నుసైగతోకారణమడిగాను. వాళ్ళు శ్రీ రమణయ్యగారిని చూపిస్తూ పోతున్నారు. నా విజయవాడ మిత్రుడు, వారి భార్య శ్రీ రమణయ్యగారికి సమర్పించిన దక్షిణ మరుక్షణంలో వారిచేతులతోఉందన్నమాట. అలాంటిదివారి డబ్బుపిచ్చి.

మరొకరోజు నేను మందిరానికి వెళ్ళుతున్నాను. మార్గమద్యంలో పుట్టదగ్గర శ్రీ రమణయ్యగారు నన్ను పలకరించి 'స్వామీ నాకొక బ్లేడు తెప్పించి పెట్టండీ' అంటూ నాచేతిలో ఒకరూపాయినోటు పెట్టారు. 'నీవుగడ్డం గీచుకోవుగదా. మరి బ్లేడెందుకు స్వామీ' అన్నాను. 'స్వామీ ఈమూటకు కట్టిన దారం ఎంతసేపటికి ఊడిరాలేదు. బ్లేడుతెచ్చి కోసేస్తామని స్వామీ' అన్నారు. 'నీపిచ్చి దొంగలు తోలా! ఆదారం రాలేదా? ఏదీ! అంటూ ఆదారాన్ని పుటుక్కున తెంచేశాను. 'తెగిందా స్వామీ? ఎంతసతాయించిందీ దారం! అంటూ నవ్వుకుంటున్నాడు. ఒకవేళ అలాంటి దారం రాకుండా సతాయిస్తే మనలాంటి వారమైతే ఎక్కడైనా చాకో, కత్తో, కొడవలో తెప్పించి ఆదారం తెగ్గోస్తాము కానీ రూపాయిపెట్టి బ్లేడు కొనముగదా? అలాంటిది వారి డబ్బు పిచ్చి!

ఒకరోజు వారికి చాలా విపరీతంగా విరోచనాలైతున్నాయి. లేచి దూరంగా పొయ్యేందుకు శక్తి లేదు. మరి వారి గుడ్డలు శుభ్రంచేసేదెవరు? ఆ స్థలాన్ని శుభ్రంచేసేదెవరు? వారికి స్నానం చేయించేదెవరు?

**వారి ఏకైక రక్షకుడైన శ్రీస్వామివారే** వారికప్పుడు సేవ చేయాలి. పరమ కారుణ్యమూర్తియైన శ్రీస్వామివారు తనను సంపూర్ణంగా విశ్వసించి సేవించే వారికి ఆవగింజంత బాధ కలుగనివ్వరు గదా? వచ్చిన యాత్రికులలో ఎవరో వారికి ఆరోగ్యం కల్గే వరకు సర్వసేవలూ చేశారు. అలాంటి వారు పేదవారైనట్లయితే తనదగ్గరున్న పైకమంతా ఇచ్చి ఖర్చుపెట్టుకోమనేవారు.

రాత్రి రెండు గంటలప్పుడు శ్రీస్వామివారి సమాదిమందిరానికి వెళ్ళి మూడు గంటలకు అభిషేకం చేయడం మా నిత్యకృత్యము. డిసెంబర్, జనవరి నెలలో మేము మా ఉన్నిశాలువలో ముడుక్కొని చలికి వణికిపోతూ పోతుంటాము. అలాంటి విపరీతమైన చలిలో కూడా శ్రీ రమణయ్యగారు తన శరీరంపై ఎలాంటి దుస్తులు లేకుండా కేవలం తనగోచిగుడ్డతో శ్రీ సుబ్రమణ్యస్వామి పుట్టదగ్గర ఎలాంటి ఆచ్ఛాదన లేని కటిక సిమెంటు నేలపై నిర్వికారంగా గురకలు పెట్టి నిద్రపోవడం నేనెన్నోసార్లు ఆశ్చర్య చకితుడనై చూచాను! శీతోష్ణములను సమంగా స్వీకరించగల్గడమనే సాధన, సాధకులలో ఎందరికి సాధ్యమవుతుంది? అది ఒక్క గురుకృపగల వారికే సాధ్యమని



నేను గట్టిగా నమ్మాను.

నేను గొలగమూడికి కాపురం వచ్చాక పదిసంవత్సరాలు వారితో పరిచయముంది. ఈ కాలంలో వారేనాడైనా చివరకు తనను కొట్టవచ్చిన వారితో కూడా శత్రుత్వం వహించిందిలేదు. ఎవరిని గురించిగాని విమర్శించి ఎరుగరు. నాతోనేగాక ఇతరులతో అలాంటి విమర్శలు చేస్తుంటే నాచెవులతో నేను విన్నదిలేదు. ఎన్నిజన్మలెత్తినా ఇలాంటి సద్గుణం నాకు అలవడడం సాద్యమా! వీరి హృదయాంతరాళమునుండి శ్రీస్వామివారు రాగద్వేషాలు ఎంతచక్కగా తుడిచిపెట్టారో!.

తన కైవల్యానికి వారం రోజులమందు అనికేపల్లి సంగంలోగల తన తమ్ముని ఇంటికి వెళ్ళి అక్కడ తన చివరి రుణాను బందాలు పూర్తిగావించుకొని ప్రశాంతంగా శ్రీ స్వామివారి శుద్ధచైతన్యంలో ఐక్యమయ్యారు. ఆశ్రమ సమాదులలో తన సమాది ఉండాలని వారెప్పుడూ ఆశించలేదు. తన సమాదికి నిత్యం సాంబ్రాణి పొగవేసి అందరూ నమస్కరించుకోవాలని కూడా వారాసించలేదన్న మాట.

వీరి జీవిత విధానం పరిశీలించాక నాకు టిబెట్‌యోగి శ్రీ మిలారిపాగారి మాటలూ, ప్రఖ్యాత సంగీతకారుడైన శ్రీ అన్నమాచార్య మాటలు, శ్రీ భరద్వాజగారి మాటలు గుర్తుకువచ్చి నిజమైన మహనీయులు ఎలా ఉంటారో లోకం దృష్టిలో వారెంత పిచ్చివారుగా కన్పిస్తారో తెలిసి వచ్చింది.

**టిబెట్ యోగి శ్రీమిలారెపా అంటారు:-** 'నేను ధ్యానం చేసిన చోట స్థూపాలు నిర్మించినందువలనగాని, నా అస్థికలపై సమాదిమందిరాలు నిర్మించినందువలనగాని మీ కెలాంటి ప్రయోజనముండదు. అలాగే నాకూ ప్రయోజనముండదు.నేను చెప్పినట్లు ఆచరించినందువలన మీకు ప్రయోజనముంటుంది'.

అందువలన శ్రీ రమణయ్యగారి సమాది ఆశ్రమంలో లేనందున వారికేమీ నష్టంలేదు. ఆ సమాదినుండి ఏమైనా నేర్చుకోవాలనే వారికే ఏమైననష్టముండేది.

***భగవద్భక్తుడైన శ్రీ అన్నమాచార్యగారంటారు:***

ఓదేవాదిదేవా! నీకొలువు నర్తకులమైన మేము ఆడి, పాడి, నీకు వినోదము కల్గించవలెనుకాని, మోక్షమిమ్మని మిమ్మడుగ తగునా? మాకు అర్హతగలదని మీకు తోచినప్పుడు అది మీరు మాకు అనుగ్రహించవలసినదేకదా!

అంటే ఆట పాటలుగా సాగుతున్న మన జీవిత విధానం ద్వారా ధర్మమాచరించి భగవంతునకు ప్రీతి గల్గించి, మోక్షమునకు అర్హత సంపాదించాలని శ్రీ అన్నమాచార్యగారు పై చరణము ద్వారా మనకు బోధిస్తూన్నారన్నమాట. **ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరుగారు** 1-11-95 'సాయిబాబా' అనే పక్షపత్రికలో వ్రాస్తారు :- 'నోటి మాటలతో ముక్తిని గూర్చి వాపోయి ప్రయోజనమేముంది. అర్హత సంపాదించుటకు, సాధన, దీక్షతో చేయాలి. అర్హత గల్గినప్పుడు మనము దానిని వద్దన్నా భగవంతుడు అనుగ్రహించి తీరుతాడు. గనుక సాధన ద్వారా అర్హత సంపాదించుటే మన ధ్యేయం. కావాలి.'

శ్రీ రమణయ్యగారిని శ్రీ స్వామివారు ఒకప్పుడు నీకేమి కావాలని అడిగారట. అందుకు రమణయ్యగారు 'ఏముంది స్వామి బ్రతికినన్నాళ్ళు కూడుగుడ్డేగదా'వారలాగే జీవించారు. అర్హత సంపాదించుట కొరకు సాధన సాగించిన ధీరుడు. ఆత్మలో వారికి శ్రీ స్వామివారి యందుగల విశ్వాసమే మనకు వారి చరమోపదేశము.

నాకు ఈ మహనీయునితో గల ఒక చక్కని అనుభవం మీ ముందుంచి శలవు తీసుకుంటాను. మా తల్లిగారు, అప్పటికి ఒక సంవత్సరం క్రిందట స్వర్గస్తురాలయ్యారు. వారు వాడుకున్న ఉన్నిదుప్పటి కనీసం ఐదువందల రూపాయలు విలువచేసేది నాదగ్గరుంది. ఇదిఎవరైన మంచి సాధకుల కివ్వాలని తలచాను. అనేకసార్లు శ్రీ రమణయ్యగారు ఆదుప్పటికి తగిన వారని నా తలంపులలో తోచింది. కాని ఎందుకో నేను వెంటనే వారికి ఆదుప్పటి సమర్పించకుండా ఒక సంవత్సరంపైన జాప్యం చేశాను. ఒకరోజు నేను మందిరం నుండి ఇంటికి వస్తుంటే శ్రీ రమణయ్యగారు నన్ను పలకరించిఆపి 'శ్రీ స్వామివారు మిమ్ములనడిగి ఒక దుప్పటి తీసుకోమన్నారు' అని చెప్పారు. ఆమాట నాకెంతో ఆశ్చర్యము, సంతోషమూ కల్గించాయి. నేనెందుకు వారిని



పరీక్షిస్తున్నానో ఆక్షణంలో నాకు తెలియకుండానే నేనివ్వదలచిన ఉలన్ దుప్పటి మరియొక కాటన్ దుప్పటి వారిముందుంచి నీ కిష్టమైన దానిని ఒక్కటి తీసుకోమన్నాను. ఆశ్చర్యం - నేనివ్వదలచిన ఉన్నిదుప్పటినే స్వీకరించారు. నేను గుర్తించినా, గుర్తించకున్నా వారి నిజస్థితి అదే.

శ్రీ రమణయ్యగారు లోకం దృష్టిలో డబ్బుపిచ్చివాడు, బికారివాడు, తిండిపోతువాడు. నా దృష్టిలోమాత్రం సద్గురుని ఎడల అకుంఠిత విశ్వాసము, సంపూర్ణస్వేచ్ఛ అనుభవిస్తున్న భయరహితుడైన గొప్పసాధకుడు. శీతోష్ణాలను, సుఖదుఃఖాలను మానావ మానములతో కూడిన మానవ సమాజాన్ని మానసికంగా వదలిపెట్టి గీతావాక్యాన్ని ఆచరించే గొప్ప ప్రజ్ఞాశాలి. సంపన్నత్వం, సాధారణత్వం నిజంగా సహజసిద్ధమైన సద్గురుభక్తుడు. నిజమైన వైరాగ్యమంటే ఎలావుంటుందో తన ఆచరణ ద్వారా చూపిన ధీశాలి. అట్టి మహనీయమూర్తికి శ్రీ స్వామివారి కృప ఎంత ఉండేదో తెలిపే నా ఉలన్‌దుప్పటి సన్నివేశంలో చూచాము. ఇట్టి మహనీయమూర్తికివే నాకృతజ్ఞతాభివందనాలు.

జై సద్గురుదేవా.